



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

**పొలిటికల్ పోస్టులపై కేసులు చెల్లవు**

సోషల్ మీడియా పోస్టులపై హైకోర్టు కీలక ఆదేశాలు

04

సంపుటి 08, సంచిక: 281 | గురువారం | 11-09-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## నేటి నుండి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

వారం రోజులు రాష్ట్ర వ్యాపితంగా ప్రదర్శనలు, సమావేశాలు

నేడు హైదరాబాద్‌లోని మఖ్దూం మొహినుద్దీన్, అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన

సెప్టెంబర్ 17న రావినారాయణరెడ్డి ఆడిటోరియంలో ముగింపు సభ

ప్రజాపక్షం/హైదరాబాద్

సిపిఐ ఆధ్వర్యంలో నేటినుంచి ఈనెల 17వ తేదీ వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ప్రారంభం కానున్నాయి. నిజాం రాచరిక, భూస్వామ్య వ్యవస్థల కబంధ హస్తాల నుండి విముక్తి కల్పించేందుకు నాడు కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో మట్టి మనుషులు చేసిన ప్రపంచ చరిత్రలోనే విశిష్టమైన మహత్తరమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలునిచ్చారు. ఉత్సవాల ప్రారంభ సూచికగా గురువారం (నేడు) ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఉన్న మఖ్దూం మొహినుయుద్దీన్ విగ్రహం వద్ద నుండి అంబేద్కర్ విగ్రహం వరకు రెడ్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వారం రోజుల పాటు అన్ని జిల్లాలలోని ప్రదర్శనలు, సమావేశాలతో పాటు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కేంద్రాలలో ఘనంగా నిర్వహించనున్నఈ ఉత్సవాల్లో రాష్ట్ర, జిల్లా నాయకత్వం తరువాయి 2లో

## తూర్పు, ఉత్తర తెలంగాణలో 14 వరకు భారీవర్షాలు


సచివాలయం వద్ద దట్టంగా కమ్ముకున్న మబ్బులు

**హైదరాబాద్ :** ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈ నెల 14వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. గురు, శుక్రవారాల్లో ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వివరించింది. గురువారం కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. అలాగే హైదరాబాద్‌లో నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కాగా, హైదరాబాద్‌లో బుధవారం సాయంత్రం పలుచోట్ల వర్షం కురిసింది. పంజాగుట్ట, అమీర్ పేట్, కూకట్ పల్లి, సికింద్రాబాద్, బోయినపల్లి, తిరుమలగిరి, అల్వాల్, ప్యాట్నీ, తార్నాక, ఎల్బీనగర్, పాతబస్తీ ప్రాంతాల్లో వర్షం పడింది. ఉదయం నుంచి ఉక్కపోత వాతావరణంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నగరవాసులకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో రహదారులపై తరువాయి 2లో

### పలుచోట్ల పిడుగులు : నలుగురు మృతి

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం సాయంతం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో పిడుగులు పడడంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. జోగులాంబ గద్వాల జిల్లా, ఖమ్మ జిల్లాల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. జోగులాంబ జిల్లాలో పిడుగుపడి ముగ్గురు అక్కడికక్కడే మరణించగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఐజ మండల కేంద్రంలో ఈ ఘటన జరిగింది. భూమ్‌పురం గ్రామంలో తిమ్మప్ప అనే రైతు పొలంలో సీడ్ పత్తి క్రాసింగ్ పనులకు తరువాయి 2లో

# రక్షణశాఖ భూములు బదలాయించండి



- గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం 98.20 ఎకరాల భూమిని ఇవ్వండి
- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 'గాంధీ సరోవర్ ప్రాజెక్టు' కోసం అక్కడ ఉన్న 98.20 ఎకరాల రక్షణ శాఖ భూములను తెలంగాణ ప్రభుత్వానికి బదలాయించాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోని కేంద్ర మంత్రి అధికారిక నివాసంలో బుధవారం సమావేశమయ్యారు. మూసీ, ఇసి నదుల సంగమ స్థలంలో గాంధీ సరోవర్ ప్రాజెక్టును, అందులో భాగంగా తరువాయి 2లో



## అణచివేతపై ధిక్కార పతాక

చాకలి ఐలమ్మకు సిఎం రేవంత్ రెడ్డి ఘన నివాళి

ప్రజాపక్షం/హైదరాబాద్

అణచివేత, దమనకాండలపై ఎగిరిన ధిక్కార పతాక చాకలి ఐలమ్మ అని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బుధవారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో సిఎం రేవంత్ రెడ్డి చాకలి ఐలమ్మ చిత్రపటానికి తరువాయి 2లో

## భారత్– అమెరికా వాణిజ్య సంప్రదింపులు

- ఆటంకాలు తొలగించడం కష్టంకాదు : ట్రంప్
- ప్రియనేస్తం మోదీ కోసం వేచిచూస్తున్నా


(ఫైల్ ఫోటో)

**న్యూయార్క్/వాషింగ్టన్:** భారత్–అమెరికామధ్య వాణిజ్య సంప్రదింపులు కొనసాగుతాయని డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. చర్చల్లో నెలకున్న ఆటంకాలు తొలగించుకోవడం పెద్దకష్టమైన పనేమీ కాదని రాబోయే వారాల్లో తన ప్రియమిత్రుడు ప్రధాన మంత్రి నరేంద్రమోదీని కలిసి సంభాషించేందుకు తాను ఎంతగానో ఎదురుచూస్తున్నానని చెప్పారు. ఈ ప్రకటన ద్వారా రెండు దేశాలమధ్య వాణిజ్య ఆటంకాలు మెల్లిగా తొలగిపోతున్నాయని ట్రంప్ సంకేతాలు ఇచ్చారు. వాణిజ్య చర్చలను విజయవంతంగా ముగించేందుకు ఆటంకాలు తొలగించడం పెద్దకష్టం కాదని తాను రూఢీగా తరువాయి 2లో

## వాణిజ్య చర్చలు ముగించేందుకు కలిసి పనిచేస్తాం

ట్రంప్‌తో మాట్లాడేందుకు నేనూ ఎదురుచూస్తున్నా : మోదీ

**న్యూఢిల్లీ:** తన ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ చేసిన పోస్టింగ్‌పై ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొద్దిగంటలకే స్పందించారు. ట్రంప్‌ను కలిసి మాట్లాడేందుకు తాను కూడా ఎదురుచూస్తున్నానని ఎక్స్ వేదికగా ప్రతిస్పందించారు. వీలైనంత తొందరగా వాణిజ్యచర్చలను ముగించేందుకు రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. భారత్–అమెరికాలు సన్నిహిత మిత్రదేశాలు, సహజసిద్ధమైన భాగస్వాములు, రెండు దేశాలూ కలిసి త్వరగా చర్చలు పూర్తిచేద్దాం అని పేర్కొన్నారు. నిర్ణీత ప్రకారం జరగాల్సిన చర్చలు అర్ధాంతరంగా నిలిచిపోవడం, షాంఘై సహకార సదస్సు రజతోత్సవ సదస్సులో పరిణామాల తర్వాత మళ్ళీ తరువాయి 2లో




# ఉద్యమ నేత సురవరం

**ప్రజల హక్కులకోసం నిరంతరం పోరాడిన కమ్యూనిస్టు మేధావి**

- సంస్మరణ సభలో వక్తల ఉద్ఘాటన
- సుధాకర్ రెడ్డి నేటితరానికి ఆదర్శప్రాయుడు : సుఖేందర్ రెడ్డి
- నల్లగొండ జిల్లా కేంద్రంలో విగ్రహం నెలకొల్పేందుకు కృషి : మంత్రి కోమటిరెడ్డి

ప్రజాపక్షం/నల్లగొండ

ప్రజల హక్కుల కోసం నిరంతరం అనేక పోరాటాలు నిర్వహించిన ప్రజా ఉద్యమ నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి అని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. నేటి తరానికి ఆదర్శప్రాయుడన్నారు. సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి నల్లగొండ మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ జిఎల్ గార్డెన్ లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డితో పాటు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు. సురవరం సుధాకర్ రెడ్డి మరణానికి సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి దశ నుంచి కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితులై నల్లగొండ పార్లమెంటు సభ్యులుగా రెండుసార్లు ఎన్నికయ్యారని, తాము ఇద్దరం వేరువేరు పార్టీల నుండి పోటీ చేశామనీ, కానీ ఏనాడూ వ్యక్తిగత విమర్శ చేసుకోలేదని గుర్తు చేశారు. ఫ్లోరైడ్ ప్రాంతమైన నల్లగొండ జిల్లాలకు సాగు తగునీరు సాధించేందుకు తరువాయి 12లో

## నేపాల్ పరిణామాల పట్ల సిపిఐ ఆందోళన

యువత ఆగ్రహాన్ని గుర్తించాలి

మితవాదశక్తుల వైపు మళ్ళొద్దు

పరిస్థితికి కమ్యూనిస్టుల విభేదాలు కూడా కారణమే

వారి మధ్య సూత్రప్రాయ ఐక్యత పునరద్ధరణ జరగాలి



**న్యూఢిల్లీ :** నేపాల్‌లో జరుగుతున్న పరిణామాలపై భారత కమ్యూనిస్టు పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గం బుధవారం ఒక పత్రికా ప్రకటనను విడుదల చేసింది. "నేపాల్ వేగంగా అరాచక స్థితిలోకి జారిపోతోంది. ప్రజలలో, ముఖ్యంగా జెన్ జెడ్ యువతలో, స్వేచ్ఛను అణచివేసే సమస్యలపై, వ్యక్తీకరణ, సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ లపై ఆంక్షలు, అవినీతిపై స్పష్టమైన ఆగ్రహం ఉంది. ఈ ఆగ్రహాన్ని గుర్తించాల్సిందే. అయితే పార్లమెంటు భవనాన్ని, నివాసాలకు తగులబెట్టడం, అధ్యక్షుడు, సీనియర్ మంత్రులు, మాజీ ప్రధాని భార్య హత్య, ప్రజా ఆస్తులు, కమ్యూనిస్టు, ఇతర రాజకీయ పార్టీల కార్యాలయాలపై హింసాత్మక దాడులు తీవ్ర ఆందోళన కలిగించే విషయం. ఇటువంటి పరిణామాలు నిరసనలు అరాచకంగా మారడాన్ని సూచిస్తున్నాయి. ప్రజాస్వామ్య పోరాట పద్ధతులను తరువాయి 2లో

ప్రాసిక్యూషన్‌కు అనుమతి..

## కేబినెట్ సలహాకు గవర్నర్ కట్టుబడాలి

'సుప్రీం'కు తెలంగాణ ప్రభుత్వం వెల్లడి

సర్కారు తరపున వాదనలు వినిపించిన సీనియర్ అడ్వకేట్ నిరంజన్‌రెడ్డి


**న్యూఢిల్లీ :** ఒక మంత్రి లేదా ముఖ్యమంత్రి క్రిమినల్ కేసులో చిక్కుకున్న సందర్భం తప్ప, ప్రాసిక్యూషన్ అనుమతి మంజూరు చేసే విషయంలో కూడా గవర్నర్ సాధారణంగా మంత్రి మండలి సహాయం లేదా సలహాకు కట్టుబడి ఉంటారని బుధవారం తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వివరించింది. ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి నేతృత్వం వహించిన సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ ముందు తెలంగాణ ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి తరువాయి 12లో

# నేపాల్‌లో ఆర్మీ నిషేధాజ్ఞలు

హింస, దాడులకు పాల్పడితే కఠినచర్యలు

ఎవ్వరూ ఇళ్ళలోంచి బయటకు రావొద్దని హెచ్చరిక

సైనిక కేంద్ర కార్యాలయంలో ఓలి!



**ఖాట్మండు:** రాజకీయ సంక్షోభం మధ్య అనిశ్చితిలో కూరుకుపోయిన నేపాల్‌లో నిరసనలపేరుతో హింసాత్మక ఘటనలు చెలరేగకుండా కర్ఫ్యూకు కొనసాగింపుగా మూడోరోజు బుధవారం సైన్యం నిషేధాజ్ఞలు విధించింది. ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం ఐదు గంటలవరకూ ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయి. దేశవ్యాప్తంగా భద్రతా కార్యకలాపాలను సైన్యం తన నియంత్రణలోకి తీసుకుంది. సైన్యం పహారాలో విషాదకరమైన శ్మశానశాంతి నెలకుంది.హింసాత్మక ఘటనలు, గృహదహనాలు, అల్లర్లు, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడం, గాయపరచడం, అత్యాచార బెదిరింపులు, వ్యక్తులపై దాడులు వంటి అన్ని చర్యలను నేరాలుగా పరిగణిస్తామని, కఠిన చర్యలు తీసుకుంటామని సైన్యం ఒక ప్రకటనలో తెలియజేసింది. గురువారం వరకూ కర్ఫ్యూ దేశంలో అమలులో ఉంటుంది. ప్రస్తుత పరిస్థితులను అవకాశంగా తీసుకుని వ్యక్తులకు హానికలిగించే చర్యలకు కొన్ని గ్రూపులు పాల్పడే అవకాశం ఉందని, అందువల్ల అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు మరో ప్రకటనలో సైన్యం హెచ్చరించింది. లూటీలు, విద్వేష వ్యాప్తి చర్యలను సహించబోమని అణచివేస్తామని తెలిపింది. నేపాల్‌లో ఉన్న విదేశీయులు సమీపంలో ఉన్న సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలని కోరింది. రహదారులపై సైన్యం పెద్దసంఖ్యలో గస్తీ నిర్వహిస్తోంది. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకూ ప్రధాన విమానాశ్రయాలు మూసే ఉంచుతారు. దాడుల్లో ఇప్పటివరకూ రూ.3.37 లక్షల నగదు, మరో 31 మారణ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు తరువాయి 12లో

## 12న ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం



**న్యూఢిల్లీ :** భారత 15వ ఉపరాష్ట్రపతిగా సి.పి. రాధాకృష్ణన్ ఎన్నికను ఎన్నికల కమిషన్ బుధవారం ధృవీకరించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ , ఎన్నికల కమిషనర్లు వివేక్ జోషి, ఎస్.ఎస్.ఎస్ సంధు ఎన్నికల ధృవీకరణ పత్రంపై సంతకం చేశారు. ఆ తర్వాత సంతకం చేసిన కాపీని డిప్యూటీ ఎన్నికల కమిషనర్ భాను ప్రకాష్ ఏతురు, కార్యదర్శి సుమన్ కుమార్ దాస్ కేంద్ర హోం కార్యదర్శికి అందజేశారు. దీనిని కొత్త ఉపరాష్ట్రపతి ప్రమాణ స్వీకారోత్సవ తరువాయి 2లో

చలో చండీఘడ్




భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)

25వ కాంగ్రెస్

21-25 సెప్టెంబర్, 1925

చండీఘడ్ (పంజాబ్)

సిపిఐ చీలిక దిశలో.. ఆరవ కాంగ్రెస్ – 6వ పేజీలో



# ప్రపంచం
WORLD NEWS

## రష్యా డ్రోన్లు కూల్చివేసిన పోలెండ్
### సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించారని మండిపాటు

**వార్సా:** ఉక్రేన్‌పై దాడుల సందర్భంగా ప్రయోగించిన డ్రోన్లు పెద్దసంఖ్యలో పోలెండ్‌లోకి దూసుకు వెళ్ళడంతో ఆ దేశ సైన్యం రష్యా డ్రోన్లను కూల్చివేసింది. ఉక్రేన్ సరిహద్దులోనే పోలెండ్ దేశం ఉంది. ఉక్రేన్ సెంట్రల్, వెస్ట్రన్ ప్రాంతాలపై దాడుల సందర్భంగా రష్యా ప్రయోగించిన డ్రోన్లు పోలెండ్‌లోకి వెళ్ళాయి. ఉక్రేన్‌పై రష్యా తాజాగా 450 డ్రోన్లు, మరో 40 క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో ముగ్గురు ఉక్రేనియన్లు గాయపడ్డారు. ఒక కర్మాగారం ధ్వంసమైంది. జైటోమైర్,విన్నెసియా ప్రాంతాలలో తీవ్ర నష్టం జరిగింది. రష్యా డ్రోన్ల దాడితో తమ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించి దేశంలోకి చొరబడిందని పోలెండ్ ప్రభుత్వం విమర్శించింది. ఈ విధమైన దాడులను సహించబోమని హెచ్చరించింది. రష్యా డ్రోన్లు పోలెండ్‌లోకి ప్రవేశించడంతో కొద్దిగంటలసేపు విమానాశ్రయాల నుండి రాకపోకలను ప్రభుత్వం నిలిపివేసింది. పరిస్థితి చక్కబడిన తర్వాత వాటిని పునరుద్ధరించింది. ఉక్రేన్ సరిహద్దు ప్రాంతాలలో ఉన్న పోలెండ్ గ్రామాల ప్రజలు ఇళ్ళలోంచి బయటకు రావొద్దని ముందు జాగ్రత్తలు జారీ చేసింది.

# దోహాలో దాడులకు పూర్తి బాధ్యత నాదే
## ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ



**జెరూసలెం :** ఖతార్ రాజధాని దోహాలో హమాస్ అగ్ర నాయకత్వ సమావేశ భవనంపై దాడులకు పూర్తి బాధ్యత నాదేనని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ ప్రకటించారు. దోహాపై దాడులు చేయాలని తాను స్వతంత్ర నిర్ణయం తీసుకుని సైన్యానికి ఆదేశాలు జారీ చేశానని వివరణ ఇచ్చారు. దోహాలో దాడుల విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ముందుగానే తెలియజేశామని ఇజ్రాయెల్ అధికారులు దాడుల అనంతరం తెలియజేయడం, దోహాలో దాడులు ప్రారంభమైన పది నిమిషాల తర్వాత ఈ విషయాన్ని ఖతార్ ప్రభుత్వానికి అమెరికా ప్రభుత్వ యంత్రాంగం తెలియజేయడం, ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయెల్ చర్యలపట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమతున్న పరిణామాల పూర్వరంగంలో నెతన్యాహూ బుధవారం పైవిధంగా స్పందించారు. ప్రపంచంలో ఎక్కడా హమాస్ ఉగ్రవాదులకు స్వేచ్ఛగా సంచరించే అవకాశం ఉండకూడదని, ఒక చోట దాడులుచేస్తూ, మరోచోట వారు సురక్షితంగా ఎంజాయ్ చేస్తే సహించేదిలేదని నెతన్యాహూ అన్నారు. 2023 అక్టోబరు ఏడో తేదీన ఇజ్రాయెల్‌లో జరుగుతున్న ఒక సంగీత ఉత్సవంపై హమాస్ ఉగ్రవాదులు భారీసంఖ్యలో సామూహిక కాల్పుల దాడి చేశారు. ఈ దాడుల్లో 1200 మంది అక్కడికక్కడే మరణించగా మరో 250 మందిని బందీలుగా తీసుకుపోయారు. ఈ దాడి కుట్రకు వ్యూహరచన చేయడంలో భాగం పంచుకున్న హమాస్ నాయకులు దోహా సమావేశంలో పాల్గొన్నారని, వారు ఎంతటివారైనా హతమార్చడం తమ లక్ష్యమని ఇజ్రాయెల్ పేర్కొంది. ఈ దాడుల తీవ్రతవల్ల హమాస్ అగ్రనాయకులలో కొందరు హతులై ఉండే అవకాశం ఉందని తాము బలంగా విశ్వసిస్తున్నామని ఐడిఎఫ్ బుధవారం నాడు మరోసారి ఉద్ఘాటించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్యవర్తుల ద్వారా ప్రతిపాదించిన తాజా శాంతి ఒప్పంద ప్రతిపాదనపై చర్చించేందుకు హమాస్ అగ్రనాయకత్వం మంగళవారం దోహాలోని కేంద్ర కార్యాలయంలో సమావేశమైంది. ఈ సమాచారం తెలుసుకున్న ఇజ్రాయెల్ సైనికదళం (ఐడిఎఫ్) నెతన్యాహూ పచ్చజెండా ఊపడంతో దోహానగరంలో అనేకచోట్ల సందేహం ఉన్న ప్రాంతాలలో బాంబుదాడులు చేసింది. ఐతే హమాస్ అగ్రనాయకత్వ సమావేశ భవనం వద్ద కూడా ఈ పేలుళ్ళు సంభవించాయి. హమాస్ అగ్రనాయకత్వం సురక్షితంగా ఉందని ఆ సంస్థ వర్గాలు ప్రకటించాయి. ''హమాస్ అగ్రనాయకత్వాన్ని వేటాడి చంపేందుకు ఇజ్రాయెల్ సర్వస్వతంత్రంగా ఈ నిర్ణయం తీసుకుని ఈ దాడులు చేసింది, ఇందుకు తమదే పూర్తి బాధ్యత'' అని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయం సోషల్ మీడియా ద్వారా ప్రకటించింది. ఖతార్ నగరం దోహాలో ఏ ప్రాంతంలో ఈ దాడులు జరిగాయన్న విషయాన్ని మాత్రం ఇంతవరకూ ఏ రూపేణా ఇజ్రాయెల్ గానీ, ఖతార్ ప్రభుత్వంగానీ బహిర్గం చేయలేదు.

### ఖతార్ మా ప్రియమిత్రదేశం
## దోహాపై దాడి నిర్ణయం నాది కాదు



**వాషింగ్టన్ :** దోహాలో దాడులు చేయాలన్న నిర్ణయం తనది కాదని, తనకు ఈ నిర్ణయంతో ఎలాంటి సంబంధం లేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఖతార్ తమ ప్రియ మిత్రదేశమని ఆయన ఉద్ఘాటించారు. తన సొంత ట్రూత్ సోషల్ మీడియా వేదికగా బుధవారం ఒక ప్రకటన చేస్తూ, ఖతార్‌లో దాడుల నిర్ణయం తనది కాదని, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ సర్వస్వతంత్రంగా ఈ నిర్ణయం తీసుకున్నారని వివరణ ఇచ్చారు. ''ఖతార్‌లో దాడులు చాలా దురదృష్టకరం, ఈ దాడులతో నేను తీవ్ర అసంతృప్తికి గురయ్యాను, దాడులను అడ్డుకోలేకపోయాం, వాటిని ఆపడంలో జాప్యం జరిగింది'' అని పేర్కొన్నారు. ఐతే దాడులకు ముందు ఇజ్రాయెల్ ఆ విషయాన్ని తెలియజేసిందని వైట్‌హౌస్ వర్గాలు మంగళవారం చేసిన ప్రకటనకు ట్రంప్ ప్రకటనకు ఎక్కడా పొంతన కుదరడంలేదు.

కాగా, ఖతార్‌పై దాడి చేయాలని ఇజ్రాయెల్ తీసుకున్న నిర్ణయాన్ని ట్రంప్ యంత్రాంగం తీవ్రంగా తప్పుపట్టిందని, తీవ్రంగా వ్యతిరేకించిందని సిఎన్‌బిసి వార్తాసంస్థ బుధవారం ప్రకటించింది. మరోవైపు వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కోరోలిన్ లియావిట్ మీడియాతో మాట్లాడుతూ, ఖతార్ దేశం అమెరికాకు ఎంతో ప్రియమైన మిత్రదేశమని అన్నారు. పైగా ఇజ్రాయెల్–హమాస్ మధ్య సయోధ్య కుదిర్చి గాజాలో యుద్ధం ఆగిపోయేందుకు మధ్యవర్తిత్వం వహించి ఎంతో గొప్పకృషి చేస్తోందని, ఈ దాడులకు అమెరికా అనుమతి ఇవ్వబోదని, ఇది పూర్తిగా ఇజ్రాయెల్ సర్వస్వతంత్రంగా తీసుకున్న నిర్ణయమని చెప్పారు. దోహాలో దాడులు జరిగిన తర్వాతే పెంటగాన్‌లోని సైనికకేంద్రం అధ్యక్షుడు ట్రంప్‌కు ఈ విషయాన్ని తెలియజేసిందని లియోవిట్ వివరణ ఇచ్చారు. ఖతార్‌లో అతి పెద్ద సైనిక కేంద్రాన్ని నిర్వహిస్తున్న అమెరికా సైనికదళానికి ఇజ్రాయెల్ ముందుగానే సమాచారం తెలియజేసి ఉండొచ్చుకదా? లేక ఇతర మార్గాల ద్వారా అమెరికా సైన్యానికి దాడుల గురించి తెలిసే అవకాశం లేకపోలేదుకదా? అని మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు లియావిట్ తిరస్కరించారు. ఖతార్‌లో దాడులు జరుగుతున్నాయని అమెరికా సైన్యం ద్వారా తెలియగానే ఈ విషయం వెంటనే ఖతార్ నాయకులకు చెప్పాలని ప్రత్యేకదూత స్టీవ్ విట్‌కాఫ్‌కు ట్రంప్ ఆదేశించారని లియావిట్ చెప్పారు.

## ఇది ఇజ్రాయెల్ ఉగ్రవాదం : ఖతార్ ప్రధాని
### సార్వభౌమాధికార ఉల్లంఘన సహించబోం
### మధ్యవర్తిత్వం ఆపేదిలేదు



**దోహా :** రాజధాని దోహాలోని కొన్ని ప్రాంతాలలో హమాస్ అగ్రనాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేయడాన్ని ఖతార్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇది ప్రభుత్వంచేసే ఉగ్రవాదమని ఖతార్ జాతీయ భద్రతను బలహీనపరచే చర్యలని ఆ దేశ ప్రధానమంత్రి, విదేశాంగమంత్రి షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్ రెహ్మాన్‌బిన్ జెస్సిమ్ తహనీ విమర్శించారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా ఈ ఉల్లంఘనపై న్యాయపరమైన చర్యలకు వివిధశాఖలు కృషి చేస్తాయని చెప్పారు. తమ దేశ సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించేందుకు ఎలంటి చర్యలకు పాల్పడినా సహించేదిలేదని ఇజ్రాయెల్‌కు తహనీ హెచ్చరిక చేశారు. ఇజ్రాయెల్ దాడులపై సమగ్ర ప్రతిస్పందన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎవరైనా దాడిచేస్తే ఆ దాడులను తిప్పికొట్టేందుకు ఉన్న అంతర్జాతీయ హక్కును తాము నిలబెట్టుకుంటామని చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా గట్టిగా స్పందిస్తామని, కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. ఐతే గాజాలో యుద్ధం నివారించి శాంతి సాధించేందుకు హమాస్‌తో చర్చలు జరుపుతున్న ఖతార్, ప్రస్తుతం కొనసాగుతున్న శాంతి యత్నాల కృషి నుండి వెనక్కుమళ్ళబోమని, యుద్ధం ముగించేందుకు మధ్యవర్తిత్వం కొనసాగిస్తామని ప్రకటించింది. దోహాలో దాడులకు ముందే అమెరికా తమను అప్రమత్తం చేసిందని వచ్చిన వార్తలు తప్పుడు వార్తలని ఖతార్ విదేశీమంత్రిత్వశాఖ తిరస్కరించింది. ఒకవైపు ఖతార్‌లో బాంబుదాడుల శబ్దాలు వినిపిస్తున్న సమయంలో తమకు అమెరికా నుండి ఫోన్‌కాల్ వచ్చిందని ఖతార్ ప్రధానమంత్రి సలహాదారు మాజెద్ అల్ అన్సారీ చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన తాజా శాంతి ఒప్పంద ప్రతిపాదనపై చర్చించేందుకు హమాస్ అగ్రనాయకత్వం మంగళవారం దోహాలో సమావేశం కావడంతో వారిని మట్టుబెట్టేందుకు ఇజ్రాయెల్ సైన్యం బాంబుదాడులు ప్రారంభించింది. ఒకవైపు బాంబుదాడులు జరుగుతున్నప్పటికీ మరోవైపు దోహాలో విమానాల రాకపోకలు, ల్యాండింగ్, కార్యకలాపాలు యధేచ్ఛగా కొనసాగాయి.

**రష్యా, చైనా సహా పలు దేశాల ఖండన**

దోహాలో ఇజ్రాయెల్ సైన్యం బాంబు దాడులను రష్యా, చైనా ప్రభుత్వాలు సహా పలు దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ కూడా ఈ చర్యలను తీవ్రంగా వ్యతిరేకించారు. దేశాల సార్వభౌమాధికారాలను హరించేందుకు ఎవ్వరికీ హక్కులేదని విమర్శించారు. ఈ ఘటనపై ఒక అత్యవసర సమావేశం నిర్వహిస్తామన్నారు. చైనా విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ బీజింగ్‌లో మీడియాతో మాట్లాడుతూ, ఖతార్ జాతీయ భద్రతను, సార్వభౌమాధికారాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించిందని విమర్శించారు. ఈ ప్రాంతీయ ఉద్రిక్తతలు తదుపరి మరింత పెరిగిపోయే ప్రమాదం ఉందని చైనా తీవ్ర ఆందోళన చెందుతోందని అన్నారు.

## క్యాష్ అవార్డ్‌గా ఇవ్వాలి
### ఆర్‌టిసి ఇయు ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సింగరేణి సంస్థ తరహా దసరా పండుగ సందర్భంగా ఆర్‌టిసి సంస్థ కార్మికులకు సంస్థకు వచ్చే లాభాలలో అన్ని కేటగిరీలలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఒక నెల జీతం క్యాష్ అవార్డ్‌గా ఇవ్వాలని టిజిఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర ఆర్‌టిసి సిబ్బంది సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు నిత్యం కష్టపడ్డారని, అంకితభావంతో పని చేశారని, ఎన్నో ఇబ్బందులను తట్టుకొని మహాలక్ష్మి పథకాన్ని తమ భుజస్కంధాలపైన వేసుకుని విజయవంతం చేశారని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–2025 సంవత్సరం వరకు రూ.200 కోట్లు జీరో టికెట్లు జారీ అయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులందరూ సంబురాలు చేసుకున్నారని, జీరో టికెట్ల ద్వారా ఆర్‌టిసికి రూ.6,680 కోట్ల ఆదాయం సమకూరిందని వారు తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి సంవత్సరం సింగరేణి కాలరీస్ లాభాల నుండి అందులో పని చేసే ఉద్యోగులకు వాటా కింద దసరా, దీపావళి పండుగలకు లక్షలాది రూపాయలు ఇస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అతి ముఖ్యమైన దసరా పండుగకు ఆర్‌టిసి ఉద్యోగులకు లాభాలలో వాటా కింద ఒక నెల జీతాన్ని ఇచ్చి ఆర్‌టిసి కార్మికులు కూడా తమ కుటుంబ సభ్యులతో సంబురాలు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఈదురు వెంకన్న ముఖ్యమంత్రిని కోరారు.

## వాణిజ్య సంప్రదింపులు
(మొదటి పేజీ తరువాయి)

విశ్వసిస్తున్నానని తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ''భారత్–అమెరికా రెండు దేశాలూ వాణిజ్య చర్చలు కొనసాగిస్తాయని ప్రకటించడానికి నేనెంతో సంతోషపడుతున్నా, రెండు దేశాలమధ్యా ఏర్పడిన ఆటంకాలను పరిష్కరించుకోవడానికి సంప్రదింపులు కొనసాగుతాయి, నా ప్రియనేస్తం, ప్రధానమంత్రి మోదీని రాబోయే వారల్లో కలిసి మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నా, వాణిజ్యచర్చలను విజయవంతంగా ముగించడం కష్టంకాదు, అమెరికా–భారత్ రెండూ గొప్ప దేశాలే'' అన్నారు. ఆ తర్వాత మోదీ కూడా ఎక్స్ వేదికగా సానుకూలంగా స్పందించారు. మోదీ స్పందనను కూడా ట్రంప్ మళ్ళీ తన సోషల్ మీడియా వేదికపై పోస్టు చేశారు. రష్యా నుండి ముడి చమురు భారత్ కొనుగోలు చేయడంవల్లనే పరోక్షంగా ఉక్రేన్‌లో యుద్ధం కొనసాగుతోందని ట్రంప్ వివాదానికి తెరలేపడంతో గడచిన రెండు దశాబ్దాలలో ఎన్నడూలేనంత తీవ్రస్థాయిలో రెండు దేశాలమధ్యా సంబంధాలలో ఉద్రిక్తతలు నెలకున్నాయి. ఆ తర్వాత ఆయన భారత్‌పై 50 శాతం భారీ సుంకాలు వసూలు చేయడం ప్రారంభించారు. ఈ చర్య అన్యాయం, చట్టవిరుద్ధం,హేతుబద్ధంకాదని భారత్ ఖండించింది. షాంఘై సహకార సంస్థ సదస్సుపూర్తయిన నాలుగురోజులకు ఈనెల మొదటివారంలో ట్రంప్ మళ్ళీ మొదటిసారి సానుకూలంగా స్పందించారు. తాను ఎప్పుడూ మోదీతో స్నేహంగానే ఉంటానని, ఆయన గొప్ప ప్రధానమంత్రి అని అన్నారు. దీనిపై మోదీ మరునాడే ఆరోతేదీన స్పందిస్తూ, రెండు దేశాల సంబంధాలపట్ల ట్రంప్ సానుకూల విశ్లేషణను తాను మనఃస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. ఆ తర్వాత ఇప్పుడు రెండోసారి కూడా ట్రంప్ సానుకూలంగా స్పందించారు.

## కలిసి పనిచేస్తాం
(మొదటి పేజీ తరువాయి)

మొదటిసారి వాణిజ్య చర్చల పునరుద్ధరణకు ట్రంప్ బుధవారం భారత్‌కు సోషల్ మీడియా ద్వారా సంకేతాలు పంపారు. చర్చల పునరుద్ధరణకు ట్రంప్ పంపిన సానుకూల విశ్లేషణపై మోదీ స్పందిస్తూ, రెండుదేశాలమధ్యా తిరిగి అపరిమితమైన వాణిజ్య భాగస్వామ్య సామర్థ్యానికి ఈ చర్చల ముగింపు మార్గం సుగమం చేస్తాయన్నారు. ప్రపంచంలో ఏ దేశంపైనా విధంచనంత భారీగా 50 శాతం సుంకాలు విధించిన తర్వాత అమెరికా–భారత్ సంబంధాలు తిరోగమనంలోకి వెళ్ళాయి. గడచిన 12 రోజులుగా జరిగిన పరిణామాల నేపథ్యంలో భారత్‌తో అమెరికా సంబంధాల గురించి సానుకూల ప్రకటన చేయడం ఇది రెండోసారి. ప్రధానమంత్రి నరేంద్రమోదీని ప్రశంసించడంతోపాటు భారత్‌తో అమెరికాకు దీర్ఘకాలిక బంధం ఉందని ఆయన అన్నారు.

## అవయవ మార్పిడి సర్జరీలను ప్రోత్సహించేందుకు చర్యలు
### వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ ఆస్పత్రులలో అవయవ మార్పిడి సర్జరీలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. జీవన్‌దాన్ పనితీరు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవయవ మార్పిడి చికిత్సలను ప్రోత్సహించేందుకు తీసు కోవాల్సిన చర్యలపై హైదరాబాద్, జూబ్లిహిల్స్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్స్, గాంధీ, ఉస్మానియాతో పాటు ఆదిలాబాద్ రిమ్స్, వరంగల్ ఎంజిఎంలోనూ అవయవమార్పిడి సర్జరీలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఆర్గాన్ రిట్రైవల్ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని, సీనియర్ డాక్టర్లతో డెడికేటెడ్ టీమ్స్‌ను ఏర్పాటు చేయాలని, ఒక్కో ఆర్గాన్‌కు ఒక్కో టీమ్ ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తుకు మంత్రి సూచించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అవయవమార్పిడి సర్జరీలను ప్రోత్సహించే విధంగా ఈ బృందాలు పనిచేయాలన్నారు. ఇటీవల కేంద్ర చట్టాన్ని అడాప్ట్ చేసుకున్నందున దీనికి సంబంధించిన కొత్త నిబంధనల రూపకల్పనపై ఈ సమావేశంలో చర్చించారు. నూతన చట్టం ప్రకారం సొంత కుటుంబ సభ్యులతో పాటు, గ్రాండ్ పేరెంట్స్ కూడా అవయవాలు డొనేట్ చేసేందుకు, స్వీకరించేందుకు అర్హులేనని అధికారులు తెలిపారు. ఆర్గాన్ స్వాపింగ్‌కు కూడా అవకాశం కల్పించాలని అధికారులకు మంత్రి సూచించారు. దీని ప్రకారం ఇరువురు పేషెంట్ల కుటుంబ సభ్యులు ఒకరికొకరు అవయవమార్పిడి చేసుకునే వెసులుబాటు ఉంటుందని, స్వాపింగ్ విషయంలో ఇతర రాష్ట్రాలు అవలంభిస్తున్న నిబంధనలను పరిశీలించి, బాధితులను ఆదుకునే విధంగా నిబంధనలను రూపొందించాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జీవన్‌దాన్ కోఆర్డినేటర్, డాక్టర్ భూషన్‌రాజుకు సూచించారు.ఇందుకు ప్రజా ప్రతినిధులు, ప్రముఖుల సహకారం తీసుకోవాలన్నారు. అవయవదానం చేసే కుటుంబ సభ్యులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన వారి అవయవాలను ఇతరులకు డొనేట్ చేసి ఆదర్శంగా నిలుస్తున్న కుటుంబాలను అందరూ అభినందించాలని చెప్పారు. అవయవదానం చేసిన వారి దహన సంస్కారాలకు ఆర్థిక సాయం అందించడంతో పాటు, వారి కుటుంబాలకు అండగా ఉండేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిల్స్‌లో జరుగుతున్న అవయవమార్పిడి సర్జరీలపై నిరంతరం నిఘా పెట్టాలని, నిబంధనలు ఉల్లంఘించే హాస్పిటల్స్ పట్ల కఠినంగా వ్యవహరించాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు.

## బదలాయించండి
(మొదటి పేజీ తరువాయి)

'గాంధీసర్కిల్ ఆఫ్ యూనిటీ' నిర్మాణం చేపడతామని కేంద్ర మంత్రికి సిఎం వివరించారు. ఈ రెండు నదుల సంగమ స్థలంలో ఉన్న 98.20 ఎకరాల రక్షణ శాఖ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని రక్షణ శాఖ మంత్రిని సిఎం కోరారు. జాతీయ సమైక్యత, గాంధేయ విలువలకు సంకేతంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టనున్నట్లు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టులో గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే నాలెడ్జ్ హబ్, ధ్యాన గ్రామం, చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోద స్థలాలు, ల్యాండ్ స్కేప్, ఘాట్లు, శాంతి విగ్రహం మ్యూజియం నిర్మిస్తామని కేంద్ర మంత్రికి సిఎం వివరించారు. సమావేశంలో ఎంపిలు పోరిక బలరాం నాయక్, కడియం కావ్య, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇ.వి.నరసింహారెడ్డి, కేంద్ర ప్రాజెక్టులు, పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

## 14 వరకు భారీవర్షాలు
(మొదటి పేజీ తరువాయి)

వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల వర్షానికి డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. చేవెళ్ల పట్టణ కేంద్రంలో భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన వాన వరదలా మారింది. స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను వరద ముంచెత్తి ఆవరణ మొత్తం వర్షపునీళ్లు నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు ఇంటికి వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అలాగే యూసఫ్‌గూడ, మధురానగర్, అమీర్‌పేట్, ఎస్‌ఆర్ నగర్, ఎర్రగడ్డ, సనత్ నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పరిసర ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. సైదాబాద్, సరూర్‌నగర్, సంతోష్‌నగర్, పాతబస్తీ, బహదూర్ పుర, కిషన్ బాగ్, పురానపుల్, జూ పార్క్, మెహదీపట్నం, రేతి బౌలి, ఖైరతాబాద్, పంజాగుట్ట, మలక్‌పేట, కుత్బుల్లాపూర్, కొంపల్లి, సుచిత్ర, గుండ్లపోచంపల్లి, జీడిమెట్ల, సూరారం, జగద్గిరిగుట్ట, నాగారం ప్రాంతాల్లో వర్షం పడుతోంది. ఈ వర్షంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## పోరాట వారోత్సవాలు
(మొదటి పేజీ తరువాయి)

పాల్గొటుందన్నారు. ఈనెల 17వ తేదీన ముగింపు ఉత్సవాలను హైదరాబాద్ లోని రావి నారాయణ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు సాంబశివరావు వెల్లడించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఎలాంటి పాత్ర, చరిత్ర లేని బిజెపి దుష్ప్రచారం చేస్తూ, పోరాట చరిత్రను వక్రీకరిస్తుందన్నారు. బిజెపి చేస్తున్న దుష్టపన్నాగాలను ఎండగడుతూ రాష్ట్ర వ్యాపితంగా పార్టీ శ్రేణులు సాధ్యమైన చోట్ల సభలు, సదస్సులు, సెమినార్లు పార్టీ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. తెలంగాణ మాతృభూమి స్వాతంత్ర్యం కోసం జరిపిన ఈ సమరంలో నాలుగున్నర వేల మంది అసవులు బాసారని గుర్తు చేశారు. వారోత్సవాల సందర్భంగా నాటి ఘన చరిత్రను మననం చేసుకోని స్ఫూర్తి పొందడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని సాంబశివరావు పేర్కొన్నారు.

## అణచివేతపై ధిక్కార పతాక
(మొదటి పేజీ తరువాయి)

పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ గడ్డపై దొరల అహంకారానికి, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా 80 ఏళ్ల కిందనే జంగ్ సైరన్ ఊదిన యోధురాలు ఐలమ్మ అని సిఎం కొనియాడారు. సమ్మక్క, సారక్క, చాకలి ఐలమ్మల స్ఫూర్తితోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని సిఎం గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపిలు పోరిక బలరామ్ నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.

## రాధాకృష్ణన్ ప్రమాణం
(మొదటి పేజీ తరువాయి)

సమయంలో చదువుతారని ఇసి పేర్కొంది. కాగా, రాధాకృష్ణన్‌తో శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సెప్టెంబర్ 12న రాష్ట్రపతి భవన్‌లో జరిగే అధికారిక కార్యక్రమంలో రాధాకృష్ణన్‌తో ప్రమాణ స్వీకారం చేయించనున్నట్లు వారు తెలిపారు. మంగళవారం జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో 67 ఏళ్ల రాధాకృష్ణన్ 152 ఓట్ల తేడాతో ఉమ్మడి ప్రతిపక్ష అభ్యర్థి బి.సుదర్శన్‌రెడ్డిపై విజయం సాధించారు. ఆరోగ్య కారణాల వల్ల జులై 21న జగదీప్ ధన్‌ఖడ్ ఆ పదవికి రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది.

## కామారెడ్డి బిసి డిక్లరేషన్ విజయోత్సవ సభకు కదలి రావాలి
### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న కామారెడ్డి బిసి డిక్లరేషన్ విజయోత్సవ సభచరిత్రలో నిలిచేలా బిసి సోదరులు, కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎంఎల్‌ఎలు, కార్పోరేషన్ చైర్మన్లు కాంగ్రెస్ ముఖ్య నేతలతో జిల్లా ఇంచార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం హైదరాబాద్ టూరిజం ప్లాజా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ నెల 15 వ తేదీన కామారెడ్డి లో జరిగే బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణ చేయాలని సూచించారు. బిసి డిక్లరేషన్ విజయోత్సవ సభ సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం బిసి సామాజిక వర్గం అభివృద్ధికి చేస్తున్న కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సమావేశంలో మంత్రి తుమ్మల కాంగ్రెస్ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.

## పిడుగుల వర్షం : నలుగురు మృతి
(మొదటి పేజీ తరువాయి)

ఏడుగురు కూలీలు వెళ్లారు. సాయంత్రం వర్షం కురయడంతో కూలీలు అందరూ పొలంలో ఉన్న వేప చెట్టు కిందకు వెళ్లగా అదే సమయంలో ఉరుములు, మెరుపులతో చెట్టుపై పిడుగు పడింది. ఈ ఘటనలో భూమ్‌పురానికి చెందిన సర్వేష్ (19), పార్వతి (28), పులికల్ గ్రామానికి చెందిన సౌభాగ్యమ్మ (45) అక్కడికక్కడే మరణించారు. గాయపడ్డ మరో నలుగురుని హుటాహుటినా ఆసుపత్రికి తరలించారు. అదే విధంగా మధిర మున్సిపాల్టీ పరిధి మడుపల్లి గ్రామానికి చెందిన గడిపూడి వీరభద్రరావు(50) అనే రైతు తన పొలంలో పనులు చేస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడి అకాల వర్షంతో పాటు పిడుగు పడింది. దాంతో ఆయన గుర్రై అక్కడికక్కడే మృతి చెందాడు. వీరభద్రరావు అకాల మృతితో వారి కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

## సిపిఐ ఆందోళన
(మొదటి పేజీ తరువాయి)

దాటి వెళ్లడం ద్వారా వారి కోరుతున్న అంశాలు బలహీనపడే ప్రమాదం ఉంది. ఖాట్మండు, పరిసర నగరాలలో నిరసన తెలుపుతున్న యువకులపై కాల్పులలో అనేక మంది మరణానికి కారణమవడమే కాకుండా, అగ్నికి ఆజ్యం పోసినట్లు మరుసటి రోజు అదే యువతకు లొంగిపోయిన పోలీసు యంత్రాంగం తీరును సిపిఐ తీవ్రంగా ఖండిస్తున్నది. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య నేపాల్‌ను పరిఢవిల్లడాన్ని ఇష్టపడని శక్తుల భారీ కుట్రపై తీవ్రమైన సందేహాలు లేవనెత్తుతున్నాయి. కష్టపడి గెలుచుకున్న లౌకిక, ప్రజాస్వామిక రాజ్యాంగం కింద అభివృద్ధి చెందడం, రాచరికానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమంలో కమ్యూనిస్టులు ప్రముఖ పాత్ర వహించారు. అదే సమయంలో నేపాల్‌లో కమ్యూనిస్టుల మధ్య నెలకొన్న విభేదాలు ప్రస్తుత సంక్షోభానికి కూడా దోహదం చేశాయి. నేపాల్ ప్రజలు పదేపదే కమ్యూనిస్టులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ, ప్రజల తీర్పును పక్కనబెట్టి సంకుచిత ఎజెండాలతో నడిచే పార్టీలతో రాజీపడిన ఫలితంగా కమ్యూనిస్టు సూత్రాలు పలుబారడం, బలహీనమైన పరిపాలన, అవినీతి, ప్రజలను నిరాశపరిచి ప్రస్తుత సంక్షోభానికి దారి తీసినట్లు ''సిపిఐ పేర్కొంది.

''నేపాల్‌లోని కమ్యూనిస్టులు తమ మార్గాన్ని పునరాలోచించి సూత్రప్రాయమైన ఐక్యతను పునరుద్ధరించకపోతే, వారు దశాబ్దాల ప్రజల పోరాటాల వారసత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అదే సమయంలో, నేపాల్ ప్రజలు, నేపాల్ కమ్యూనిస్టులకు సిపిఐ పూర్తి మద్దతు, సంఘీభావాన్ని ప్రకటిస్తూ, సాధ్యమనంతో తర్వగా తిరిగి శాంతియుత, సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆకాంక్ష వ్యక్తం చేసింది. సామ్రాజ్యవాద ప్రయోజనాలకు అనుగుణంగా దక్షిణాసియా దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం కొత్తేమి కాదని, వాటి పట్ల ప్రజాస్వామ్య, లౌకిక శక్తులన్నీ అప్రమత్తంగా ఉండాలని కోరింది. నేపాల్ ప్రజలు సాధించిన ప్రజాస్వామ్య, లౌకిక అభ్యున్నతిని కోల్పోకుండా ఉండేందుకు నేపాల్ యువత నిజమైన ఆగ్రహం మితవాద శక్తుల వైపు లేదా రాచరికానికి తిరిగి రావాలని పిలుపువైపు దారి మళ్ళొద్దని'' సిపిఐ ఆకాంక్ష వ్యక్తం చేసింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## కెటిఆర్ శాసనసభ్యత్వాన్ని రద్దు చేయాలి

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణాలోని బిఆర్ఎస్ ప్రభుత్వంలో గత 10 ఏళ్లుగా మంత్రిగా పనిచేసిన కెటిఆర్‌కు ఎలాంటి భాష మాట్లాడాలో, ఎలా ప్రవర్తించాలో తెలియకపోవటం విచారకరమని, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. ఫార్ములా ఈ రేస్ కేసులో అన్నింటికి తానే బాధ్యుడని ప్రకటించడమే కాకుండ రూ.44 కోట్లు ఎన్నికల బాండ్లను పొందేందుకు చట్టాలకు వ్యతిరేకంగా తన మంత్రి పదవిని దుర్వినియోగం చేసిన కెటిఆర్ శాసన సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కెటిఆర్ టివిల ముందు, పత్రికా సమావేశాల్లో అడ్డగోలుగా మాట్లాడటం సబబు కాదన్నారు. ఆయనను భాషను మార్చుకొమ్మని అనేకసార్లు బిజెపి, కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు సూచనలు ఇచ్చినప్పటికీ మార్పు రాకపోవడం ఆయన మనస్తత్వానికి నిదర్శనమని, ఇది ప్రజాస్వామ్య రాజకీయాలకు మంచిది కాదన్నారు.. ఇలాంటి భాష ప్రజా జీవితంలో మాట్లాడుతున్న వారందర్నీ సరైనమార్గంలో పెట్టటానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక వ్యవస్థను ఏర్పాటు చేయవల్సిన అవసరం రాష్ట్ర రాజకీయాల్లో ఏర్పడిందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని బోస్ విజ్ఞప్తి చేశారు.

### దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన
# వీరవనిత ఐలమ్మ

సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ




ప్రజాపక్షం/హైదరాబాద్ : నిజాం నిరంకుశ పాలనకు భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ కొనియాడారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 40 వ వర్ధంతి సందర్భంగా ఈ.టి నరసింహ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎ.బోస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. ఛాయాదేవి, జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్ల కంటి శ్రీకాంత్, మామిడి చెట్ల వెంకటస్వామి తదితరులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 79వ వార్షికోత్సవాల కటౌట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ.టి నరసింహ మాట్లాడుతూ సిపిఐ ఆధ్వర్యంలో నేటి నుంచి 17 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నిజాం నిరంకుశ వ్యవస్థ, భూస్వాముల అరాచకాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో తెలంగాణ రైతులు నిర్వహించిన వీరోచిత సాయుధ పోరాట చరిత్రను బిజెపి నేతలు వక్రీకరించి, అబద్ధాలతో రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ మత విద్వేషాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన వివిఎస్ బోస్ మాట్లాడుతూ చారిత్రాత్మక తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులు మాత్రమే అని తెలిపారు. నిరంకుశ రాచరికానికి వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రకటించి, హైదరాబాద్ నడిబొడ్డున వీరోచిత పోరాటం చేసిన మఖ్దూమ్ మొహియుద్దీన్, బద్దం యెల్ల రెడ్డి, రావి నారాయణ రెడ్డి కమ్యూనిస్టు నేతలేనని, ఎక్కడా మత ప్రమేయం లేదని, ఇది నిజాం నిరంకుశ పాలనా, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన ప్రజా పోరాటం, ఇది చరిత్ర అని వివిఎస్ బోస్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు ఆరుట్ల రాజ్‌కుమార్, బాలకృష్ణ, బి.కిషన్, కళ్యాణ్,అనిల్, సుశాంత్, భాను, చింటూ పాల్గొన్నారు.

## జార్ఖండ్ సిఎంను కలిసిన డిప్యూటీ సిఎం భట్టి



ప్రజాపక్షం/హైదరాబాద్: జార్ఖండ్ పర్యటనలో భాగంగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జార్ఖండ్ ముక్తి మోర్చా వ్యవస్థాపకుడు, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, సిఎం హేమంత్ తండ్రి శిబూ సోరెన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శిబూ సోరెన్ మృతి పట్ల డిప్యూటీ సిఎం తన సంతాపాన్ని ప్రకటించారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఇటీవల జరిగిన జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా అక్కడ విస్తృతంగా పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హేమంత్ సోరెన్‌తో కలిసి పనిచేశారు. జెఎంఎం, కాంగ్రెస్ కూటమి ఆ ఎన్నికల్లో విజయం సాధించడంలో భట్టి విక్రమార్క కీలక భూమిక పోషించారు. బుధవారం రాంచీలో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను కలిసిన సందర్భంగా రెండు రాష్ట్రాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలు తదితర అంశాలపై వారు చర్చించారు.

# ట్రంప్‌కు దాసోహమంటున్న మోదీ

సుంకం రద్దుతో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం.. ఎస్‌కెఎం సదస్సులో వక్తలు




ప్రజాపక్షం/ఖమ్మం : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆంక్షలకు మోడీ తలొగ్గి దాసోహమంటున్నాడని సంయుక్త కిసాన్ మోర్చా నేతలు ఆరోపించారు. వ్యవసాయ రంగ ఉత్పత్తులు ముఖ్యంగా పత్తి దిగుమతిపై సుంకాన్ని రద్దు చేయడం భారతదేశ వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వారు ఆరోపించారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సదస్సు బుధవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. రైతు సంఘాల నేతలు దొండపాటి రమేష్, మాదినేని రమేష్, మలీదు నాగేశ్వరరావు, బజ్జూరి వెంకట్రామిరెడ్డి అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన ఈ సదస్సులో ఎస్‌కెఎం నేతలు మాట్లాడుతూ అమెరికాలో వ్యవసాయ రంగానికి 36 శాతం సబ్సిడీ ఇస్తున్నారని తెలిపారు. అమెరికా నుంచి దిగుమతి అయ్యే పత్తిపై గతంలో 11 శాతం పన్ను విధించే వారని ఇప్పుడు మోదీ సర్కార్ ఆ పన్నును ఎత్తివేయడంతో దేశ వ్యాప్తంగా పత్తి సాగు చేస్తున్న రైతులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. దేశవ్యాప్తంగా పత్తి ధరలు క్షీణించి పత్తి సాగు చేయాలంటే జంకే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పెట్టుబడి ఆధారంగా పత్తికి రూ.10075 ప్రకటించాలని ఆందోళనలు చేస్తున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోకపోగా రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని ఆరోపించారు. భారతదేశ వ్యాప్తంగా గణనీయంగా పత్తిని సాగు చేస్తున్నారని తెలంగాణలోనే సుమారు 50 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేస్తున్నారని ఎస్‌కెఎం నేతలు తెలిపారు. వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 536 సంఘాలు వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాయని ఆ క్రమంలోనే సదస్సు నిర్వహించబడుతుందన్నారు. సదస్సులో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాగం హేమంతరావు, పశ్య పద్మ, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, అఖిల భారత రైతు కూలీ సంఘం కేంద్ర కన్వీనర్ కెచ్చల రంగయ్య, ఏఐకెఎంఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.కోటేశ్వరరావు, కొండపర్తి గోవిందరావు, రైతు సంఘాల ప్రతినిధులు బొంతు రాంబాబు, కోలేటి నాగేశ్వరరావు, వై.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు ముందు బైపాస్ రోడ్డులో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని, రద్దు చేసిన దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించాలని, వ్యవసాయోత్పత్తులన్నింటికి మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# మంత్రి ప్రకటనను స్వాగతిస్తున్నాం

బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్



ప్రజాపక్షం/హైదరాబాద్: వానాకాలం ముగియగానే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజిలకు మరమ్మత్తులు చేయిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించడాన్ని తాము స్వాగ తిస్తున్నామని బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. 152 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టును నిర్మించడం అసాధ్యమని, ఇందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించబోదన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంఎల్‌ఎ వినయ్‌భాస్కర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు కె.వాసుదేవరెడ్డి, సతీష్ రెడ్డితో కలిసి వినోద్ కుమార్ మాట్లాడుతూ మేడిగడ్డ బ్యారేజికి మరమ్మతులు అవసరమని, అన్నారం, సుందిళ్లకు అవసరం ఉండకపోవచ్చని, ఒకవేళ ఉన్నప్పటికీ ఇబ్బందేమీ ఉండబోదన్నారు. తుమ్మిడి హట్టి దగ్గర నుంచి నీళ్ల ఎత్తిపోయాలంటే రెండు చోట్ల లిఫ్టులు అవసరమని, 152 మీటర్ల ఎత్తున గోదావరి జలాల తరలింపునకు మహారాష్ట్ర అంగీకరించే ప్రసక్తే లేదని, ఎపి, మహారాష్ట్ర, ఢిల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నప్పటికీ 152 మీటర్ల ఒప్పందాన్ని సాధించలేక పోయారని వినోద్ కుమార్ తెలిపారు. తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీటికి తీసుకొస్తే చాలా మంచిదని, కానీ తుమ్మిడి హట్టి నుంచి ఎల్లంపల్లికి నీళ్లు తీసుకురావాలన్నప్పటికీ లిఫ్ట్ చేయాల్సిందేనని వివరించారు. ఇప్పటికైనా మూడు బ్యారేజీలను రిపేర్ చేపించాలన్నారు. మేడిగడ్డ బ్యారేజీ విలువ రూ.3,500 కోట్లు అని, ఇందులో మూడు పిల్లర్ల విలువ కేవలం రూ.300 కోట్లు అని, కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం వ్యయంలో మూడు బారేజ్‌ల విలువ 6 శాతం మాత్రమేనని వినోద్ కుమార్ వివరించారు. యాసంగిలో మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తిపోయకపోవడంతో రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌పై కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# ముందస్తు చర్యల వల్ల తగ్గిన నష్టం

సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: ఇటీవల భారీ వర్షాలలో ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యల వల్ల చాలా వరకు ప్రాణ, ఆస్తి నష్టం తగ్గిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రధానంగా కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని సూచించారు. ఇప్పటివరకు పరిహారాలను విడుదల చేయకపోతే, వాటిని వెంటనే విడుదల చేయాలని అధికారులకు సూచించారు. అల్పపీడనం కారణంగా రాష్ట్రంలో రెండు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో భారీ వర్షాలతో జరిగిన నష్టం, ఇప్పటి వరకు తీసుకున్న సహాయక చర్యలపై ఆయా శాఖల వారీగా హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, రాష్ట్ర ప్రకృతి విపత్తుల నిర్వహణా విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పరిహారం విడుదల విషయంలో ఏ ఒక్క బాధితుడు కూడా పరిహారం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులు, కుంటలు, రోడ్ల మరమ్మతులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వర్షాలతో తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాలకు రూ.10 కోట్లు, సాధారణ నష్టం జరిగిన జిల్లాలకు రూ.5 కోట్లను విడుదల చేశామన్నారు. సహాయక చర్యలను ఆయా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని హైదరాబాద్ నుంచి ఆయా విభాగాధిపతులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వరద సహాయానికి సంబంధించి వినియోగించిన నిధులకు యుసిలను కేంద్రానికి అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 13వ తేదీలోగా ఆయా విభాగాలు యూసీలను సమర్పించాలని ఆదేశించారు.

### అర్హులైన జర్నలిస్టులకు మేలు జరిగేలా నిర్ణయాలు ఉండాలి



అర్హులైన జర్నలిస్టులకు మేలు జరిగేలా నిర్ణయాలు ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి , సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సి.హెచ్. ప్రియాంక, సిఎం సిపిఆర్ఓ గుర్రం మల్సూర్‌తో కలిసి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా అక్రిడిటేషన్ పాలసీ, జర్నలిస్టుల హెల్త్ పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హై పవర్ కమిటీ సిఫార్సులు తదితర అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ అంశాలపై కార్మిక, ఆరోగ్య, హోం, ఆర్థికశాఖ అధికారులతో త్వరలో మరోసారి సమావేశం నిర్వహించాలని వారు నిర్ణయించారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే ఇంటిని కూలగొట్టే లైసెన్స్ ఇచ్చినట్టే

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు




ప్రజాపక్షం/హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తమకు ఓటు వేయకపోతే సంక్షేమ పథకాలను ఆపేస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను బెదిరిస్తోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. జూబ్లిహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే ఉన్న ఇంటిని కూలగొట్టే లైసెన్స్ ఇచ్చినట్టేనని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహ్మత్‌నగర్ డివిజన్ కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ హైడ్రా పేరుతో బిల్డర్ల దగ్గర దోచుకున్న అవినీతి సొమ్మును ఉప ఎన్నికలో పంపిణీ చేసి ఎలాగైనా గెలవాలని సిఎం రేవంత్ రెడ్డి కుట్రకు పాల్పడుతున్నార్నారు. కాంగ్రెస్‌ను ప్రజలు తీవ్రంగా ద్వేషిస్తున్నారన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇండ్లు కూలగొట్టడమేనా అని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ తీవ్రంగా వ్యతిరేకించే బిజెపి, మోదీ, సిబిఐ లాంటి అంశాల్లో కాంగ్రెస్ భావజాలానికి సిఎం రేవంత్ రెడ్డి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్‌ను తీవ్రంగా ద్వేషిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బిఆర్ఎస్ నాయకులు తక్కళ్లపల్లి రవీందర్ రావు, మాజీమంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎంఎల్‌ఎలు వినయ్ భాస్కర్, పి.విష్ణువర్ధన్ రెడ్డి, కోరుకంటి చందర్, దివంగత మాగంటి గోపినాథ్ సతీమణి సునీత పాల్గొన్నారు.

## నేపాల్‌లో ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా
# తెలంగాణ పౌరుల కోసం 'ప్రత్యేక హెల్ప్ లైన్' ఏర్పాటు

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రస్తుతం నేపాల్‌లో అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎమర్జెన్సీ హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేసింది. దీని ద్వారా నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ పౌరులకు సహాయం చేయనుంది. ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు నేపాల్‌లో తెలంగాణ పౌరులెవరికీ ఎలాంటి ఇబ్బందులు లేవని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఖాట్మాండులోని భారత రాయబార కార్యాలయంతో రాష్ట్ర ప్రభుత్వం సమన్వయం చేసుకుంటూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. నేపాల్లో ఎవరైనా తెలంగాణ చిక్కుకుంటే వారి కుటుంబ సభ్యులు ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రైవేట్ సెక్రెటరీ లైజన్ హెడ్ వందన (మొబైల్ నెంబర్: +91 9871999044)ను, లైజన్ ఆఫీసర్ జి.రక్షిత్ నాయక్ (మొబైల్ నెంబర్:+91 9643 723157)ను, ప్రజా సంబంధాల అధికారి సిహెచ్.చక్రవర్తి (మొబైల్ నెంబర్:+91 9949351270)ను సంప్రదించవచ్చు. తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యులు అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. తప్పుడు ప్రచారాన్ని పట్టించుకోవద్దని సూచించింది. తెలంగాణ పౌరులకు నేపాల్‌లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విధమైన చర్యలు తీసుకుంటున్నట్టు తెలంగాణ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలియజేసింది.

## టిజిపిఎస్‌సి తప్పిదాలతో గందరగోళంలో నిరుద్యోగులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) చేస్తున్న వరుస తప్పిదాలతో నిరుద్యోగ యువతను తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికే గ్రూప్ 1 అభ్యర్థులు మూడు సార్లు పరీక్షనురాశారని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు అన్నారు. అయితే గ్రూప్ 1 మెయిన్స్ జవాబు పత్రాల మూల్యాంకనంలో తప్పిదాలు జరిగాయంటూ కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడం, కోర్టు మళ్లీ మూల్యాంకనం చేయడమో, మళ్లీ పరీక్షను నిర్వహించడమో చేయాలని హైకోర్టు ఆదేశించిందన్నారు.. రాష్ట్ర ప్రభుత్వం గత తప్పిదాలను పునరావృతం కాకుండా యూపిఎస్‌సి తరహాలో టిజిపిఎస్‌సిప్రక్షాళన చేసిన తర్వాత పరీక్షలను నిర్వహించి నియామకాలను చేపడతామని ప్రకటించిందని, కానీ మళ్ళీ తప్పిదాలు చేయడంతో నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అభ్యర్థులకు న్యాయం చేసే విధంగా తప్పిదాలకు తావులేకుండా టిజిపిఎస్‌సిని తీర్చిదిద్దాలని కోరారు.

# తిరోగమనమా.. పురోగమనమా?

సాయుధ పోరాట సారథిగా తిరుపతి
మావోయిస్టు పార్టీ బాధ్యతలు మరోసారి తెలుగు వారికి



ప్రజాపక్షం/ఖమ్మం : మావోయిస్టు ఉద్యమం అత్యంత సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుంది. దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల్లో ఉనికిని చాటుతూ కొన్ని ప్రాంతాల్లో సమాంతర ప్రభుత్వాలు నడిపిన మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రభుత్వ వైఖరితో భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్న వేళ కొత్త సారథి ఎన్నిక జరిగింది. మావోయిస్టు ఉద్యమ చరిత్రలో కార్యదర్శిగా ఉండి ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయిన నంబాల కేశవరావు తర్వాత మావోయిస్టు పార్టీ సారధ్య బాధ్యతలపై ఎన్నో ఊహగానాలు జరిగాయి. పలువురి పేర్లు పరిశీలనలోకి వచ్చినా ఎట్టకేలకు తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్ ప్రస్తుత జగిత్యాలకు చెందిన 58 ఏళ్ల తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీకి బాధ్యతలు అప్పగించారు. కేంద్ర ప్రభుత్వం 2026 నాటికి మావోయిస్టులను ఈ దేశంలో లేకుండా చేస్తామని ప్రకటించి ఆ దిశగా సాయుధ బలగాలను మోహరించింది. మావోయిస్టు పార్టీకి ప్రధాన కేంద్రంగా ఉన్న ఛత్తీస్‌గఢ్ దండకారుణ్యంపై దృష్టి కేంద్రీకరించి దాదాపు మావోయిస్టు స్థావరాలన్నింటిని జల్లెడపట్టి పోలీస్ బేస్ క్యాంపులను ఏర్పాటు చేసింది. మావోయిస్టులు తలదాచుకున్నారన్న నేపంతో 25వేల మంది పోలీసులతో కర్రెగుట్టలను జల్లెడ పట్టారు. ఆ క్రమంలోనే అనేక మంది ఎన్‌కౌంటర్ల పేరుతో హతమయ్యారు. మావోయిస్టు భవితవ్యంపై నీలి నీడలు కమ్ముకుంటున్న వేళ మావోయిస్టు పార్టీ నూతన కార్యదర్శిని ప్రకటించింది. ఈ దశలో నూతన సారధ్యంలో మావోయిస్టు తిరోగమనమా పురోగమనమా అన్నదానిపై విస్తృతంగా చర్చ సాగుతుంది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించినట్లుగా మావోయిస్టు పార్టీని లేకుండా చేయడం అసాధ్యం కావచ్చు కానీ అదే సమయంలో తిరిగి దండకారుణ్యంపై మావోయిస్టులు పట్టు సాధించడం కూడా ఆలోచించాల్సిన విషయమే. గతంలో మావోయిస్టు పార్టీకి అటవీ సమీప గ్రామాల ప్రజల సంపూర్ణ మద్దతు ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దానితో పాటు పోలీసుల వద్ద ఉన్న అధునాతన ఆయుధాలు అన్నింటికి మించి మావోయిస్టు సాయుధ బలగాల్లో పనిచేస్తున్న క్యాడర్ నాయకత్వం పట్ల విశ్వసనీయతను కోల్పోతుంది. ఒకరిద్దరు పోలీసులతో చేతులు కలపడం వల్లనే నంబాల కేశవరావు మృతి చెందారన్నది వాస్తవం. ఈ పరిస్థితుల్లో ప్రజల మద్దతు సైద్ధాంతిక శిక్షణ కలిగిన క్యాడర్ లేకపోవడం మావోయిస్టు ఉద్యమ మనుగడకు తీవ్ర అవరోధం కానున్నాయి. మరో పక్క అమిత్‌షా సవాల్‌కు ఇంకో ఆరు మాసాల సమయం ఉన్నది. మావోయిస్టు ఉద్యమం కేవలం వామపక్ష తీవ్రవాదంగా భావించకుండా సామాజిక రాజకీయ ఆర్థిక సమస్యగా పరిగణించాల్సి ఉంది. ఈ సందర్భంలో రాజకీయ సామాజిక ఆర్థిక సమస్యలకు సరైన పరిష్కారం చూపకుండా మావోయిస్టు పార్టీని అంతం చేయడమన్నది సాధ్యమయ్యే పని కాదు. ఒకవేళ మావోయిస్టు పరంగా సరైన కార్యాచరణ లేకపోతే తీవ్రవాదం మరో రూపు సంతరించుకుంటుంది తప్ప మావోయిస్టులను కాల్చి చంపడం ఒక్కటే సమస్యకు పరిష్కారం కాదన్న వాస్తవాన్ని పాలకులు గ్రహించడం లేదు. కొత్త సారధి తిరుపతికి పార్టీని కాపాడడంతో పాటు పురోగమన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇదే సమయంలో మిలిటెంట్ దాడులు చేయడంలో సిద్ధ హస్తుడిగా పేరొందిన హిడ్మాకు దండకారుణ్య బాధ్యతలను అప్పగించింది. దశాబ్ద కాలంగా హిడ్మా అనేక హింసాత్మక చర్యలకు నేతృత్వం వహించాడు. దాడి చేయడంలోనూ, తప్పించుకోవడంలోనూ పేరొందిన హిడ్మా ప్రజలతో మమేకమై ఉంటాడని పేరుంది. ఆయనకు దండకారుణ్య బాధ్యతలు అప్పగించడంతో మావోయిస్టు ఉద్యమ మనుగడపై కొంత మంది ఆశలు పెంచుకుంటున్నారు. ప్రజలతో మమేకం కావడం వల్లే పోలీసులు హిడ్మా జాడను కనుగొనలేకపోతున్నారన్న వాదన వినిపిస్తుంది. మొత్తంగా మావోయిస్టు నూతన సారధిగా బాధ్యతలు చేపట్టిన తిరుపతి ముందు పెను సవాళ్లు ఉన్నాయన్నది వాస్తవం. మావోయిస్టు జీవితమంటేనే ప్రాణాన్ని ఫణంగా పెట్టి పోరాడటం ఇప్పుడు ప్రాణం కంటే పార్టీ మనుగడే ప్రశ్నార్థకమైంది.



### మరోసారి తెలుగువారికి దక్కిన అవకాశం:

సాయుధ పోరాట ప్రభావం ఇప్పటి ఆంధ్రాలోని నల్లమల అటవీ ప్రాంతంతో పాటు ఉత్తరాంధ్రకు పరిమితం కాగా తెలంగాణలో గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాలకు పరిమితమైంది. రెండు దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల్లో ఆశించిన స్థాయిలో మావోయిస్టు కార్యాచరణ లేకపోయినా నాయకత్వ స్థాయిలో మాత్రం తెలుగు వారే కొనసాగుతుండటం గమనార్హం. కమ్యూనిస్టు పార్టీలో పలు చీలికల తర్వాత సాయుధ పంథాను ఎంచుకున్న ఒకప్పటి పీపు ల్స్ వార్ ఇప్పటి మావోయిస్టు పార్టీకి తెలుగు వారే సార ధ్యం వహించారు. కెవిఎస్‌గా పేరొందిన కొండపల్లి సీతారామయ్య, లక్ష్మణ్‌రావు, నంబాల కేశవరావు సుదీర్ఘ కాలం నాయకత్వ బాధ్యతలను నిర్వర్తించారు. ఇప్పుడు మరోమారు తెలంగాణ రాష్ట్రానికి చెందిన తిరుపతి అలియాస్ దేవ్‌జీకి మావోయిస్టు పగ్గాలు అప్పగించారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

'e' NIT No. 07/J1/IT/GHMC/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్స్ తేది: 08.09.2025

**పని పేరు:** జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయం & సర్కిల్‌లో (21) ప్రాంతాలలో (2) సంవత్సరాల కాలానికి రిడెండెన్సీ కమ్ ప్యారలల్ కనెక్టివిటీ కోసం (1:1) ఇంటర్నెట్ లీజుకు ఇచ్చిన లైన్లను అందించడం. **అంచనా విలువ / ఇసివి:** రూ.41,46,660/-, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** ప్రారంభ తేది: 10.09.2025న ఉ.11.00గం.ల నుండి, ఆఖరి తేది: 18.09.2025న సా.04.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** అడిషనల్ కమిషనర్ కార్యాలయం (ఐటి), 3వ అంతస్తు, సిసి కాంప్లెక్స్ భవనము, జిహెచ్ఎంసి, లిబర్టీ సర్కిల్, హైదరాబాద్ - 500063. ఫోన్: 6309999458. deeit-ghmc@gov.in

సం/- అడిషనల్ కమిషనర్ (ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ), జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 7830-PP/CL/ADVT/1/2025-26, Date: 10-09-2025

**పురపాలక సంఘ కార్యాలయము : మొయినాబాద్, జిల్లా రంగారెడ్డి.**

లేఖ నెం. F1/MNBD/2025 వేలం ప్రకటన నోటీసు తేది: 10.09.2025

విషయము : పురపాలక సంఘం మొయినాబాద్ - చికెన్, మటన్, చేపల మాంసపు వ్యర్థాలను సేకరణకు గాను వేలం వేయుటకు ప్రకటన జారీ చేయుట - గురించి.

నిర్దేశ్యము : 1) F1/MNBD/2025-3, తేది.28-06-2025.

*****

ఇందుమూలముగా ఆసక్తి, అర్హత మరియు అనుభవం గల ఏజెన్సీలు, వ్యక్తులకు తెలియజేయునది ఏమనగా, మొయినాబాద్ పురపాలక సంఘము యొక్క పరిధిలోని చికెన్, మటన్, చేపల మాంసపు దుకాణాల నుండి వెలువడే మాంసపు వ్యర్థాలను సరియైన విధానములో సేకరించడానికి గాను తేదీ.11.09.2025 నుండి తేది. 18.09.2025 వరకు కార్యాలయ పని వేళలో దరఖాస్తులను సమర్పించగలరు మరియు తేదీ.18.09.2025 సాయంత్రం 5.00 గంటలకు మున్సిపల్ కమిషనర్ గారు దరఖాస్తుదారుల ముందు వేలం పాటను మున్సిపాలిటీ కార్యాలయము (అజీజ్ నగర్) యందు నిర్వహించబడును. ఇతర వివరాల కొరకు మున్సిపాలిటీ కార్యాలయ పని వేలలలో మేనేజర్ గారిని సంప్రదించగలరు.

సం/- కమిషనర్ మొయినాబాద్ మున్సిపాలిటీ

DIPR R.O. No. : 7869-PP/CL/ADVT/1/2025-26, Date: 10-09-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## బిసిలు ఐక్యం కావలసిన సమయం ఆసన్నం

హైదరాబాద్ : బిసిల రాజకీయ పార్టీ ఏర్పాటు చేయాలనుకోవడం విఫల యత్నమని, గతంలో అనేకమంది రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసి చేతులు కాల్చుకున్న విషయాన్ని గమనంలో ఉంచుకోవాలని బిసి నేత ధనుంజయ నాయుడు పేర్కొన్నారు. బిసి కులాలను ఐక్యం చేయకుండా పొట్టు మీద ఇల్లు అలికినట్టు హడావుడిగా పార్టీ ఏర్పాటు చేస్తే అది నిలబడకపోతే అగ్ర వర్ణాల ముందు నవ్వుల పాలు కావాల్సి వస్తుందన్నారు. ముందు బిసి కులాల ఐక్య జెఎసి ఏర్పాటు చేసి బిసిలల ఓటు బిసిలకు వేసుకునే విధంగా ముందు వారిని చైతన్యపరచాలన్నారు. ఇప్పుడు బిసి పార్టీ పెడతామని ప్రకటించిన వారందరూ ఏదో ఒక రాజకీయ పార్టీ అండ చూసుకొని ఎమ్మెల్సీలుగా రాజ్యసభలుగా ఎంపికయ్యారే తప్ప బిసి కులాల వల్ల ఎవరు కూడా పదవులు పొందలేదని అక్షర సత్యమన్నారు. ముందు వారు వివిధ పార్టీల నుంచి పొందిన పదవులకు రాజీనామా చేసి, ఆ తరువాత బిసిలను నమ్ముకుని ప్రజాక్షేత్రంలో గెలుపొందితే వారిని మాత్రమే ప్రజలు నమ్ముతారన్నారు. ఆ దమ్ము ధైర్యం ఎవరికి ఉందని ఆయన ప్రశ్నించారు.

## ఆ భూములపై చర్యలు తీసుకుంటున్నాం

ప్రజాపక్షం/హైదరాబాద్ : నిషేధిత జాబితాలోని భూముల వివరాలను సేకరించి వాటిని సబ్‌రిజిస్ట్రార్‌లకు అందజేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బుధవారం హైకోర్టుకు తెలియజేశారు. కలెక్టర్ల నుంచి, దేవాదాయశాఖ, వక్ఫ్‌బోర్డు నుంచి 22ఎలోని నిషేధిత భూములకు సంబంధించిన వివరాలను నిర్దిష్ట దరఖాస్తు రూపంలో తెప్పించాలని సీసీఎల్‌ఏకు ఆదేశాలు జారీ చేశారన్నారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టినాగులపల్లిలోని శంకర్‌హిల్స్ కాలనీలోని 475 చదరపు గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్‌కు తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ గుప్త రియాల్టీతోపాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిని హైకోర్టు విచారణ సమయంలో నిషేధిత భూముల వివరాలను సబ్ రిజిస్ట్రార్లకు ఇవ్వాలని గతంలో ఆదేశించిన మేరకు చర్యలు తీసుకున్నట్లు సీఎస్ చెప్పారు. పిటషన్లకు చెందిన భూములను రిజిస్ట్రేషన్‌ను నిరాకరిస్తూ దాఖలైన పిటిషన్‌లలో కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించిన హైకోర్టు విచారణను 17వ తేదీకి వాయిదా వేసింది.

## సరోగసీ కేసుల్లో దంపతులు కూడా బాధితులు : హైకోర్టు

ప్రజాపక్షం/హైదరాబాద్ : సరోగసీ కేసులో మోసపోయిన దంపతులు కూడా బాధితులేనని హైకోర్టు పేర్కొంది. డాక్టర్ చేసిన నేరం వల్ల వారు వేదనకు గురవుతున్నారని, వారికి శిశువును అప్పగించాలంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రెండు నెలలుగా వారి సంరక్షణలో ఉన్న చిన్నారి క్షేమంగా ఉందని, విచారణలో భాగంగా అధికారులు ఎప్పుడైనా వెళ్లి చూడవచ్చని పేర్కొంది. ఈ ఉత్తర్వులు ఇతర కేసులకు వర్తించదని వెల్లడించింది. సరోగసి పేరుతో డాక్టర్ నమ్రత రూ.20 నుంచి రూ.30 లక్షలు వసూలు చేసి శిశువుల అక్రమ రవాణాకు పాల్పడ్డారంటూ కేసు నమోదు చేసి, చిన్నారులను శిశువిహార్ సంరక్షణలోకి తీసుకున్న కేసులో భాగమైన తమ బిడ్డను అప్పగించాలని కోరుతూ పుప్పాలగూడకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై మధ్యంతర ఉత్తర్వులిచ్చిన హైకోర్టు విచారణను అక్టోబరు 15కు వాయిదా వేసింది.

## ‘ఆపరేషన్ అమానత్’ సక్సెస్




ప్రజాపక్షం/హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వేలోని రైల్వే రక్షణ దళం(ఆర్‌పిఎఫ్) ప్రయాణీకులకు సేవలను అందించే దిశలో భాగంగా 'ఆపరేషన్ అమానత్' కింద కోల్పోయిన మొబైల్ ఫోన్లను కనుగొని తిరిగి పొందడానికి డిజిటల్ సాధనాలను సమర్థవంతంగా ఉపయోగించడంలో విజయం సాధించింది. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సిఇఐఆర్) పోర్టల్ ద్వారా, ఆర్‌పిఎఫ్ సైబర్ సెల్ జోన్ వ్యాప్తంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో స్పష్టమైన ఫలితాలు పొందే చర్యల్లో భాగంగా రికవరీ కార్యకలాపాలను నిర్వహిస్తోంది. రైలు మదద్ ద్వారా కంప్లయింట్ నమోదు చేసినప్పుడు మాత్రమే కోల్పోయిన పరికరాలను రికవరీ చేయడానికి ఆర్‌పిఎఫ్ అధికారం ఉంది. డిపార్ట్ మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ అభివృద్ధి చేసిన సిఇఐఆర్ పోర్టల్ ద్వారా ఐఎంఇఐ ఆధారిత ట్రాకింగ్, పోయిన లేదా దొంగిలించబడిన మొబైలు పరికరాలను బ్లాక్ చేయడానికి వీలవుతుంది. అయితే ఆర్‌పిఎఫ్ ప్రత్యేక సైబర్ సెల్ జోన్ వ్యాప్తంగా రికవరీ ఆపరేషన్లను చేపడుతున్నది. ఆర్‌పిఎఫ్ సైబర్ సెల్ ఆగస్టు నెలలో దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజన్ల నుండి వచ్చిన మొత్తం 125 ఫిర్యాదులను అందుకుంది. ఈ ఫిర్యాదులలో, సైబర్ సెల్ 96 మొబైల్ ఫోన్‌లను బ్లాక్ చేసింది, 34 పరికరాల జాడను గుర్తించడం జరిగింది.దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ రైలు ప్రయాణికులకు సేవ చేయడంలో దక్షిణ మధ్య రైల్వేలోని రైల్వే రక్షణ దళం చేస్తున్న కృషి, అంకితభావాన్ని ప్రశంసించారు. డిజిటల్ ఇంటెలిజెన్స్, సకాలంలో చర్య, ఇంటర్‌ఏజెన్సీ సహకారం ద్వారా దొంగిలించబడిన లేదా పోయిన ఆస్తులను తిరిగి పొందడంలో ఆర్‌పిఎఫ్ సైబర్ సెల్ కీలక శక్తిగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఈ చొరవ రైల్వే నెట్‌వర్క్ వ్యాప్తంగా భద్రత, సేవలను నిర్ధారించడంలో ఆర్‌పిఎఫ్ నిబద్ధతపై ప్రజల నమ్మకాన్ని బలోపేతం చేస్తూనే ఉందని ఆయన అన్నారు.




## మియాపూర్‌లో సిఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభం

ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : మియాపూర్ బస్టాప్ పరిధీలో బుధవారం సియంఆర్ షాఫింప్‌మాల్ నూతన బ్రాంచిని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనీతార మృణాల్ ఠాకూర్, సియంఆర్ అధినేత వెంకటరమణ, శేరిలింగంపల్లి ఎంఎల్‌ఏ ఆరెకపూడీ గాంధీ, మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పాలపాటి శ్రీకాంత్‌లు వీచ్చేసి షాపింగ్‌మాల్‌ను ప్రారంభించారు. అనంతరం సీనీతార మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ మహిళలకు కావలసిన అన్ని రకాల బ్రాండ్‌ల చీరలు, నూతన డిజైన్‌లతో కూడిన బంగారు అభరణాలు, కిడ్స్‌వేర్, మెన్స్‌వేర్ దుస్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జగదీశ్వర్‌రావు, మాధవరం రామరావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, గంగాధర్, హరికృష్ణ పాల్గొన్నారు.

## 12న సీతారాం ఏచూరి వర్ధంతి సభ

ప్రజాపక్షం/హైదరాబాద్ : సిపిఐ(ఎం) మాజీ జాతీయప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ ఈనెల 12న హైదరాబాదు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు సిపిఎం రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా ‘‘భారతీయ భావన – వాస్తవం –వక్రీకరణ’’ అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ సదస్సుకు ప్రధాన వ్యక్తగా సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యులు బివిరాఘవులు, వక్తలుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు,సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సిపిఐ(ఎంఎల్ )మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సిపిఐ (ఎంఎల్ )న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి పి సూర్యం, ఎంసిపిఐయురాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్రకార్యదర్శి ఎం.రమేష్‌రాజా, ఆర్‌ఎస్‌పిరాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, ఎన్ ఎస్‌యుసిఐరాష్ట్ర కార్యదర్శిసిహెచ్ మురహరి, ఫార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి బి.సురేందర్‌రెడ్డి, సిపిఐఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్నలు ప్రసంగిస్తారని వెల్లడించింది. ఈ వర్ధంతిసభలో సిపిఎం, వామపక్ష పార్టీల శ్రేణులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయగలరని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది.

# పొలిటికల్ పోస్టులపై కేసులు చెల్లవు

### సోషల్ మీడియా పోస్టులపై హైకోర్టు కీలక ఆదేశాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : సోషల్ మీడియాలో రాజకీయ ప్రసంగాలతో కూడిన పోస్టులపై ఆధారం లేకుండా పోలీసులు కేసు నమోదు చేయడానికి వీల్లేదని హైకోర్టు సంచలన తీర్పు చెప్పింది. రాజకీయ ప్రసంగాల ఆధారంగా చేసిన పోస్టులపై కేసులు చెల్లుబాటు కావంటూ బుధవారం హైకోర్టు మార్గదర్శకాలతో కూడిన తీర్పు చెప్పింది. వీటి ఫిర్యాదులపై కేసులు నమోదుకు ముందుకు పోలీసులు ప్రాథమిక విచారణ చేయాలంది. హింస, అశాంతికి అస్కారం ఉంటేలా పోస్టులు ఉంటే కేసులను నమోదు చేయవచ్చునని చెప్పింది. తీవ్రమైన రాజకీయ విమర్శలు చేశారని చెప్పి కేసు నమోదుకు వీల్లేదంది ఆధారాలు ఉన్నాయని తేలినపుడే కేసు నమోదు చేయాలంది. తమ నేత పరువు ప్రతిష్టలకు భంగం చేకూరేలా పోస్టు ఉందని చెప్పి మూడో వ్యక్తి ఫిర్యాదు చేస్తే దాని ఆధారంగా పోలీసులు క్రిమినల్ కేసు నమోదుకు వీల్లేదంది. నిజంగానే ఆ నేత పరువు ప్రతిష్టలకు నష్టం వాటిల్లే పోస్టయితే సదరు నేతే స్వయంగా ఫిర్యాదు చేయాలేగానీ మూడో వ్యక్తి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చెల్లదంది. ద్వేషపూరిత ప్రసంగం, హింసను ప్రేరేపించేది, సామాజిక శాంతి భద్రతలకు భంగం కలిగించే పోస్టు అయితే అందుకు ఆధారాలు ఉంటే కేసు పెట్టి విచారణ చేయవచ్చునని స్పష్టం చేసింది. అందుకు విరుద్ధంగా చట్టబద్ధమైన అంశాలు లేకుండా కేవలం రాజకీయ విమర్శ తీవ్రంగా ఉందని చెప్పి కేసుల నమోదు చెల్లదంది. సీఎంపై విమర్శలు చేశారంటూ రామగుండం, కరీంనగర్‌లోని రెండు పోలీసు స్టేషన్‌లలో నమోదైన మూడు కేసులను కొట్టివేయాలంటూ నల్ల బాలు అలియాస్ దుర్గం శశిధర్‌గౌడ్ వేసిన పిటిషన్‌లో జస్టిస్ ఎన్.తుకారాంజీ బుధవారం ఈ కీలక తీర్పు చెప్పారు. ట్వీట్‌లు చట్టబద్ధమైన రాజకీయ వ్యక్తీకరణ పరిధిలోకి వస్తాయని కోర్టు భావిస్తోందని న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రాథమిక హక్కుల పరిరక్షణతో పాటు కేసుల నమోదు, విచారణ యాంత్రికంగా, ఏకపక్షంగా జరగకుండా నిరోధించే క్రమంలో ఈ మార్గదర్శకాలు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పరువు నష్టం కలిగిందని ఆరోపణలతో ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసే ముందు ఫిర్యాదుదారు చట్ట నిబంధనల ప్రకారం ‘బాధిత వ్యక్తి’ అవునో కాదో పోలీసులు ధ్రువీకరించాలన్నారు. తీవ్రమైన నేరాల సమయంలో తప్ప పోస్టులతో సంబంధంలేని ఇతరుల తరఫున చేసిన ఫిర్యాదులు విచారణార్హం కాదని పేర్కొన్నారు. ఏదైనా ఫిర్యాదు అందినపుడు అందులో తీవ్రమైన నేరం అయినపుడు పోలీసులు కేసు నమోదుకు ముందు ప్రాథమిక విచారణ జరిపి అందులో చట్టబద్ధమైన అంశాలున్నాయో లేదో నిర్ధారించిన తరువాతే కేసు నమోదుకు ముందుకెళ్లాలన్నారు. హింస, ద్వేషం, అశాంతిని ప్రేరేపించే అంశాలకు ప్రాథమిక ఆధారాలుంటే తప్ప వీటికి సంబంధించిన కేసులు నమోదు చేయరాదన్నారు. ఈ విషయంలో కేదార్‌నాథ్‌సింగ్ వర్సెస్ బీహార్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు శిరోధార్యమని తేల్చి చెప్పారు. విమర్శనాత్మకమైన, ఘాటైన రాజకీయ ప్రసంగాలపై పోలీసులు యాంత్రికంగా కేసులు నమోదు చేయరాదన్నారు. ప్రసంగం, పోస్టు హింసను ప్రేరేపించేలా లేదా ప్రజా శాంతి భద్రతలకు తక్షణ ముప్పు కలిగించేలా ఉన్నపుడు మాత్రమే చట్టాన్ని అమలు చేస్తూ కేసులు నమోదు చేయవచ్చున్నారు. అధికరణ 19(1)(ఎ) కింద సాధారణ రాజకీయ విమర్శలకు రాజ్యాంగ రక్షణలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భావప్రకటన స్వేచ్ఛకూ పరిమితులున్నాయని ఈ సందర్భంగా హితవు పలికారు. పరువు నష్టానికి సంబంధించి పోలీసులు నేరుగా ఎఫ్ఐఆర్ దాఖలు చేయరాదని తేల్చి చెప్పారు. సంబంధిత మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించమని ఫిర్యాదుదారుకు చెప్పాలన్నారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 174(2) కింద మేజిస్ట్రేట్ జారీ చేసిన ఆదేశాల మేరకు పోలీసులు చర్య తీసుకోవాలన్నారు. పోస్టులపై ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా యాంత్రికంగా




అరెస్టులు చేయరాదన్నారు. ప్రతి సందర్భంలోనూ ఆర్నేష్ కుమార్ వర్సెస్ బీహార్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను అమలు చేయాలన్నారు. రాజకీయ ప్రసంగం/పోస్టు లేదంటే ఇతర సున్నితమైన వ్యక్తీకరణకు సంబంధించి చట్టబద్ధంగా చర్యలుండేలా చూసుకోవాల్సి ఉందన్నారు. ఇలాంటివాటిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసే ముందు పీపీ నుంచి లీగల్ ఒపీనియన్ తీసుకోవాలన్నారు. రాజకీయ ప్రేరేపిత ఫిర్యాదుపై కేసు నమోదు చెల్లదని తీర్పు చెప్పారు.

## దసరా,దీపావళి దృష్ట్యా భద్రతా చర్యలపై
# అధికారుల ఉమ్మడి కార్యాచరణ




ప్రజాపక్షం/హైదరాబాద్: రాబోయే దసరా, దీపావళితో పాటు ఛత్ పండుగల దృష్ట్యా పండుగ సీజన్ ప్రయాణాలు గరిష్ట స్థాయికి చేరుకుంటాయని రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్, హైదరాబాద్, చర్లపల్లి , లింగంపల్లి, కాచిగూడ స్టేషన్లలో అంచనా వేసిన ప్రయాణీకుల రద్దీని సమర్థవంతంగా నిర్వహించడానికి రైల్వేలు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్ ), ప్రభుత్వ రైల్వే పోలీస్ (జిఆర్‌పి ), స్థానిక పోలీస్, ట్రాఫిక్, తెలంగాణ ఆర్‌టిసి అధికారులు ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. దీనికి సంబంధించిన ఒక సమన్వయ సమావేశం డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ గోపాలకృష్ణన్ ఆర్, హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్ వర్మ అధ్యక్షతన బుధవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో జరిగింది. ఈ సమన్వయ సమావేశాన్ని సికింద్రాబాద్ డివిజన్, హైదరాబాద్ డివిజన్‌ల అసిస్టెంట్ కమిషనర్ ఆలకుంట నవీన్ కుమార్, సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డిసిఎం షిఫాలి కుమార్, హైదరాబాద్ డివిజన్ సీనియర్ డిసిఎం డాక్టర్ అనిరుధ్ పామర్ జెడ్, ఆర్‌టిసి డిప్యూటీ రీజినల్ మేనేజర్ పవిత్ర, అదనపు డిసిపి ఎ.రాములు, అధికారులు ఎస్.ఎన్ .జావేద్, ఎన్. వెంకట రమ, జి. శంకర్ రాజు, కె. శశాంక్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సంధర్భంగా అధికారులు ప్రయాణీకుల రద్దీ నిర్వహణ,యు భద్రతా చర్యలను సమీక్షించారు. ఇందులో చైన్ స్నాచింగ్, జేబు దొంగతనాలు , నిషేధిత ప్రాంతాలలోకి అనధికారిక ప్రవేశం, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, వెయిటింగ్ హాళ్లు మరియు సర్క్యులేటింగ్ జోన్లలో రద్దీ వంటి సమస్యలపై దృష్టి కేంద్రీకరించారు. గతంలో ఇతర ప్రధాన స్టేషన్లలో జరిగిన తొక్కిసలాట లాంటి పరిస్థితుల ప్రమాదాన్ని గుర్తుచేశారు.ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి, ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి గస్తీ, తనిఖీలు ముమ్మరం చేస్తాయి. స్థానిక పోలీసులు ప్రయాణీకుల రద్దీని నియంత్రించడం, శాంతిభద్రతల విధుల్లో సహాయం చేస్తారు. ట్రాఫిక్ పోలీసులకు స్టేషన్ పరిసరాల ప్రాంతాలలో రద్దీని క్రమబద్దీకరణ చేయడానికి వాహనాల కదలికను నియంత్రించడం, నోపార్కింగ్ నిబంధనలను అమలు చేయడ, ఆటోలు, క్యాబ్‌లు, బస్సుల కోసం ప్రత్యేక లేన్‌లను కేటాయించడం వంటి భాధ్యతలు అప్పగించారు. సికింద్రాబాద్ ప్లాట్‌ఫారమ్ 10 వైపు, చర్లపల్లి ప్లాట్‌ఫారమ్1 ప్రవేశ రహదారి, కాచిగూడలోని ఆలయ వైపు రహదారి ప్రాంతం మొదలైన కీలకమైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పండుగ సీజన్‌లో ప్రయాణీకులకు సురక్షితమైన, సజావుగా ఇబ్బంది లేని ప్రయాణాన్ని నిర్ధారించడానికి అన్ని ఏజెన్సీలు పూర్తి సమన్వయంతో పనిచేయడానికి కట్టుబడి ఉండాలనే ధృడ సంకల్పంతో సమావేశం ముగిసింది.



## హైదరాబాద్ నగరంలో రోడ్ల నిర్వహణ, రోడ్డు భద్రతా చర్యలు అభినందనీయం
### సుప్రీంకోర్టు రోడ్డు భద్రతా కమిటీ చైర్మన్

ప్రజాపక్షం/హైదరాబాద్: రోడ్డు ప్రమాదాల నియంత్రణ కు పటిష్ట చర్యలు చేపట్టాలని, రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల్లో ఎవ్వరూ చనిపోకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సుప్రీంకోర్టు రోడ్డు భద్రతా కమిటీ (ఎస్‌సిసిఆర్‌ఎస్) చైర్మన్ జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే అన్నారు. రోడ్డు భద్రతా కమిటీ రాష్ట్ర స్థాయి సమావేశం హైదరాబాద్‌లో బుధవారం జరిగింది. సుప్రీం కోర్టు రోడ్డు భద్రతా కమిటీ (ఎస్‌సిసిఆర్‌ఎస్) ఛైర్మన్, జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, డిజిపి డాక్టర్ జితేందర్, పురపాలక కార్యదర్శి ఇలంబర్తి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌తో పాటు పోలీసు, రెవెన్యూ, హెచ్‌ఎండిఎ, రవాణా శాఖ, రోడ్లు, భవనాల శాఖ, ట్రాఫిక్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. సమావేశంలో పలు శాఖలు రోడ్డు భద్రతా చర్యలపై తమ శాఖ తీసుకున్న చర్యలను వివరించారు. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా చేపట్టిన రోడ్డు భద్రతా కార్యక్రమాలను జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ పవర్పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చైర్మన్ కు వివరించారు. ఈ సందర్భంగా జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో రోడ్ల నిర్వహణ, రోడ్డు భద్రతా చర్యలు అభినందనీయమని జిహెచ్ఎంసిని ప్రశంసించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రతా చర్యల అమలులో కార్పొరేషన్ చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.




## ఒఎంసి కంపెనీలు భద్రత చర్యలపై దృష్టి
### ఒఎస్‌సిసి సమావేశంలో డిజిపి జితేందర్

ప్రజాపక్షం/హైదరాబాద్: ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ (ఒఎంసి)లు భౌతిక భద్రతతో పాటు సైబర్ భద్రతపై దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ సూచించారు. తెలంగాణ రాష్ట్రం 6వ ఆన్‌షోర్ సెక్యూరిటీ కోఆర్డినేషన్ కమిటీ (ఒఎస్‌సిసి) సమావేశం బుధవారం డిజిపి కార్యాలయంలో జరిగింది...ఒఎస్‌సిసి వార్షిక నివేదికపై ఈ సమావేశంలో చర్చించారు. సమావేశంలో భద్రతా సంసిద్ధత, భౌతిక మౌలిక సదుపాయాల రక్షణ, సైబర్ భద్రతతో పాటు అత్యవసర ప్రతిస్పందన విధానాలపై సమగ్రంగా సమీక్ష జరిగింది. రాష్ట్రంలో ప్రస్తుత భద్రతా పరిస్థితిపై పోలీసు అధికారులు ఒఎస్‌సిసి సభ్యులకు వివరించారు. కీలకమైన చమురు, గ్యాస్ మౌలిక సదుపాయాల రక్షణను బలోపేతం చేయడానికి నిర్దిష్ట సలహాలు, మార్గదర్శకాలను సమావేశంలో అధికారులు జారీ చేశారు. చమురు, గ్యాస్ కంపెనీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో తాము ఎదుర్కొంటున్న కార్యాచరణ సవాళ్లు, భద్రతా సమస్యలను లేవనెత్తారు. పోలీసులు , జిల్లా యంత్రాంగం నుండి నిరంతర మద్దతుతో పాటు సమన్వయాన్ని కోరారు. ఈ ముఖ్యమైన జాతీయ ఆస్తులను కాపాడుకోవడానికి ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి, ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి సమన్వయంతో కూడిన ప్రతిస్పందన వ్యూహాన్ని రూపొందించడానికి ఈ ఫోరమ్ ఒక విలువైన వేదికను అందించింది. ఈ సమావేశంలో డిజిపి డాక్టర్ జితేందర్, అదనపు డిజిలు మహేష్ ఎం భగవత్, చారు సిన్హా, గెయిల్ లిమిటెడ్ భద్రత సలహదారు ఐపిఎస్ అధికారి సౌరభ్ టోలంబియాలు, పోలీస్ కమీషనర్లు సుధీర్ బాబు, అవినాష్ మొహంతి, ఎస్ఐబి జాయింట్ డైరెక్టర్ తిరుజ్ఞాన సంబంధన్, అధికారులు కమలసన్ రెడ్డి, ఎం. శ్రీనివాసులు, హైదరాబాద్ నగర జాయింట్ కమిషనర్ పరిమళ హనా నూతన్, సిఐ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. గెయిల్, హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్, ఐఒసిఎల్, భాగ్యనగర్ గ్యాస్, పిఐఎల్, మేఘా సిటీ గ్యాస్ కంపెనీల అధిపతులు, భద్రతా ప్రతినిధులు పాల్గొన్నారు.


## ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు
### పోలీసు అధికారుల సంఘం

ప్రజాపక్షం/హైదరాబాద్: గణేష్ ఉత్సవాలను విజయవంతంగా ముగించిన హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్‌కు పోలీసు అధికారుల సంఘం శుభాకాంక్షలు తెలిపింది. ఈ మేరకు సంఘం నాయకులతోపాటు పోలీసు కోఆపరేటివ్ సొసైటీ నేతలు బుధవారం బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిలో కమిషనర్ సివి ఆనంద్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని పూలగుచ్చం అందించారు. ఇటీవల నగరంలో గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసిన సందర్భంగా కమిషనర్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీ నల్లా శంకర్ రెడ్డి సభ్యులు పాల్గొన్నారు. సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## మానసిక సమస్యలకు టెక్నాలజీతో పరిష్కారం : మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్: సమాజంలో వేగంగా పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళన తదితర మానసిక సమస్యలకు పరిష్కారం చూపించగల సామర్థ్యం టెక్నాలజీకి ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 'సైబర్ హోప్ హెల్ప్ ఇనిషియేటివ్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో రూపొందించిన ఏఐ ఆధారిత మెంటల్ హెల్త్ సపోర్ట్ సిస్టం 'హోప్ ఐ' ను ఆయన బుధవారం రాయదుర్గంలోని టీ హబ్‌లో లాంఛనంగా ఆవిష్కరించారు. ఇన్నోవేషన్ హబ్ గా తెలంగాణ తీర్చి దిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఈ సందర్భంగా వివరించారు. ప్రజల ప్రాణాలను కాపాడే ఆవిష్కరణలకు అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. ఆ దిశగా దృష్టి సారించి ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను కనుక్కోవాలని యువ ఆవిష్కర్తలకు సూచించారు. కార్యక్రమంలో టీ హబ్ సీఈవో కవిక్రుత్, సైబర్ హోప్ హెల్ప్ ఇనిషియేటివ్ ఫౌండేషన్ ఛైర్మన్ ఇన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## ఎంతో మందికి స్ఫూర్తినిచ్చిన వీరనారి ఐలమ్మ : కోదండరామ్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ సాయుధ పోరాటంలో ఎంతో మందికి స్ఫూర్తినిచ్చిన ఐలమ్మ వీరనారిగా మారి, నేటి తెలంగాణ ఉద్యమకారులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. కోదండరాం అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని టిజెఎస్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఐలమ్మ చిత్రపటానికి కోదండరామ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాట స్ఫూర్తిని ,త్యాగాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ నామకరణం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నర్సయ్యగౌడ్, కార్యాలయ ఇన్‌చార్జ్ హనుమంత్ రెడ్డి, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రగిరి సత్యనారాయణ, రాష్ట్ర నాయకుడు సర్దార్ వినోద్ కుమార్, నాయకులు జపాన్ రెడ్డి, సురేష్ కుమార్,గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## సంప్రద మల్టీక్యూజిన్ రెస్టారెంట్‌ను ప్రారంభించిన మంత్రి తుమ్మల




ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : ఆరోగ్యకర భోజనానికి సంప్రద మల్టీక్యూజిన్ రెస్టారెంట్ చిరునామాగా నిలుస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. బుధవారం గచ్చిబౌలిలోని వినాయక నగర్‌లో ఏర్పాటు చేసిన రెస్టారెంట్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, చేవేళ్ళ యంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సంప్రద మల్టీక్యూజిన్ రెస్టారెంట్ డైరెక్టర్ నాగభరత్, దయాకర్‌బాబు, శేరిలింగంపల్లి ఎంఎల్‌ఏ అరికెపూడీ గాంధీ, లు విచ్చేసి ప్రారంభించారు. అనంతరం తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ తిరుపతిలో ప్రారంభమైన సంప్రద రెస్టారెంట్‌ల ప్రయాణం ఇప్పుడు అనేక నగరాలలో శాఖలతో విస్తరించి అందరి అభిరుచులకు తగ్గట్టుగా రుచికరమైన నాణ్యమైన వంటకాలను అందిస్తూ ముందుకు వెళ్తున్నారని తెలిపారు. తదుపరి చేవేళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత యువత బర్గర్లు, ఫిజ్జాలు వంటి ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటు పడి అనారోగ్య పాలౌతూ ఇబ్బందులు పడుతున్నారని , పిజ్జాలు, బర్గర్లులకు దురంగా ఉండి చక్కని నాణ్యమైన వంటకాలు ఎంచుకొని భుజించాలని సూచించారు.సంప్రద రెస్టారెంట్‌లో వంటకాలు ఏంతో రుచిగా నాణ్యమైనవిగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధార్‌రెడ్డి, శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, పంచాయతీ రాజ్ అధ్యక్షుడు పసునూరి నరేంద్ర, సింగం పాల్గొన్నారు.



## బోయిన్‌పల్లి మార్కెట్ హమాలీలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి : ఎం.సరసింహా

ప్రజాపక్షం/హైదరాబాద్ : బోయిన్‌పల్లి కూరగాయాల మార్కెట్ యార్డులో పనిచేయుచున్న హమాలీలకు ఇందిరమ్మ ఇండ్లతో కూడిన హమాలీ బస్తీని ఏర్పాటు చేయాలని ఎఐటియూసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం జరిగిన కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రజావాణి కార్యక్రమంలో ఎంఎల్‌ఏ శ్రీగణేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎం నరసింహ మాట్లాడుతూ గత 24 సంవత్సరాలుగా బోయిన్‌పల్లిలో కూరగాయాల మార్కెట్ రెండు తరాలుగా హమాలీలు పని చేయుచున్నారని,పేద కార్మికులైన వీరికి రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇస్తున్నటువంటి ఇందిరమ్మ ఇండ్లను హమాలీ బస్తి పేరుతో ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా మార్కెట్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని రోడ్లు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హమాలి యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. ఎల్లయ్య ప్రధాన కార్యదర్శి ఎ.గట్టయ్య బి.రాజయ్య ఎన్.లింగం డి.రాజు, కొమురయ్య పాల్గొన్నారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## ఆధార్‌ను అనుమతించండి

### బీహార్ ఎన్నికల సంఘానికి ఇసిఐ సూచన

**న్యూఢిల్లీ :** సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి ఓటర్ల గుర్తింపును నిర్ధారించడానికి ఆధార్ కార్డును అదనపు పత్రంగా అంగీకరించాలని ఎన్నికల కమిషన్ బీహార్ ఎన్నికల యంత్రాంగాన్ని కోరింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి రాసిన లేఖలో కమిషన్ 'జాబితా చేయబడిన ఆధార్‌కార్డును 12వ పత్రంగా పరిగణిస్తారు' అని పేర్కొంది. ఆధార్ చట్టంలోని సెక్షన్ 9 ప్రకారం, ఆధార్ కార్డును 'పౌరసత్వ రుజువుగా కాకుండా గుర్తింపు రుజువుగా' అంగీకరించి ఉపయోగించాలని ఇసి స్పష్టం చేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950లోని సెక్షన్ 23(4) ప్రకారం, ఆధార్‌కార్డు ఇప్పటికే ఒక వ్యక్తి గుర్తింపును నిరూపించడానికి లెక్కించబడిన పత్రాలలో ఒకటి. ఈ ఆదేశానికి అనుగుణంగా ఆధార్‌ను పాటించకపోవడం లేదా అంగీకరించడానికి నిరాకరించడం వంటి ఏదైనా సందర్భాన్ని అత్యంత తీవ్రంగా పరిగణించాల పోల్ ప్యానెల్ హెచ్చరించింది. బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ ప్రక్రియలో ఓటర్ల గుర్తింపు రుజువుగా ఆధార్ కార్డును 'తప్పనిసరి' చేర్చాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈనెల 9 లోపు ఈ చర్యను అమలు చేయాలని ఎన్నికల సంఘాన్ని కోరింది.

# 'ఓట్ చోర్, గద్దీ చోడ్' దేశవ్యాప్తంగా నిరూపించబడింది

## ఈ నినాదాన్ని కాంగ్రెస్ పార్టీ మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్తుంది : రాహుల్‌గాంధీ

**రాయ్‌బరేలి :** 'ఓట్ చోర్, గద్దీ చోడ్' అనే నినాదం దేశ వ్యాప్తంగా నిరూపించబడిందని, ఈ నినాదాన్ని కాంగ్రెస్ పార్టీ మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్తుందని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ తన పార్లమెంటరీ నియోజకవర్గం రాయ్‌బరేలిలో రెండు రోజుల పర్యటన నిమిత్తం ఉత్తరప్రదేశ్ వెళ్లారు. బుధవారం ఆయన లక్నోలోని చౌదరి చరణ్ సింగ్ విమానాశ్రయానికి చేరుకోగా, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ రాయ్, ఇతర సీనియర్ నాయకులు స్వాగతం పలికారు. ఒక కార్యక్రమానికి వెళ్లే ముందు రాహుల్ గాంధీ విలేకరులతో మాట్లాడుతూ 'ఓట్ చోర్, గద్దీ చోడ్' అనేది తమ ప్రధాని నినాదమని, ఇది దేశ వ్యాప్తంగా నిరూపితమైందన్నారు. దీనిని మళ్లీ మళ్లీ నిరూపిస్తామని చెప్పారు. దేదౌలిలోని హర్‌చంద్‌పూర్ విధానసభలో పార్టీ కార్యకర్తలతో జరిగిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ మహారాష్ట్ర, కర్ణాటకలో జరిగిన ఓట్ల దొంగతనం ఘటనలను ప్రస్తావించారు. అయితే ఈ కార్యక్రమానికి మీడియాకు అనుమతి ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన మహారాష్ట్ర, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల దొంగతనానికి పాల్పడినట్లు 'సలుపు, తెలుపు' ఆధారాలు ఉన్నాయని కాంగ్రెస్ నాయకుడు చెప్పినట్లు పిటిఐ ఉటంకించింది. మహారాష్ట్రలో తమ పార్టీ, తమ కూటమి లోక్‌సభలో గెలిచాయని, నాలుగు నెలల తర్వాత తాము అసెంబ్లీలో తుడిచిపెట్టుకుపోయామని, దీనిపై దర్యాప్తు చేయగా లోక్‌సభ ఎన్నికల తర్వాత దాదాపు కోటి మంది కొత్త ఓటర్లు ఎన్నికల వ్యవస్థలోకి ప్రవేశించినట్లు బయటపడిందన్నారు. తమ, తమ మిత్ర పార్టీలకు చెందిన ఓట్లు అలాగే ఉన్నాయని, అయితే కొత్త ఓట్లు బిజెపికి వెళ్ళాయని రాహుల్‌గా ఆరోపించారు. వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం... కాంగ్రెస్, ఎన్‌సిపి, శివసేనకు పోలైన ఓట్లలో ఎటువంటి మార్పు లేదని, కానీ బిజెపికి లెక్కకు మించి ఓట్లు పడ్డాయని, కొత్తగా చేర్చబడిన ప్రతి ఓటరు ఆ పార్టీడి అనుకూలంగా



ఓటు వేసినట్లు వెల్లడయిందన్నారు. ఈ విషయమై దర్యాప్తు చేయాలని, నాలుగు నెలల్లో కోటి మంది ఎలా ఓటర్లుగా చేరారో వివరాలను ఎన్నికల కమిషన్‌ను కోరినట్లు రాహుల్ చెప్పారు. దీనికి ఎన్నికల కమిషన్ తిరస్కరించిందన్నారు. తమకు ఎలాంటి జాబితాగానీ, వీడియోగానీ అందించలేదన్నారు. కర్ణాటక ఎన్నికల తర్వాత కూడా ఇలాంటి అక్రమాలు బయటపడ్డాయని గాంధీ ఆరోపించారు. బెంగళూరు సెంట్రల్‌లోని ఒక అసెంబ్లీ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు ఓటర్లను పరిశీలించగా, రెండు లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నట్లు తేలింది, ఇది అక్కడ బిజెపి విజయానికి దారితీసింది. బెంగళూరు సెంట్రల్‌లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. తమ కార్యకర్తలు నాలుగు నెలలుగా ఒకదాన్ని మాత్రమే దర్యాప్తు చేశారు, ఆ సమయంలోనే నకిలీ ఓట్లను కనుగొన్నారని రాహుల్‌గాంధీ అన్నారు. బిజెపి ఓట్లను దొంగిలించిందని ఆరోపిస్తూ, ఇటువంటి ఘటనలు బెంగళూరు లేదా మహారాష్ట్రకే పరిమితం కాదని ఆయన ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, హర్యానా, మధ్యప్రదేశ్, గుజరాత్‌లో భారీ స్థాయిలో జరిగిందన్నారు. బిహార్‌లో తన ఇటీవలి ఎన్నికల పర్యటనను ప్రస్తావిస్తూ, అక్కడ కూడా ఇలాంటి అక్రమాలు గుర్తించబడ్డాయని గాంధీ పేర్కొన్నారు.

## అత్యాచార బాధితురాలి

# విచారణ తీరు ఇలాగా ?

### ట్రయల్‌కోర్టుపై 'సుప్రీం' విస్మయం

**న్యూఢిల్లీ :** పశ్చిమబెంగాల్‌లోని ట్రయల్‌కోర్టు అత్యాచార బాధితురాలిపై విచారణ జరిపిన తీరును వ్యతిరేకిస్తూ ఆమె వాంగ్మూలాన్ని నాలుగు నెలలు వాయిదా వేయడంపై సుప్రీంకోర్టు పలు ప్రశ్నలను లేవనెత్తింది. నాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్థివాలా, జస్టిస్ కె.వి. విశ్వనాథన్ ధర్మాసనం ఈ కేసులో విచారణ సంస్థ అయిన ట్రయల్ కోర్టు, సిబిఐను వివరణ కోరింది. బాధితురాలు సాక్షి పెట్టె (విట్నెస్ బాక్స్)లోకి ప్రవేశించిందని వాంగ్మూలాన్ని నమోదుచేస్తున్న పనిలో ఉందని బెంచ్‌కు సమాచారం అం దింది. ఆమె తదుపరి విచారణను డిసెంబరు 18కు ట్రయల్ కోర్టు వాయిదా వేసింది. 'సాక్షులు ముఖ్యంగా బాధితురాలు సాక్షి పెట్టెలోకి ప్రవేశించిన తర్వాత ఈ విచారణ ముక్కలుముక్కలైందని మేం అర్థంచేసుకోలేక పోతున్నాం. అత్యాచార బాధితురాలి తదుపరి విచారణను నాలుగు నెలల కాలానికి ఎందుకు వాయిదా వేయాలి. ఈ విషయంలో ట్రయల్‌కోర్టు వివరణ ఇవ్వాలని మేం కోరుతున్నాం' అని అత్యున్నత న్యాయస్థానం చెప్పింది.ట్రయల్ కోర్టు ధర్మాసనం తదుపరి విచారణకు సమయం ఇవ్వడం ద్వారా నిందితులు ప్రాసిక్యూషన్ సాక్షాలను తారుమారు చేయడానికి 'తెలియకుండానే సులభతరం చేసింది. ఇది తీవ్ర ఆందోళన కలిగించే విషయం కాబట్టి మనం విస్మరించకూడదు' అని అత్యున్నత న్యాయస్థానం జోడించింది. ముఖ్యంగా విచారణ అధికారిగా ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్, సిబిఐ కూడా వివరణ ఇవ్వాల్సి ఉందని ధర్మాసనం పేర్కొంది. 'చాలాకాలంగా బాధితురాలిని సాక్షిలో పెట్టెలో ఎందుకు పెట్టారు? బాధితురాలు సాక్షి పెట్టెలోకి అడుగుపెట్టే మొదటి సాక్షి అయ్యి ఉండాలి కదా' అని ధర్మాసనం సందేహం వ్యక్తంచేసింది. ఈ కేసులో నిందితుడికి కలకత్తా హైకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ గత ఏడాది సెప్టెంబరులో సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. ఈరోజు నుంచి ఒక వారంలోపు ఈ కోర్టుకు నివేదిక చేరేలా పిలవండి అని ధర్మాసనం సెప్టెంబరు 8న ఆదేశించింది. నిందితుడు తన కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి ధర్మాసనం వారం రోజుల సమయం మంజూరు చేస్తూ, పిటిషన్ విచారణను సెప్టెంబరు 22కు వాయిదా వేసింది.

# గెలుపు ఆధారంగా సమతుల్యత

### బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో

### సీట్ల పంపకాలపై కాంగ్రెస్ హితవు





**న్యూఢిల్లీ :** త్వరలో బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలోని మహాఘట్‌బంధన్ భాగస్వామ్యపక్షాల మధ్య సీట్ల పంపకాలపై చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో పార్టీలు సీట్ల కేటాయింపు సమయంలో గెలుపు ప్రరంగా మంచి, చెడు మధ్య సమతుల్యతను కొనసాగించాలని కాంగ్రెస్ పేర్కొంది. అదే విధంగా ఇప్పటికే కూటమిలోని పార్టీలకు కేటాయించబడిన సీట్లను కొత్త భాగస్వామ్యపక్షాలకు కచ్చితంగా కేటాయించాలని కూడా సూచించింది. రానున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రతిపక్ష పార్టీల 'మహాఘట్‌బంధన్' (గ్రాండ్ అలయన్స్)లో హేమంత్ సోరెన్ నేతృత్వంలోని జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం), పశుపతి కుమార్ పరాస్ రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ (ఆర్ఎల్‌జెపి)లను చేర్చాలనే చర్చల మధ్య కాంగ్రెస పై విధంగా పేర్కొంది. బుధవారం బిహార్ కాంగ్రెస్ చీఫ్ రాజేష్ రామ్, కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడు షకీల్ అహ్మద్ ఖాన్‌లతో కలిసి సంయుక్త విలేకరుల సమావేశంలో ఎఐసిసి రాష్ట్ర ఇన్‌ఛార్జ్ కృష్ణ అల్లవారు మాట్లాడారు. ఈ సందర్భంగా బిజెపిపై విమర్శలు చేశారు. ఎన్నికల కమిషన్‌తో కుమ్మక్కై 'ఓటు చోరీ'లో పాల్గొంటున్నదని ఆరోపించారు. ఓట్ల దొంగతనం కోసం ఒక నిర్దిష్ట ప్రక్రియను అనుసరిస్తున్నారని అల్లవారు ఆరోపించారు. నరేంద్ర మోదీ, అమిత్ షా చేసిన కుట్రలో భాగంగా దేశంలో 'ఓట్ల దొంగతనం'ను ముందుకు తెచ్చారన్నారు. మొదట నరేంద్ర మోదీ ఎన్నికల కమిషనర్‌ను ఎంపిక చేసే ప్రక్రియను మార్చారని, దీనిలో ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, హోంమంత్రిని ఈ ప్రక్రియలో చేర్చారని, ఆ తరువాత ఎన్నికల కమిషనర్‌పై ఎటువంటి చర్య తీసుకోకుండా చట్టంలో మార్పు చేశారని, కాంగ్రెస్ నాయకుడు ఇందిరా భవన్ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆరోపించారు. దీనికి తోడూ ఓటరు జాబితాలో ట్యాంపరింగ్ జరుగుతోందని, ఈ నిజం మొత్తం దేశం ముందు బయటపడిందని పేర్కొన్నారు. పోలింగ్, కౌంటింగ్ రోజున రిగ్గింగ్ జరిగిందని కూడా ఆయన ఆరోపించారు. దీనికి అతిపెద్ద ఉదాహరణ వారణాసిలో జరిగిన లోక్‌సభ ఎన్నికలేనన్నారు. ఓటు చోరీ ప్రతి ఒక్కరికి సమస్య అని చెప్పారు. ఓటు దొంగలు ప్రజలకు సేవ చేయడం గురించి పట్టించుకోరని ఆరోపించారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, విద్య, ఆరోగ్యం, వలసలు, నేరాలు, పేపర్ లీక్‌లు వంటి సమస్యల పట్ల 'ఓటు చోరీ ప్రభుత్వం' ఉదాసీనంగా ఉందని దుయ్యబట్టారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు ఓటు చోరీ మూలకారణమని, బిహార్‌లో పరిస్థితి మారాలంటే, ప్రభుత్వాన్ని మార్చాలని ఆయన ఉద్ఘాటించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ బిహార్ పార్టీ నాయకులతో మంగళవారం జరిగిన సమావేశాన్ని ప్రస్తావిస్తూ ప్రచారం, మ్యానిఫెస్టో, సీట్ల భాగస్వామ్యం, అభ్యర్థుల ఎంపికకు సంబంధించి భవిష్యత్ వ్యూహాన్ని రూపొందించామని అల్లవారు అన్నారు. కొత్త పార్టీలు కూటమిలోకి వస్తే ప్రతి పార్టీ తమ వాటా నుండి సహాయం చేయాల్సి ఉంటుందన్నారు. సీట్ షేరింగ్‌ను మంచి సమయంలో సానుకూలంగా ముందుకు తీసుకెళ్లడమే తమ ప్రయత్నమని, దానిని విజయవంతంగా చేస్తున్నామన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో రాష్ట్రంలో మరో యాత్ర చేపట్టే ప్రణాళిక ప్రస్తుతం లేదని అల్లవారు కూడా అన్నారు.

# బిఆర్‌ఎస్ ధనికపార్టీ





### 2023--24 ఆర్థిక ఏడాదిలో రూ. 685.51 కోట్ల ఆదాయం ఆర్జన

### టాప్‌లో ఐదు పార్టీల్లో టిఎంసి, బిజెడి, టిడిపి, వైఎస్ఆర్

### 40 ప్రాంతీయ పార్టీల మొత్తం ఆదాయం రూ.2,532 కోట్లు


**న్యూఢిల్లీ :** దాదాపు 40 ప్రాంతీయ రాజకీయ పార్టీలు 2023–24 ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా తమకు రూ.2,532.09 కోట్ల ఆదాయం ఉన్నట్లు ప్రకటించాయి. వీటిలో 70 శాతానికి పైగా ఎన్నికల బాండ్ల ద్వారానే నిధులు వస్తున్నాయని డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) తన విశ్లేషణలో పేర్కొంది. భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) అత్యధికంగా రూ.685.51 కోట్ల ఆదాయన్ని కలిగి ఉంది. ఆతర్వాత తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)కు రూ.646.39 కోట్లు, బిజు జనతాదళ్ (బిజెడి)కు రూ.297.81 కోట్లు, తెలుగుదేశం పార్టీ (టిడిపి)కి రూ.285.07 కోట్లు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రూ.191.04 కోట్ల ఆదాయం ఉంది. 40 ప్రాంతీయ పార్టీలు ప్రకటించిన మొత్తం ఆదాయంలో ఈ ఐదు టాప్ పార్టీల ఆదాయం మొత్తం ఆదాయంలో 83.17 శాతంగా ఉంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 40 ప్రాంతీయ పార్టీల మొత్తం ఆదాయం రూ.2,532.096 కోట్లు కాగా, మొత్తం ఆదాయంలో 70 శాతానికి పైగా (రూ.1,796.024 కోట్లు) ఎన్నికల బాండ్ల ద్వారా విరాళాలు వచ్చాయని ఎడిఆర్ తన నివేదికలో పేర్కొంది. ఆదాయ వివరాల సమర్పణకు గడువు ముగిసి 313 రోజులు అయినా కూడా 20 ప్రాంతీయ పార్టీలకు చెందిన ఆడి రిపోర్ట్‌ను భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) తన వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తేలని ఎడిఆర్ తెలిపింది. అయితే మరో 20 పార్టీల ఆడిట్ నివేదికలు సమర్పణకు గడువు తేదీ నుండి 12 నుండి 216 రోజుల ఆలస్యం తర్వాత ఇసిఐ తన వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ప్రాంతీయ పార్టీల మొత్తం ఆదాయం రూ.1,736.85 కోట్లు కాగా, 2023–24 ఆర్థికసంవత్సరంలో ప్రాంతీయ పార్టీల మొత్తం ఆదాయం 45.77 శాతం పెరిగినట్లు ఎడిఆర్ గుర్తించింది. టిఎంసికి రూ.312.93 కోట్లు పెరగగా, టిడిపి, బిజెడి కూడా గణనీయమైన పెరుగుదలను నమోదు చేశాయి. 27 ప్రాంతీయ పార్టీలు తమ ఆదాయంలో కొంత మొత్తాన్ని ఖర్చు చేయలేదని ప్రకటించగా, 12 రాజకీయ పార్టీలు మాత్రం సేకరించిన ఆదాయం కంటే అధికంగా ఖర్చు పెట్టాయి. బిఆర్ఎస్ రూ.430.60 కోట్లు ఖర్చు చేయకుండా ఉండగా, టిఎంసి రూ.414.92 కోట్లు, బిజెడి రూ. 253.79 కోట్లు ఖర్చు చేయలేదు. అయితే వైఎస్ఆర్ కాంగ్రెస్, ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె), సమాజ్ వాదీ పార్టీ, జనతా దళ్ (యునైటెడ్) సహా సహా 12పార్టీలు తమ ఆదాయం కంటే ఎక్కువగా ఖర్చు చేశాయి. వైఎస్ఆర్ కాంగ్రెస్ ఏకంగా దాదాపు 55 శాతం ఖర్చుచేసింది. గోవా ఫార్వర్డ్ పార్టీ తమకు ఆదాయం రాలేదని ప్రకటించగా, రూ.1.56 లక్షల ఖర్చులను ప్రకటించింది. పార్టీల మొత్తం ఆదాయంలో రూ.2,117.85కోట్లు (83.64 శాతం) స్వచ్ఛంద విరాళాల నుండి వచ్చాయని ఎడిఆర్ నివేదిక పేర్కొంది. ఇందులో ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చిన విరాళాలు రూ.1,796.02 కోట్లు (70.93 శాతం) ఉన్నాయని, వీటిని బిఆర్ఎస్, టిఎంసి, బిజెడి, టిడిపి, వైఎస్ఆర్ కాంగ్రెస్, డిఎంకె సహా 10 పార్టీలు మాత్రమే ప్రకటించాయని తెలిపింది.


ఎడిఆర్ ఆర్టీఐ దరఖాస్తుకు ప్రతిస్పందనగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించిన డేటా ప్రకారం, 2023–24 ఆర్థిక సంవత్సరంలో పార్టీలు రూ.4,507.56 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లను తిరిగి పొందాయి. ఇందులో దాదాపు 55.998 శాతం (రూ.2,524.14 కోట్లు) జాతీయ పార్టీలు, 39.84 శాతం (రూ.1,796.02 కోట్లు) ప్రాంతీయ పార్టీలు తిరిగి పొందాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో కేవలం మూడు జాతీయ పార్టీలు (బిజెపి, కాంగ్రెస్‌ష ఆమ్ ఆద్మీ పార్టీ) మాత్రమే ఎలక్టోరల్ బాండ్ల ద్వారా విరాళాలు అందుకున్నాయని నివేదిక పేర్కొంది.

# రాజ్యసభలో ప్రతిపక్షాలకు స్వేచ్ఛ ఇవ్వండి

### తొలి ఉపరాష్ట్రపతి ఉపదేశం మరువకూడదు

### సి.పి.రాధాకృష్ణన్‌కు కాంగ్రెస్ అభినందన





**న్యూఢిల్లీ:** భారత ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికైన అధికార ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్‌కు కాంగ్రెస్‌పార్టీ హృదయపూర్వక అభినందనలు తెలియజేసింది. భారత తొలి ఉపరాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ 1952లో సభాకార్యకలాపాల గురించి చెప్పిన ఉపదేశాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసింది.''ప్రభుత్వ విధానాలను న్యాయంగా,నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా, నిర్మొహమాటంగా విమర్శించడానికి ప్రతిపక్ష గ్రూపులను అనుమతించకపోతే ప్రజాస్వామ్యం నిరంకుశపాలన స్థాయికి భ్రష్టుపట్టిపోతుంది'' అని సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పారని పేర్కొంటూ ఆచరణలో ఆయన రాజ్యసభలో ఆ విలువలు తు.చ తప్పకుండా పాటించారని కూడా గుర్తుచేసింది. ఉపరాష్ట్రపతి రాజ్యసభకు ఛైర్మన్‌గా కూడా వ్యవహరిస్తారు. కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ల విభాగం ఇన్‌ఛార్జి జైరామ్ రమేశ్ ఎక్స్‌వేదిగా ఈ మేరకు ఒక అభినందన సందేశం పోస్టు చేశారు. గొప్ప తాత్వికవేత్త, విద్యావేత్త, రచయిత, దౌత్యవేత్తగా సర్వేపల్లి రాధాకృష్ణన్ 1952 మే 16వ తేదీన రాజ్యసభ సమావేశాల ప్రారంభరోజున సభలో మాట్లాడుతూ, ''నేను ఏ రాజకీయపార్టీకీ చెందినవాడిని కాదు, అంటే నేను ఈ సభలో ఉన్న అన్నిపార్టీలకూ చెందినవాడినని అర్థం, ఈ సంప్రదాయాలను సమున్నతస్థానంలో నిలబెట్టడానికి నా వంతు కృషి చేస్తాను, ప్రతిరాజకీయపార్టీ పట్లా న్యాయబద్ధంగా నిజాయతీగా, నిష్పక్షపాతంగా వ్యవహరించడం పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో అత్యున్నతమైన సంప్రదాయం, ఎవరి పట్లా దుష్టతలంపుతో వ్యవహరించకూడదు, అదే పార్లమెంటుకు గొప్ప ప్రతిష్ఠ, ప్రభుత్వ విధానాలను స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా, నిర్మొహమాటంగా విమర్శించడానికి ప్రతిపక్షాలను సభలో అనుమతించకపోతే ప్రజాస్వామ్యం నిరంకుశపాలన స్థాయికి దిగజారిపోతుంది'' అని సర్వేపల్లి చెప్పారని జైరామ్ రమేశ్ పోస్టు చేశారు.

**ఎలా చూసినా రాధాకృష్ణన్‌ది ఓటమే**

ఎన్‌డిఎ అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్ మంగళవారం జరిగిన ఓటింగ్‌లో 452 ఓట్లతో ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికయ్యారు. ఆయనతో తలపడిన 'ఇండియా కూటమి' అభ్యర్థి బి.సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు లభించాయి. రాధాకృష్ణన్ విజయంపట్ల జైరామ్ రమేశ్ అభినందనలు తెలియజేశారు. అదే విధంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి కూడా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. సుదర్శన్‌రెడ్డి 40 శాతం ఓట్లు గెలుచుకున్నారు. 2022లో ప్రతిపక్ష అభ్యర్థి 26 శాతం ఓట్లు మాత్రమే పొందారు. గణాంకాల ప్రాతిపదికపై బిజెపి సాధించిన ఈ విజయం అటు నైతికపరంగా, ఇటు రాజకీయంగా చూసినాకూడా ఓటమికిందే లెక్క అని ఆయన విమర్శించారు. పార్లమెంటు ఉభయసభలలో మొత్తం 781 మంది ఎంపీలు ఉండగా 98.2 శాతంమంది ఓటు వేశారు. 767 మంది ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. 752 ఓట్లు చెల్లుబాటుకాగా, 15 ఓట్లు చెల్లుబాటు కాకుండా వృథా అయ్యాయి.


# ఫ్రాన్స్ రాజకీయ స్థిరత్వమే లక్ష్యం

### కొత్త ప్రధానమంత్రి లెకోర్ను ప్రకటన

**పారిస్:** ఫ్రాన్స్ కొత్త ప్రధానమంత్రిగా సెబాస్టియన్ లెకోర్ను (39) బాధ్యతలు తీసుకున్నారు. ఫ్రాన్స్‌దేశ స్వాతంత్ర్య రక్షణ, ఫ్రెంచ్ ప్రజలకు సేవ చేయడం, ఒక స్పష్టమైన మార్గదర్శకత్వంతో జవాబుదారీ ప్రభుత్వాన్ని నిర్మించేందుకే అధ్యక్షుడు మేక్రాన్ తనకు ఈ బాధ్యతలు అప్పగించారని చెప్పారు. తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. మేక్రాన్ సారథ్యంలో 2017 నుండి ఇప్పటివరకూ నలుగురు ప్రధానమంత్రులు మారారు. నాలుగో ప్రధానమంత్రి బేరౌ సహా నుండి లెకోర్ను తాజాగా బాధ్యతలు తీసుకున్నారు. దేశాధ్యక్షుడు మేక్రాన్‌కు లెకోర్ను అత్యంత సన్నిహిత మిత్రుడు. గత ఏడాది మేక్రాన్ దేశంలో ఆకస్మిక ఎన్నికలు నిర్వహించడంతో ఏ పార్టీకీ పూర్తి మెజారిటీ రాలేదు. అప్పటినుండి మూడు ప్రభుత్వాలు మారాయి. దేశంలో సంక్షోభ పరిస్థితి కొనసాగుతున్నది. ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. జిడిపిలో ప్రభుత్వ లోటు 113 శాతం పైగా పెరిగింది. ఒకవైపు ప్రజలు తీవ్రనిరసనలు వ్యక్తం చేస్తున్న తరుణంలో పారిస్‌లోని ప్రధానమంత్రి అధికార నివాసం–కార్యాలయ భవంతి ''హోటల్ డీ మాటిగ్నాన్''లో ఈ పదవీబాధ్యతల మార్పిడి కార్యక్రమం జరిగింది. దేశాధ్యక్షుడు మేక్రాన్‌కు, బేరౌకు వ్యతిరేకంగా ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ప్రదర్శకులకు, పోలీసులకు మధ్య ఘర్షణలు జరిగాయి. అనేకమంది ప్రదర్శకులను పోలీసులు అరెస్టులు చేసిన తర్వాత ఈ అధికార మార్పిడి జరిగింది. బేరౌ ప్రభుత్వం పార్లమెంటు దిగువసభలో అవిశ్వాస తీర్మానం ద్వారా సెప్టెంబరు 8న అధికారం కోల్పోయింది. ఫ్రాంకోయిస్ బేరౌ 2024 డిసెంబరు 13న ఫ్రెంచ్ ఫిఫ్త్ రిపబ్లిక్ 46వ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తొమ్మిదినెలల పరిపాలన పూర్తికాకుండానే సభావిశ్వాసం కోల్పోయారు. అంతకుముందు మైఖేల్ జీన్ బార్నియర్ (73) 2024 సెప్టెంబరు 5వ తేదీ నుండి డిసెంబరు 12 వరకూ 37 రోజులు అతిస్వల్పకాలం అధికారంలో మనుగడ సాగించారు. ఈ విధంగా మేక్రాన్ అధ్యక్షతన మూడో ప్రభుత్వ ప్రధానమంత్రిగా లెకోర్ను మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు లెకోర్ను విదేశాంగమంత్రిగా పనిచేశారు. 2014 లో వెర్నోన్ మేయర్ పదవిని గెలుచుకుని లెకోర్ను తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించి 11 ఏళ్ల వ్యవధిలో అతి చిన్న వయసులో దేశ ప్రధానమంత్రిస్థాయికి ఎదిగారు

## దేశవ్యాప్తంగా త్వరలో

# ఓటర్ల జాబితా సవరణ !



**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల బీహార్‌లో జరిగిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను దేశవ్యాప్తంగా చేపట్టేందుకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తున్నట్లు కొన్ని మీడియా వర్గాల ద్వారా వెల్లడైంది. అయితే ఎప్పటి నుంచి ఆ ప్రక్రియ మొదలవుతుందన్న దానిపై స్పష్టత లేదు. ఆ భారీ కసరత్తుకు చెందిన తేదీలను ఇంకా ప్రకటించలేదు.అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన ముఖ్య ఎన్నికల అధికారులతో బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం భేటీ అయ్యింది. పాన్ ఇండియా స్థాయిలో ఓటర్ల జాబితా సవరణ చేపట్టేందుకు కావాల్సిన అంశాల గురించి చర్చించినట్లు తెలుస్తోంది. బిహార్‌లో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల అక్కడ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ద్వారా సుమారు 65 లక్షల ఓటర్లను తొలగించిన విషయం తెలిసిందే. అయితే దేశవ్యాప్తంగా అక్రమ ఓటర్లను తొలగించేందుకు త్వరలో ఎన్నికల సంఘం ఆ ప్రక్రియను మొదలుపెట్టనున్నది.

# మీభర్త 'ఆస్తుల వివరాలన్నింటినీ' వెల్లడించండి

### దివంగత సంజయ్‌కపూర్ భార్య ప్రియకపూర్‌కు ఢిల్లీ హైకోర్టు ఆదేశం



**న్యూఢిల్లీ :** వ్యాపారవేత్త అయిన దివంగత భర్త సంజయ్ కపూర్ ఆస్తుల వివరాలు అన్నింటినీ వెల్లడించాలని ఆయన భార్య ప్రియాకపూర్‌ను బుధవారం ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. జూన్ 12న ఆయన మరణించిన రోజునాటికి ఉన్న స్థిర, చర ఆస్తుల వివరాలు అన్నింటినీ తెలియజేయాలని సూచించింది. రూ.30,000 కోట్ల విలువైన సంజయ్‌కపూర్ ఆస్తులలో వాటాను కోరుతూ ఆయన మాజీభార్య నటి కరిష్మా కపూర్ సంతానమైన ఇద్దరు పిల్లలు ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన జస్టిస్ జ్యోతిసింగ్ ప్రియా కపూర్‌కు ఈ ఆదేశాలు జారీచేశారు. ప్రియాకపూర్ జస్టిస్ జ్యోతి సింగ్‌కు వివరిస్తూ ఆ ఇద్దరు పిల్లలు సమారియా కపూర్ (20), కియాన్ రాజ్ కపూర్ (15) ఇప్పటికే కుటుంబ ట్రస్ట్ నుండి రూ.1,900 కోట్లు వసూలుచేశారని, వారికి ఇంత కంటే ఏమి కావాలి?అని అడిగారు. ప్రియాకపూర్ తరపు సీనియర్ న్యాయవాది రాజీవ్‌నాయర్ తనవాదనలు వినిపిస్తూ 'వీలునామా రిజిస్టర్డ్ కాలేదు అంటే అది 'చెల్లదు', జోడించబడింది' అని సమర్పించారు. అయితే ప్రజలను వీధుల్లో వదిలేసినట్లు కాదు అన్నారు. కోర్టు ప్రియాకపూర్‌కు నోటీస్ జారీచేస్తూ విచారణను అక్టోబరు 9కు వాయిదా వేసింది. ప్రతివాది ప్రియాకపూర్ జూన్ 12నాటికి అన్ని స్థిర, చర ఆస్తులను ప్రకటించాలి అని జడ్జి సూచించారు. కరిష్మా కపూర్‌కు 2003లో సంజయ్‌కపూర్‌తో వివాహం జరిగింది. కానీ 2016లో విడాకులు తీసుకున్నారు. జూన్12న లండన్‌లో పోలో మ్యాచ్ ఆడుతున్న సమయంలో తేనెటీగను మింగడంతో సంజయ్ కపూర్ గుండెపోటుతో మరణించాడు. ఆయన తల్లి రాణి ఇటీవల తన కుమారుడి మరణంపై విచారణ జరపాలని యుకె అధికారులకు రాసిన ఒక లేఖలో కోరారు. అది సహజ మరణం కాదని, ఆర్థిక మోసం కోసం కుట్ర చేసి హత్యచేశారన్న అనుమానం ఉందని తెలియజేశారు.

## భారత్‌తో న్యాయవిరుద్ధంగా

# వ్యాపారంచేసే అవసరం లేదు : నవర్రో

**వాషింగ్టన్:** భారత్‌తో న్యాయవిరుద్ధంగా వ్యాపారం చేసేంత అవసరం అమెరికాకు లేదని వైట్‌హౌస్‌లో వాణిజ్యసలహాదారు పీటర్ నవర్రో అన్నారు. గడచిన కొద్దివారాలుగా ఆయన భారత్‌పై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. భారత్‌తో అన్యాయంగా, అనుచిత వ్యాపారం చేసే అవసరం తమకు లేదని, కానీ ఆ దేశం మాత్రం నిరాశతో తెగించి అమెరికా మార్కెట్లను అందిపుచ్చుకోవాలని ఎదురుచూస్తోందని అన్నారు. భారత్–అమెరికా రెండు దేశాలూ వాణిజ్య చర్చలలో ఉన్న ఆటంకాలను తొలగించుకోవడానికి సంప్రదింపులను కొనసాగిస్తాయని, విజయవంతంగా చర్చలు ముగించడం పెద్దకష్టమైన విషయం కాదనీ ట్రంప్ సోషల్ మీడియా పోస్టింగ్ చేసిన తర్వాత నవర్రో పైవిధంగా స్పందించారు. ఇటీవల ఎక్స్ వేదికగా పీటర్ నవర్రో వరుస విమర్శలు చేస్తున్నారు. ట్రంప్ పాలనా యంత్రాంగం కూడా భారత్‌పై విమర్శలు చేస్తోంది. రష్యా నుండి ముడి చమురు కొనుగోలు సమస్యను పదేపదే ప్రస్తావిస్తున్నది. ఉక్రేన్‌లో యుద్ధానికి భారత్ ఆజ్యం పోస్తోందని ట్రంప్ యంత్రాంగం తరచు విమర్శలు చేస్తోంది. భారతదేశం ప్రపంచంలో ఏదేశమూ వసూలు చేయనంత భారీ సుంకాలను వసూలు చేస్తోందని నవర్రో తాజాగా విమర్శించారు. లాభాలు సంపాదించుకోవడానికే రష్యా నుండి భారత్ ముడి చమురు కొనుగోలు చేస్తోందని ఆరోపించారు. భారత్‌పై గతనెలలో 50 శాతం సుంకాలు విధించిన తర్వాత రెండు దేశాల మధ్యా సంబంధాలు గణనీయంగా క్షీణించాయి.

# గాజా ఆకలే ఇజ్రాయెల్ నీచ ఆయుధం!

ప్రజాపక్షం
11-09-2025, గురువారం

అనైతిక యుద్ధానికి, హింసావాదానికి మారుపేరైన ఇజ్రాయెల్ రోజురోజుకూ మరింత దారుణంగా వ్యవహరిస్తున్నది. గాజాలో పెరుగుతున్న ఆకలినే ఆయుధంగా మలచుకొని, పాలస్తీనాను లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నది. ఆకలి సమస్యను తీవ్రతరం చేసే ఏ విధానాన్నైనా వెంటనే నిలిపివేయాలని 140 మంది అంతర్జాతీయ ప్రముఖ ఆర్థిక వేత్తలు అంతర్జాతీయ సమాజాన్ని, ప్రత్యేకించి అమెరికాను కోరడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. గాజా ప్రజలు ఆకలితో అల్లాడుతుంటే, వారికి మానవతా సాయం కూడా అందకుండా అడ్డుకుంటూ ఇజ్రాయెల్ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నది. ఆకలి సమస్య తీరాలంటే, తమ డిమాండ్లు అంగీకరించాలని ఒత్తిడి తెస్తున్నది. హమాస్ ఏరివేత పేరుతో గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న మారణకాండను ప్రపంచ దేశాలు ఖండిస్తున్నాయి. పలు దేశాల్లో పాలస్తీనా అనుకూల ప్రదర్శనలు, ర్యాలీలు జరుగుతున్నాయి. ఈ సమస్యకు త్వరలోనే తెరపడుతుందని, ఇజ్రాయెల్‌ను యుద్ధ విరమణకు ఒప్పిస్తామని 'నోబెల్ శాంతి బహుమతి'ని కోరుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అట్టహాసంగా ప్రకటించారు. ఈజిప్టులో శాంతి చర్చలంటూ హడావుడి చేశారు. హమాస్, ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని, శాంతి స్థాపన తథ్యమని కూడా చెప్పారు. కానీ, పరిస్థితి మెరుగుపడకపోగా, రోజురోజుకూ దిగజారుతున్నది. రష్యా, ఇరాన్ వంటి దేశాలపై ఆంక్షల ఆయుధాన్ని ప్రయోగిస్తున్న అమెరికాకు ఇజ్రాయెల్ అరాచకం కనిపించకపోవడం విచిత్రం. గత రెండు సంవత్సరాలుగా ఇజ్రాయెల్ అనుసరిస్తూ వస్తున్న విధానాలను, తత్ఫలితంగా పాలస్తీనాలో పెరుగుతున్న కరువు పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి, సమీక్షించి, అధ్యయనం చేసిన ఆర్థికవేత్తలు విడుదల చేసిన ప్రకటన అక్కడి వాస్తవాలను కళ్లకు కడుతున్నది. అంతకుముందు, ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహుకు, అక్కడ పార్లమెంటుకు 23 మంది ప్రముఖ ఆర్థికవేత్త లు రాసిన లేఖపై కనీస స్పందన లేదు. మానవ హక్కుల ఉల్లంఘనల పట్ల వారు ఆందోళన వ్యక్తం చేసినా ఇజ్రాయెల్ పట్టించుకోవడం లేదు. ఆ లేఖకు కొనసాగింపుగా ఇప్పుడు ఆర్థికవేత్తలు జారీ చేసిన సంయుక్త ప్రకటనకైనా స్పందన ఉంటుందా? అనేది అనుమానమే. గాజాలో జీవన పరిస్థితులను పూర్తిగా ధ్వంసంచేసి, ఒక జాతిని సమూలంగా తుడిచిపెట్టాలన్న ఇజ్రాయెల్ వైఖరి స్పష్టంగానే కనిపిస్తున్నది. అందుకు, అంతర్జాతీయ యుద్ధ నియమాలను ఉల్లంఘిస్తున్నది. జనావాసాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రార్థనా మందిరాలను కూడా ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకొని దాడులు కొనసాగిస్తున్నది. ఒకవైపు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచిస్తూ, మరోవైపు సహాయ శిబిరాలపైనా బాంబులు కురిపిస్తున్నది. గాజాలో అత్యధిక శాతం భవనాలు పాక్షికంగా లేదా పూర్తిగా ధ్వంసమయ్యాయి. నిత్యావసరాలు కూడా అందని దైన్యం. వైద్య సేవలకు తీవ్ర అంతరాయం. ఆకలి మరణాల పర్వం ప్రారంభం. ఈ పరిస్థితులను ఇజ్రాయెల్ తనకు అనుకూలంగా మార్చుకోవడం దుర్మార్గం. ప్రజల ఆకలిని ఆయుధంగా చేసుకొని, పాలస్తీనాను పాదాక్రాంతం చేసుకోవాలన్న ఆలోచన దారుణం. ఇప్పటివరకూ, ప్రపంచానికి ప్రజాస్వామ్య ముఖచిత్రాన్ని అందిస్తున్నట్టు ఇజ్రాయెల్ చేస్తున్న ప్రకటనలు సత్యదూరం. వాస్తవానికి జాతి నిర్మూలన, సామూహిక విధ్వంసకాండ మాత్రమే ఇజ్రాయెల్ లక్ష్యాలు. ఈ కారణంగానే, గాజాపై ప్రపంచ దేశాల విజ్ఞప్తులను పట్టించుకోవడం లేదు. పలు దేశాల్లో కొనసాగుతున్న నిరసనలను లక్ష్యపెట్టడం లేదు. ఆకలితో అల్లాడిపోతున్న గాజా ప్రజలకు మానవతా దృష్టితో సాయం అందించాలన్న ఆలోచన అసలే లేదు. రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేకుండా, ఆర్థికవేత్తలు ఇజ్రాయెల్ వైఖరిని తప్పుపడుతున్నారంటే, గాజాలో ఎలాంటి దారుణ పరిస్థితులు నెలకొన్నాయో ఊహించుకోవచ్చు. 'గాజాలో నెలకొన్న పరిస్థితులను, ఆకలిని ఆయుధంగా చేసుకుంటున్న ఇజ్రాయెల్ వైఖరి సరి కాదు. అంతర్జాతీయ సూత్రాలకు.. మానవతా విలువలకు ఇది పూర్తి వ్యతిరేకం. ఇజ్రాయెల్ వైఖరి మారాలి. ఆకలితో అల్లాడుతున్న ప్రజలను ఆదుకోవడానికి, అంతర్జాతీయ సాయం అందించడానికి అవసరమైన వాతావరణం కల్పించాలి. లేకపోతే, ప్రపంచ దేశాలు ఏకమై, ఇజ్రాయెల్‌ను ఏకాకి చేయక తప్పదు. జెరుసలేంతో ద్వైపాక్షిక సంబంధాలను రద్దు చేసుకున్నప్పుడే కొంత వరకైనా పరిస్థితి చక్కబడుతుంది' అంటున్న ఆర్థికవేత్తల సంయుక్త ప్రకటనను స్వాగతించాలి. ఇజ్రాయెల్‌పై ప్రపంచ దేశాలు ఒత్తిడి పెంచాలి. పరిస్థితి చక్కబడేందుకు ప్రయత్నించాలి.

# సెప్టెంబర్ 17ను 'ప్రజాపాలన దినోత్సవం'గా కాదు...

# తెలంగాణ విలీన దినోత్సవంగా నిర్వహించాలి

## అదే పోరాట యోధులకు అసలైన నివాళి



కూనంనేని సాంబశివరావు
శాసనసభ్యులు
సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

నిజాం నవాబు రాచరిక, భూస్వాముల దాస్య శృంఖలాలను తెంచుకొని 77 సంవత్సరాల క్రితం స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న హైదరాబాద్ సంస్థాన స్వాతంత్ర్య సమరగాథను స్మరించుకుందాం. దేశానికి స్వాతంత్ర్యం 1947 ఆగస్టు 15న రాగా హైదరాబాద్ సంస్థానంలో 1948 సెప్టెంబర్ 17న దాదాపు ఒక సంవత్సరం తరువాత మువ్వన్నెల జెండా ఎగిరింది. ఆ నడుమ కాలంలో ప్రజోద్యమం ఉధృతంగా కొనసాగుతున్న క్రమంలో ఆంధ్ర మహాసభ ప్రతినిధిగా రావి నారాయణ రెడ్డి, కమ్యూనిస్టుపార్టీ ప్రతినిధిగా బద్దం ఎల్లారెడ్డి, ఎఐటియుసి ప్రతినిధిగా మగ్దూం మొహియొద్దీన్‌లు 1947 సెప్టెంబర్ 11న సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారు. నిజాం నవాబుకు, భూస్వాములకు ప్రైవేట్ సైన్యంగా వున్న ఖాసీం రజ్వీ నేతృత్వంలోని రజాకారులపై ప్రజలు ఎర్రజెండా పట్టుకొని తిరగబడ్డారు. వారి తుపాకీ గుళ్లకు ఎదురొడ్డి వొడిసెలు, గుత్పలు, కారాలతో ఎదురుతిరిగారు. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సాయుధ దళాలు ప్రజలకు దిశానిర్దేశం చేస్తూ దొరల , భూ స్వాముల కబంధ హస్తాల నుండి ఒక్కొక్క గ్రామాన్ని విముక్తి చేస్తూ, 3వేల గ్రామాలలో 10 లక్షల ఎకరాలను ప్రజలకు పంచిన ఘన చరిత్ర ఆ మహత్తర పోరాటానిది. దాదాపు 4,500 మంది యోధులు ప్రాణాలను తెలంగాణ నేల తల్లికి అర్పణ చేసి పోరాట సమిధులై తెలంగాణ నేలను ఎర్ర నేలగా మార్చి నెత్తుటి అక్షరాలతో చరిత్రలో లిఖించబడ్డారు. ఆ పోరాటాల వారసత్వం, దాని గాథలు ఈనాటికి ఏ గ్రామం వెళ్ళినా వినబడుతాయి. కనబడుతాయి.

ఆ పోరాటమే హైదరాబాద్ సంస్థానంలో స్వాతంత్రోద్యమాన్ని కీలక మలుపు తిప్పింది. మట్టి మనుషుల్ని మహావీరులుగా తీర్చిదిద్దింది. ఆ తరంలో వట్టికోట అల్వార్ స్వామి, దాశరథి, మఖ్దూ మొహియుద్దీన్, సుద్దాల హనుమంతు, బండి యాదగిరి లాంటి మహాకవులకు ఆ వారసత్వంలో గద్దర్ లాంటి ప్రజా కళాకారులకు, వేలాదిమంది వీరులకు జన్మనిచ్చిన ఉద్యమమిది ప్రశ్నించే, తిరగబడే తత్వాన్ని తెలంగాణాకు అందించింది. భారతదేశంలో విప్లవాల పురిటిగడ్డ అనగానే తెలంగాణ ముందు వరుసలో ఉంటుంది. సంగీతం నేర్చుకోకపోయినా, సాహిత్యం చదవక పోయినా మట్టి మనుషుల పోరాటాల నుంచి వేల మంది ప్రజా కవులు, ప్రజాగాయకులకు ఈనాటికి జన్మనిస్తున్న విప్లవ మాత మన తెలంగాణ. అలాగే ఆరుట్ల కమలాదేవి, చిట్యాల ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, కమలమ్మ వంటి వీరనారీమణులు పోరాటంలో భాగమయ్యారు.

నిజాం రాచరిక ప్రభుత్వాన్ని అంతమొందించడానికి సాగుతున్న రైతాంగ పోరాటాన్ని నివారించడానికి భారత యూనియన్ సైన్యాలు 1948 సెప్టెంబరు 13న హైదరాబాద్ చేరుకోవడం జరిగింది. నిజాం–పటేల్‌ల మధ్య జరిగిన చీకటి ఒప్పంద ఫలితమే సెప్టెంబర్ 17న విలీనం చేస్తున్నట్లు నిజాం రాజు ప్రకటించడం జరిగింది. 1956 వరకు రాజ్‌ప్రముఖ్‌గా కొనసాగి రాజభరణాలు పొందడం జరిగింది. అయితే, అప్పటి వరకు స్వాతంత్ర్యం కోసం ప్రజలను సమాయత్త పరిచి, సంస్థాన విలీన ప్రక్రియను కమ్యూనిస్టులు సులభతరం చేశారు. కమ్యూనిస్టులు పేదలకు పంచిన 10 లక్షల ఎకరాల భూములను భూస్వాములకు తిరిగి అప్పజెప్పడానికి, కమ్యూనిస్టుల ఊచకోతకు అప్పటి నాటి ప్రభుత్వం పూనుకున్నది. ఈ పరిణామాల నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటాన్ని కొనసాగించింది. చివరకు పలు కోణాలలో చర్చించి 1951 మేలో దానిని విరమించింది.

### నిర్బంధంలోనూ గెలిపించిన ప్రజలు

1952 నాటికి మన నాయకులు ఎక్కువ మంది జైళ్లలో ఉండటం వలన, ఓటర్ లిస్టులో పేర్లు నమోదు కానందువలన అభ్యర్థులు దొరకని కారణంతో అన్ని స్థానాలకు పోటీ చేయలేకపోయాం. అప్పటికీ పార్టీపైన నిషేధం తొలగలేదు. దాని వలన పిడిఎఫ్ (పీపుల్ డెమోక్రటిక్ ఫ్రంట్) పేరుతో కొన్ని స్థానాలలోనే పోటీ చేసిన కమ్యూనిస్టు పార్టీకి 36 సీట్లు రాగా, కాంగ్రెస్‌కు అన్ని స్థానాలలో పోటీ చేసి కేవలం 38 స్థానాలు మాత్రమే రావడం జరిగింది. నల్లగొండ లోక్‌సభ స్థానంలో రావి నారాయణరెడ్డి నాడు భారతదేశవ్యాప్తంగా అమితమైన ప్రజాదరణ కలిగిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకంటే ఎక్కువ మెజారిటీ లభించడం ద్వారా తెలంగాణ ప్రజలు కమ్యూనిస్టులను ఎంతగా ఆదరించారో అర్థం చేసుకోవచ్చు.

### తెలంగాణ దినోత్సవంగానే నిర్వహించాలి

సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజాపరిపాలన దినోత్సవంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించడం సబబు కాదు. హైదరాబాద్ సంస్థానంలో భాగంగా ఉండి, నేడు కర్నాటకలోభాగమైన కల్యాణ కర్నాటక, మరఠ్వాడా ప్రాంతాలలో హైదరాబాద్ విలీన దినోత్సవాలను ప్రభుత్వాలే ఎప్పటి నుండో అధికారికంగా నిర్వహిస్తున్నాయి. తెలంగాణా విలీనాన్ని అధికారికంగా జరపడం లేదని సమైక్య రాష్ట్రం లోని ప్రభుత్వాలను దుమ్మెత్తిపోసిన అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ 2021 సంవత్సరం నుండి సమైక్యతా దినోత్సవం పేరుతో తెలంగాణ వీర చరిత్రను కనుమరుగయ్యేలా చేశారు. ఈనాటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తున్నది. పాత ప్రభుత్వం పెట్టిన పేరును మార్చి, కనీసం తెలంగాణ వీరోచిత పోరును స్ఫురించే విధంగా కాకుండా తెలంగాణ ప్రజాపరిపాలన దినోత్సవంగా పాటించాలని నిర్ణయించడం ఏ మాత్రం సమర్థనీయం కాదు. అసలు నాటి నిజాం హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడానికి మూలమే తెలంగాణలో జరిగిన మహోజ్వల సాయుధ పోరాటం. నాటి హైదరాబాద్ సంస్థానంలోని కన్నడ, మరాఠీ ప్రాంతాలు ఉన్న నేటి కర్నాటక, మహారాష్ట్రలలో విలీన దినోత్సవంగా నిర్వహిస్తుండగా లేని అభ్యంతరం తెలంగాణలో అదే పేరుతో నిర్వహించడంలో ఎందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనుకాగడుతున్నది? నిస్సంకోచంగా సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీనదినోత్సవంగా అధికారికంగా నిర్వహించడమే నాటి యోధులకు అసలైన నివాళి.

### అది హిందూ ముస్లిం పోరాటం కానే కాదు

ఈనాటి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు ఆనాటి తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందూ, ముస్లింల మధ్య ఘర్షణలుగా చిత్రీకరించడానికి ప్రయత్నిస్తూ తాము రాజకీయంగా తెలంగాణలో బలపడటానికి ఈ ఘటనను ఉపయోగించుకుంటున్నాయి.

హైదరాబాద్ సంస్థాన రాజు ముస్లిం అయినప్పటికీ జమీందార్లు, జాగీర్దార్లు, భూస్వాములు దాదాపు 90 శాతం హిందువులే. విసునూరు రాంచంద్రారెడ్డి, జన్నారెడ్డి ప్రతాప రెడ్డి ఇంకా అనేక సంస్థానాధిపతులు హిందువులే. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అనేకమంది ముస్లింలు కూడా చిత్రహింసలకు గురికాబడ్డారు. షేక్ బందగీని విసునూరు రాంచంద్రారెడ్డికి చెందిన గుండాలు చంపివేశారు. ప్రఖ్యాత జర్నలిస్టు షోయబుల్లా ఖాన్‌ను హైదరాబాద్ నడిబజారులో రజాకార్లు క్రూరంగా చంపారు.

ఈనాటి ఖమ్మం జిల్లా ఆనాటి వరంగల్ జిల్లాలో రజబ్ ఆలి లాంటి యోధులు నిజాం రాచరికానికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. డాక్టర్ రాజ్‌బహదూర్ గౌర్ తో కలిసి మఖ్దూం మొహియొద్దీన్, ప్రొ॥ఆలం కుంద్ మిరి, జవ్వాద్ రజ్వీ,(సాలార్‌జంగ్ మ్యూజియం ఆనాటి లైబ్రేరియన్) ప్రొ॥ ఖయ్యూంఖాన్ లాంటి అనేక మంది ముస్లీం విద్యావేత్తలు నిజాం రాచరికపాలనకు వ్యతిరేకంగా కామ్రేడ్స్ అసోషియేషన్‌ను ఏర్పాటు చేశారు. మహ్మద్ రఫీ ఉస్మానియా యూనివర్సిటీలో నిజాంకు వ్యతిరేకంగాజాతీయ జెండాను ఆవిష్కరణ చేశారు. నిజాం వ్యతిరేకపోరాటంలో అగ్రగామిగా నున్న అల్లా ఉద్దీన్‌ని నిజాం మూకలు చంపివేయడం జరిగింది. ఇలా ఎంతో మంది ముస్లింలు నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారు. చిత్రహింసలకు, హత్యలకు గురైనారు. సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన ముగ్గురు రణసేనానులలో మఖ్దూం మొహియుద్దీన్ ప్రఖ్యాత కవి, విప్లవకారుడు. నిజాంను గద్దె దించడంలో మతాలకు అతీతంగా హిందువులతో సహా వీరోచిత పాత్ర పోషించిన ముస్లింలను విస్మరిస్తే చరిత్ర క్షమించదు.





ఆనాటి తెలంగాణ పోరాటంలో, అలాగే దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎటువంటి పాత్ర లేని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు తెలంగాణ పోరాటంలో తమ పాత్ర లేదని ఒప్పుకుంటూనే గత పోరాటాన్ని స్మరించుకోవడం తప్పుకాదని విచిత్ర వాదనలు తీసుకొస్తున్నారు. ఆనాటి కమ్యూనిస్టులు త్యాగాలు పోరాటాలు లేకుండా విలీనం జరిగేదా? ఆనాటి విలీనం లేకుండా నేటి తెలంగాణ ఉండేదా? నిజంగా వారిలో చిత్తశుద్ధి ఉండి ఉంటే గతంలో బిజెపి హయాంలో పెండింగ్‌లో ఉన్న తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల పెన్షనలు ఎందుకు మంజూరు చేయలేదు? (గతంలో తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న కమ్యూనిస్టు యోధులను అప్పటి కేంద్ర ప్రభుత్వం గుర్తించి భారత కమ్యూనిస్టు పార్టీ డిప్యూటి ప్రధాన కార్యదర్శిగా ఉన్న నలమల్ల గిరిప్రసాద్ ఆధ్వర్యంలో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసి వేలాది మందికి పెన్షన్ సౌకర్యం కల్పించిన విషయాన్ని గుర్తుచేస్తున్నాను.)

గత పోరాటాలను, త్యాగాలను న్యాయబద్ధంగా స్వీకరిస్తే తప్పు లేదు. కానీ రాజకీయ కుట్రతో పోరాట స్వరూపాన్ని వక్రీకరించి లబ్ధి పొందడానికి ప్రయత్నం చేయడమే పెద్ద తప్పు, ఘోరమైన నేరం. ప్రారంభంలో పేర్కొన్నట్లుగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పేద, బడుగు, బలహీనవర్గాలు సమిష్టిగా నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఫ్యూడల్ ప్రభువుల అణిచివేతలకు, దోపిడీలపై జరిపిన పోరాటం. ఈ పోరాటం లో హిందువులు, ముస్లింలు అన్నదమ్ముల్లా పాల్గొన్నారు. ఈ పోరాటానికి మతం రంగు పులమడమంటే రానున్న తరాలకు తెలంగాణ వీర చరిత్రను అందకుండా చేసే కుట్ర ఇందులో దాగివున్నది. వీటిని తెలంగాణ ప్రజలు ఎన్నటికీ నమ్మబోరు. ఎందుకంటే ఇక్కడ ఇంటింటికి పోరాట స్మృతులు ఉన్నాయి.

నేటి పాలకుల విధానాలతో ధనిక, పేదల నడుమ అంతరాలు అత్యంత తీవ్రమవుతున్నాయి. భూమికి వివిధ పేర్లతో బడాబాబులు కేంద్రీకృతం చేసుకుంటున్నారు. మతం పేరుతో ప్రజలను విడదీసి ఫాసిస్టు కార్పొరేట్ ఎజెండాను బిజెపి నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్నది.

వీటికి వ్యతిరేకంగా నేటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో పోరాటాలను ఉధృతం చేయాలి. సెప్టెంబర్ 11–17 తేదీలలో జరిగే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా పునరంకితం అవుదాం.

**ఈ సందర్భంగా నాటి మహత్తర పోరాటానికి నేతృత్వం వహించిన ఘన వారసత్వం గల కమ్యూనిస్టు పార్టీగా మహోజ్వల చరితను భావి తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందు కింది ప్రతిపాదనలు ఉంచుతున్నాం.**

1) సెప్టెంబర్ 17ను తెలంగాణ ప్రజాపరిపాలన దినోత్సవం పేరుగా కాకుండా అధికారికంగా తెలంగాణ విలీన దినోత్సవం పేరుతో నిర్వహించాలి.
2) నాటి మహత్తర తెలంగాణ స్వాతంత్ర్యోద్యమ, రైతాంగ సాయుధ పోరాట చరిత్రను రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాఠ్యాంశాలలో చేర్చాలి.
3) అమరవీరుల స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. అందులో ఆనాటి పోరాటంలో అసువులు బాసిన అమరుల పేర్లను, ఫోటోలను ప్రతి గ్రామం నుంచి అధికారికంగా సేకరించి భావితరాలకు మార్గదర్శకంగాఉండేలా స్మారక కేంద్రంలో మ్యూజియం ఏర్పాటు చేయాలి.
4) హైదరాబాద్‌లో నాటి పోరాట సేనానులు రావి నారాయణ రెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి ఒకే చోట, దొడ్డి కొమరయ్య, షేక్ బందగీ, బొమ్మగాని ధర్మభిక్షం, చాకలి ఐలమ్మ లాంటి ఆనాటి సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ముఖ్య ప్రదేశాలలో ఏర్పాటు చేయడం ద్వారా తెలంగాణ ప్రజలకు స్ఫూర్తి దాయకంగా ఉంటుంది.
5) తొలి సార్వత్రిక ఎన్నికల్లో నెహ్రూను మించిన మెజారిటీ పొందిన ప్రజానాయకుడు రావి నారాయణరెడ్డి విగ్రహాన్ని పార్లమెంటులో పెట్టాలి.
6) నాటి తెలంగాణ స్వాతంత్ర్య పోరాట నాయకుల పేర్లు చిరస్థాయిగా నిలిచేవిధంగా వివిధ ప్రభుత్వ పథకాలకు నామకరణం చేయాలి.




చలో చండీఘడ్

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)
25వ కాంగ్రెస్
21-25 సెప్టెంబర్, 1925
చండీఘడ్ (పంజాబ్)

# సిపిఐ చీలిక దిశలో...ఆరవ కాంగ్రెస్

## విజయవాడ, 1961

అంతర్జాతీయ , భారత కమ్యూనిస్టు ఉద్యమంలో చీలిక తెచ్చే మావోయిజం విచ్ఛిన్నకర కార్యకలాపాల నేపథ్యంలో సిపిఐ ఆరవ కాంగ్రెస్ 1961 (ఏప్రిల్ 7–16)లో విజయవాడలో జరిగింది. భారత రాజ్య స్వభావం, దానిపై ఆధిపత్యం బూర్జువా వర్గానిదా, ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థదా? సాయుధ పోరాటం మార్గాన్ని, కార్మికవర్గ నియంతృత్వాన్ని విడనాడటం, విప్లవ పరివర్తనకు శాంతియుత మార్గాన్ని ఎంచుకోవటం సబబు కాదనే సిద్ధాంత చర్చను పార్టీ నాయకత్వంలోని ఒక గ్రూపు పార్టీలో అంతర్గతంగా లేవదీసిన సమయం అది. అలాగే నెహ్రూను ప్రగతిశీలవాదిగా గుర్తించటంపై ప్రశ్నలు వచ్చాయి. అదే సమయంలో, సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ 20వ కాంగ్రెస్ ఆమోదించిన యుద్ధము–శాంతి; విప్లవ పరివర్తనలో పార్లమెంటరీ సంస్థల పాత్ర, శాంతియుత పరివర్తన సైద్ధాంతిక వైఖరులతో మావో సే టుంగ్ నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధివర్గం ఏకీభవించలేదు. భూగోళాన్ని సర్వనాశనం చేసే అణుయుద్ధ ప్రమాదం నేపథ్యంలో యుద్ధాల నివారణకు కృషిచేయటమనే సిపిఎస్‌యు భావనను తిరస్కరించింది. విప్లవానికి సాయుధ పోరాటమే మార్గమని సిద్ధాంతీకరిస్తూ 'శ్మశానం నుంచే సోషలిజం', 'తుపాకీ గొట్టం ద్వారానే అధికారం' వంటి విచ్ఛిన్నకర విధానాలను మావో ప్రోత్సహించారు. ఈ సిద్ధాంత చర్చ అనేక దేశాలలో కమ్యూనిస్టులకు ఆత్మహత్యాసదృశమైంది. భారత కమ్యూనిస్టు పార్టీలో కూడా అటువంటి చర్చలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. పార్టీ జాతీయ నాయకత్వంలో భారతదేశ విప్లవ దశపై రెండు విరుద్ధ భావాలు ఘర్షణ పడుతున్నాయి. అయినప్పటికీ శ్రమజీవులు, అణగారిన తరగతులు, సన్నకారు రైతులు, కౌలు రైతులు తదితర శ్రమజీవుల్లో కమ్యూనిస్టు పార్టీ పట్ల విధేయత చెక్కుచెదరలేదు. 1962 సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టులకు సాంప్రదాయకంగా బలమైన రాష్ట్రాల్లో అసెంబ్లీ, లోక్‌సభ సీట్లు గణనీయంగానే లభించాయి.

విజయవాడ పార్టీ కాంగ్రెస్‌కు 1,77,501 మంది సభ్యులకు ప్రాతినిధ్యం వహిస్తూ, 439మంది ప్రతినిధులు హాజరైనారు. మావోయిజం ప్రోత్సాహంతో చైనా కమ్యూనిస్టు పార్టీ పంథాను విశ్వసిస్తున్నవారు పార్టీని చీల్చడానికి ప్రయత్నిస్తున్నారు. అజయ్‌ఘోష్ సకాలంలో జోక్యం చేసుకుని చీలికను అప్పటికి నివారించారు. పార్టీ 'రాజకీయ తీర్మానం' ఆమోదించకుండానే మహాసభ ముగిసింది. అనారోగ్యంగా ఉన్నప్పటికీ అజయ్ ఘోష్ చేసిన సుదీర్ఘ ఉపన్యాసమే 'పార్టీ పంథా'గా ఆమోదించబడింది.

**కేంద్ర సెక్రటేరియట్ సభ్యులు**

అజయ్ ఘోష్(జనరల్ సెక్రటరీ) 2.ఎస్.ఎ.డాంగే, 3.భూపేష్ గుప్తా, 4.ఎం.ఎన్.గోవిందన్ నాయర్, 5.జడ్.ఎ.అహ్మద్

**కేంద్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు :**

1.అజయ్ ఘోష్(జనరల్ సెక్రటరీ) 2.ఇఎంఎస్. నంబూద్రిపాద్, 3. పి.సి.జోషి, 4. భూపేష్ గుప్తా, 5.ఎస్.ఎ.డాంగే, 6.ఎం.బసవ పున్నయ్య, 7.బి.టి.రణదివె, 8.జడ్.ఎ. అహ్మద్, 9. సి.రాజేశ్వరరావు,10.ఎన్.రాజశేఖర్ రెడ్డి, 11.పి.రామమూర్తి, 12. ఎం.ఆర్.వెంకటరామన్, 13.రామ కృష్ణ పథి, 14.ఎస్.జి.సర్దేశాయ్, 15.జ్యోతిబసు, 16. ప్రమోద్ దాస్ గుప్త, 17.భవాని సేన్, 18. సోహాన్ సింగ్ జోష్, 19. రమేష్ చంద్ర, 20. యోగీంద్ర శర్మ, 21.ఎం.ఎన్.గోవిందన్ నాయర్,22. ఎ.కె.గోపాలన్, 23. కె.దామోదరన్,24.ఫణి బోర, 25. జగ్జిత్‌సింగ్ ల్యాల్‌పురి, 26. ఎస్.వి.ఘాటే (చైర్మన్ సిసిసి)

1962 జనవరిలో అజయ్ ఘోష్ మరణానంతరం, జాతీయ సమితి పార్టీలో ఐక్యత పరిరక్షణకై ఎస్.ఎ.డాంగేను చైర్మన్‌గా, ఇఎంఎస్ నంబూద్రిపాద్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది.

### 1962లో చైనా దురాక్రమణ

1962 అక్టోబర్‌లో చైనా సైన్యాలు, అది ఇచ్చిన వాగ్దానాన్ని ఉల్లంఘించి భారత భూభాగంలోకి దురాక్రమించాయి. అయితే చైనాకు అనుకూలురని భావించిన సిపిఐ నాయకులను ప్రభుత్వం దేశభద్రత చట్టం కింద అరెస్టు చేసింది. సిపిఐ కేంద్ర కార్యవర్గ కమిటీ, జాతీయ సమితి చైనా దురాక్రమణను నిర్ద్వంద్వంగా ఖండించాయి. అస్సాం దాకా వచ్చిన చైనా సైన్యాలు కొన్ని రోజుల తర్వాత అంతర్జాతీయ ఒత్తిడి కింద ఉపసంహరించుకున్నాయి. సిద్ధాంత విభేధాలు తారాస్థాయికి చేరగా 32 మంది సభ్యులు 1964లో జాతీయ సమితి సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అదే సిపిఐలో చీలిక. సిపిఐ నాయకత్వాన్ని రివిజనిస్టులుగా నిందించారు ఆ పిడివాదులు.


1962 అక్టోబర్‌లోనే క్యూబన్ మిస్సిలీ సంక్షోభం యాదృచ్ఛికమే కావచ్చు. ప్రపంచాన్ని అణుయుద్ధం అంచుకు తీసుకెళ్లిన సంక్షోభం 13రోజులు నడిచింది. క్యూబాలో అణు మిస్సిలీల ఏర్పాటును రష్యా ఉపసంహరించుకోవటం, క్యూబాపై దాడి చేయబోమని అధ్యక్షుడు కెన్నడీ అంగీకరించటం, టర్కీ నుంచి తమ మిస్సిలీలను అమెరికా వెనక్కి తీసుకోవటంతో ఆ సంక్షోభం ముగిసింది. దానితో సంబంధం లేకపోయినా అదే సమయంలో భారత్‌పై చైనా దురాక్రమణతో ఇండీ – చీని భాయిభాయి అంటూ వికసించిన, ప్రపంచానికి పంచశీలను అందించిన భారత్–చైనా మైత్రి భగ్నమైంది.

పార్టీని చీల్చిన వారు పశ్చిమ బెంగాల్‌లో మహాసభ జరుపుకుని సిపిఐ(మార్క్సిస్టు)గా ప్రకటించుకున్నారు. పుచ్చలపల్లి సుందరయ్యను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. అజ్ఞాతంలోని కమ్యూనిస్టు విప్లవకారులు కొద్దిమంది తాష్కెంట్‌లో సమావేశమై సిపిఐ ఏర్పాటు ఆలోచన చేసిన 1920ని సిపిఐ వ్యవస్థాపక సంవత్సరంగా గుర్తించారు. భారత దేశంలో పార్టీ ఏర్పడిన 1925ను సంస్థాపక సంవత్సరంగా ఉమ్మడి పార్టీ తీర్మానించింది. విప్లవ శాంతియుత పరివర్తనను తిరస్కరించకపోయినా సాయుధ పోరాట మార్గానికి ప్రాధాన్యత ఇచ్చారు. భారత రాజ్యంపై ఫ్యూడల్ భూస్వామ్య శక్తులు ఆధిపత్యం వహిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ వ్యతిరేకతను ప్రధాన రాజకీయ పంథాగా ఎంచుకున్నారు. కాబట్టి విప్లవ దశను ప్రజాస్వామిక దశగా గుర్తించటానికి నిరాకరించారు.

కార్మికవర్గ నియంతృత్వ భావనను పునరుద్ధరించారు. జనతంత్ర ప్రజాస్వామ్యం (పీపుల్స్ డెమొక్రసీ) స్థాపన తమ గమ్యంగా ప్రకటించారు. తమ పార్టీకి మెజారిటీ లేదా ఆధిక్యస్థానం లేనిదే ప్రభుత్వాల్లో చేరరాదన్న తీర్మానం దీన్నుండే వచ్చింది. ప్రధానమంత్రి అయ్యేందుకు 1996లో జ్యోతిబసుకు వచ్చిన అవకాశాన్ని తిరస్కరించటానికి అదే కారణం.

అయితే సాయుధ పోరాటమంటూ పార్టీని చీల్చిన నాయకులు పార్లమెంటరీ పంథాలోనే ప్రయాణిస్తున్నందున ఆ పార్టీ నాయకుల్లోని అతివాదులు ఆ నాయకత్వాన్ని నయా 'రివిజనిస్టులు'గా నిందించి చైనా పార్టీ ప్రోత్సాహంతో 1967లో నక్సల్‌బరీ ఉద్యమ ప్రేరణతో అడవుల బాటపట్టారు. ఆ తర్వాత సిద్ధాంత రాద్ధాంతాలతో దఫదఫాలుగా ఎన్ని ముక్కలైనారో చెప్పటం కష్టం. ఇప్పుడు కొన్ని గ్రూపులు సాయుధ పోరాటాన్ని విడనాడి జనజీవన స్రవంతిలోకి వచ్చి బహిరంగంగా పనిచేస్తున్నారు. అయితే పార్లమెంటరీ పంథాకు వ్యతిరేకం. అందువల్ల ఎన్నికల్లో పాల్గొనరు. మరికొన్ని గ్రూపులు సిపిఐ మావోయిస్టులుగా, మార్క్సిస్టు–లెనినిస్టుగా, లిబరేషన్‌గా – (కొందరు అజ్ఞాతంగా, మరికొందరు బహిరంగంగా) ఇలా అనేక పేర్లతో పనిచేస్తున్నారు. 'లిబరేషన్' ఎన్నికల్లో పాల్గొంటున్నది. అడవులలోని మావోయిస్టులపై కేంద్రప్రభుత్వం ఇప్పుడు 'ఆపరేషన్ కగార్' పేరుతో నిర్మూలన కార్యం సాగిస్తున్నది.

### బొంబాయిలో 7వ కాంగ్రెస్ – 1964



పార్టీలో చీలిక తర్వాత ఇది మొదటి కాంగ్రెస్. 1964 డిసెంబర్ 13 నుండి 23 వరకు బొంబాయిలో జరిగింది. పార్టీలో చీలిక కమ్యూనిస్టు ఉద్యమానికి అతితీవ్రమైన హాని చేసిందని మహాసభ తీర్మానించిం ది. 'జాతీయ ప్రజాతంత్ర విప్లవం' ('నేషనల్ డెమొక్రసి') అనే కొత్త కార్యక్రమాన్ని మహాసభ ఆమోదించింది. మావోయిజాన్ని, చైనా దురాక్రమణను సిపిఐ కాంగ్రెస్ ఖండించింది.

చైర్మన్‌గా ఎస్.ఎ.డాంగేను, ప్రధాన కార్యదర్శిగా చంద్ర (సి) రాజేశ్వరరావును ఎన్నుకుంది.

**కార్యదర్శివర్గం:** జి.అధికారి, ఎం.ఎన్.గోవిందన్ నాయర్, రమేష్ చంద్ర, జడ్.ఎ.అహ్మద్, యోగీంద్ర శర్మ, భూపేష్ గుప్త, ఎన్.కె.కృష్ణన్

**కేంద్ర కార్యవర్గం** :ఎస్.ఎ.డాంగే, సి.రాజేశ్వరరావు, జి.అధికారి, ఎం.ఎన్.గోవిందన్ నాయర్, రమేష్ చంద్ర, జడ్.ఎ.అహ్మద్, యోగీంద్ర శర్మ, భూపేష్ గుప్త, ఎన్.కె.కృష్ణన్, నీలం రాజశేఖర్‌రెడ్డి, తమ్మారెడ్డి సత్యనారాయణ, మనలి సి. కందస్వామి, కె.దామోదరన్, పి.కె.వాసుదేవన్ నాయర్, రామకృష్ణ పథి, భవానీసేన్, ఇంద్రజిత్ గుప్తా, ఫణి బోర, ఇంద్రదీప్ సిన్హా, కాళీశంకర్ శుక్లా, అవతార్ సింగ్ మల్హోత్రా, బి.కె.గుప్తా, సోహాన్ సింగ్ జోష్, హెచ్.కె.వ్యాస్, ఎస్.జి.సర్దేశాయ్, ఆహ్వానితుడు : ఎస్.వి.ఘాటే(చైర్మన్, కేంద్ర కంట్రోల్ కమిషన్)

## ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందనలు

### మండల విద్య అధికారి లక్ష్మణ్ నాయక్



**ప్రజాపక్షం/షాబాద్ :** షాబాద్ మండలం నుంచి ఆరుగురికి ఉత్తమ అవార్డులు రావడం అభినందనీయమని మండల విద్య అధికారి లక్ష్మణ్ నాయక్ అన్నారు. బుధవారం జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో షాబాద్ మండలానికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయలు, మండల విద్య శాఖ అధికారి లక్ష్మణ్, రోహినా, ధశరత్ రెడ్డి, రమేష్ కుమార్, సత్యనారాయణ, శైలజకు జిల్లా కలెక్టర్ సన్మానం చేసి అవార్డులు అందజేశారన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్ బద్దం ప్రేమ్



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** నూతన డిప్యూటీ కమీషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌కు గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి అభినందనలు తెలిపారు. బుధవారం సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో డిసి శ్రీనివాస్‌ను మర్యాధపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సరూర్‌నగర్ చెరువులో గణేష్ విగ్రహాల నిమజ్జనం కార్యక్రమం విజయవంతంగా, శాంతియుతంగా పూర్తి చేయడంలో డిసి శ్రీనివాస్, వారి బృందం సేవలు అభినందనీయమన్నారు. ప్రజల సహకారంతో జిహెచ్‌ఎంసి సిబ్బంది శ్రమ వల్లే ఈ మహోత్సవం ప్రశాంతంగా పూర్తయిందని, వారందరికీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## రీజినల్ రింగ్‌రోడ్డు మార్కింగ్‌ను మార్చండి సారూ..

### ఎమ్మెల్యేకు రైతుల వినతి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రీజినల్ రింగ్‌రోడ్డు మార్కింగ్‌ను మార్చేందుకు కృషి చేయండి సారూ అంటూ స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు జిల్లేడు చౌదరిగూడ మండలం వనంపల్లి గ్రామ రైతులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో చలివేంద్రంపల్లి రాజు, బిసిసెల్ చైర్మెన్ చంద్రశేఖర్, సుధాకర్‌రెడ్డి, మాధవి, చాకలి మల్లయ్య, సంజీవరెడ్డి, కావలి రాజు, రవి, సూరారం చంద్రయ్య, చిన్న జంగయ్య, అజారుద్దీన్, రాములమ్మ, రాములు, యాదయ్య, ఆంజనేయులు, భూపాల్, కరీం, షకిల్, బర్ల నర్సింలు, బాలయ్య, శ్రీను ఉన్నారు.

## సిఎం సహాయనిధి అందజేత



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ :** మెరుగైన వైద్యసేవలు అంధించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.2.50లక్షల ఎల్‌ఓసి చెక్కును బాధిత కుటుంబారికి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అందించారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నందిగామ మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్ పాషా అనే వ్యక్తి కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసిని అంధించారు. కార్యక్రమంలో నేతలు శేరి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణ, రమేష్ గౌడ్, బషీర్, సుధీర్, నర్సింహ్మా గౌడ్‌లు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు నూతన చెత్త రిక్షాలు పంపిణీ



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్లోని సాహెబ్ నగర్ శ్రీసీతారామంజనేయ స్వామి కల్యాణ మండపంలో పారిశుద్ధ్య కార్మికులకు చెత్త సేకరణ రిక్షాలను బుధవారం స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ రిక్షాలతో చిన్న చిన్న గల్లీలో చెత్త సేకరణ సులభతరంగా ఉంటుందన్నారు. చెత్తను రోజువారీగా సేకరణ చేయాలని సిబ్బందిని కోరారు. కాలనీలకు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ డిఇ నీలిమ, ఎస్ఎస్ అజీమ్ ఉద్దీన్, జవాన్ యాదయ్య, పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షులు మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

## సమస్యలు తీర్చాలని ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్‌కు వినతి



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఎనిమిదవ వార్డు ఫతేపురంలో నెలకొన్న మూడు సమస్యలను తీర్చాలని ఆ వార్డు నాయకులు బుధవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యను కలుసుకొని వినతి పత్రంఅందించారు. మున్సిపల్ కమిషనర్ యోగేష్ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూసీ నదిపై కొట్టుకుపోయిన వంతెనను పునర్ నిర్మించాలని కోరారు.

## అనధికారిక కేబుల్ కటింగ్ ఆపాలి




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్రంలో ఎలాంటి నోటీసు ఇవ్వకుండా అనధికారికంగా జరుగుతున్న కేబుల్ కట్టింగ్‌లను తక్షణమే నిలిపివేయాలని తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ ఏరియల్ కేబుల్ ఆపరేటర్స్ ( ఫ్యాకో) రాష్ట్ర అధ్యక్షులు కరుణాకర్, ప్రధానకార్యదర్శి సలాం డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని, ఎప్పుడు ఆహ్వానించినా వస్తామన్నారు. హైదరాబాద్‌లో కేబుల్స్ నీట్‌గా కట్టే పనులు (బ్యూటిఫికేషన్)కు తమ సహకారం ఉంటుందన్నారు. అయితే, తమ రంగం నష్టపోకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## 22న అగ్రసేన్ జయంతి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** అగ్రసేన్ మహారాజ్ జయంతి మహోత్సవాన్ని ఈ నెల 22న శంషాబాద్‌లోని క్లాసిక్ కన్వెన్షన్ – 3లో నిర్వహించనున్నట్టు అగర్వాల్ సమాజ్ తెలంగాణ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ రీతూ అగర్వాల్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో సమాజ్ ఆధ్వర్యాన నారీ శక్తి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సమాజ్ వైస్ చైర్మన్ డింపుల్ అగర్వాల్, ఆర్తి అగర్వాల్, అగ్రసేన్ జయంతి ప్రధాన సంయోజకురాలు డాక్టర్ సీమా జైన్, రాష్ట్ర అధ్యక్షులు అనిరుధ్ గుప్తా, అన్ని శాఖల పదాధికారిణులు పాల్గొన్నారు. రేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మెరుగైన విద్య అందించే బాధ్యత ఉపాధ్యాయులదే

### శాసనమండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమానికి మహేందర్‌రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడుగా జీవితాన్ని ప్రారంభించి దేశ అత్యున్నత స్థానమైన రాష్ట్రపతి పదవిని అలంకరించారన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్‌ని గౌరవించి, వారి జన్మదినాన్ని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. గ్రామీణ పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి వారిని ఉన్నత శిఖరాలకు తీసుకువచ్చే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 207 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ఇవ్వడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసిందన్నారు. సమాజంలో మార్పుకు ఉపాధ్యాయులే ముఖ్యమని, ఈ సందర్భంగా అందరికి అభినందనలు తెలిపారు. చేవెళ్ళ ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ మెరుగైన సమాజం ఉండాలంటే నాణ్యమైన విద్య ఉండాలని, విద్య వచ్చిన వారికి సమాజంలో మంచి గౌరవం ఉంటుందన్నారు. విద్యావేత్తలకే ఎక్కువ గౌరవం ఉంటుందని, అలాంటి విద్యావేత్తలను తయారు చేసేది గురువులేనని ఎమ్మెల్సీలు ఎవిఎన్ రెడ్డి, దయానంద్ గుప్తా అన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక అయిన 207మంది ఉపాధ్యాయులకు శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు కె.చంద్రారెడ్డి, కె.శ్రీనివాస్, జిల్లా పరిషత్ సిఇఒ కృష్ణారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, మండల విద్యాధికారులు,ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా 'నటరాజ కూచిపూడి' వార్షికోత్సవం



**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** నటరాజ కూచిపూడి కళా నిలయం 12వ వార్షికోత్సవం వేడుకలు అట్టహాసంగా జరిగాయి. బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతి వేదికగా కళానిలయం గురు, డైరెక్టర్ చల్లా హిమబిందు ఆధ్వర్యాన ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రిటైర్డ్ అడిషనల్ ఎస్‌పి పద్మనాభరెడ్డి, గురు ఒడిస్సీ రమణ్ కుమారి, హైకోర్టు అడ్వకేట్, భరతనాట్యం డ్యాన్సర్ సి.జెస్సీ హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, చిన్నారుల నృత్యప్రదర్శనలు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. భవిష్యత్తులో కూచిపూడి మక్కువ ఉన్న 130 మంది విద్యార్థినులతో ప్రదర్శన ఇవ్వనున్నట్టు కళానిలయం నిర్వాహకులు తెలిపారు.

# బిసిల కోసం అలుపెరగని పోరాటం

### -బిసి సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య



**ప్రజాపక్షం/హయత్‌నగర్:** బిసిల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నానని బిసి సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. బుధవారం మన్సూరాబాద్ డివిజన్‌లోని ఎంఇరెడ్డి గార్డెన్స్‌లో బిసి యునైటెడ్ ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బిసి ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతు బిసిలకు జరుగుతున్న అన్యాయాలపై గతకొన్ని సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటాలు చేస్తున్నానని, భవిష్యత్తులోనూ కలిసి వచ్చే శక్తులతో తన పోరాటాన్ని కొనసాగిస్తానని చెప్పారు. బిసి యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు పాలూరి రామకృష్ణయ్య సేవలు మరువలేనివని ఆర్.కృష్ణయ్య కొనియాడారు. రాజ్యాధికారం సాధించాలంటే బిసిలంతా ఏకతాటి పైకి వచ్చి పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బిసి యునైటెడ్ ఫ్రంట్‌కు నూతన రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన అయితగోని రాఘవేంద్రగౌడ్ యువకుడని, ఆయనకు పోరాటం చేసే ఓపిక, సత్తా ఉందని ప్రశంసించారు. వీరి ఆధ్వర్యంలో బిసిలకు రావాల్సిన వాటా సాధించుకోవడంతో పాటు రాజ్యాధికారం సాధించే దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రములో పల్లె రవికుమార్ పుట్టం పరషోత్తం, బిసి యునైటెడ్ ఫ్రంట్ జాతీయ కోశాధికారి పాలూరి లక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసు, కె.యాదవ్, కోశాధికారి డాక్టర్ కాసోజు విద్యారాణి, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాపార్తి కుమార్‌గార్కే, తెలంగాణ వనరుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోర శ్యాంసుందర్ గౌడ్, బిసి సంఘాల నాయకులు బొంగు వెంకటేష్‌గౌడ్, వేముల కొండలగౌడ్, బైరు శేఖర్‌గౌడ్, బడేటి సత్యనారాయణ, అంజయ్య గౌడ్, చంద్రపాల్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

# సాయుధ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత ఐలమ్మ

### రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీత




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** భూమి కోసం,భుక్తి కోసం,వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ అని రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి(డిఆర్ఒ) సంగీత అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో బిసి వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత,బిసి సంక్షేమ అధికారి కేశురామ్‌తో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఒ సునీల్, జిల్లా కలెక్టర్, సిసి జనార్ధన్, బిసి సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్:** తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ సూచించారు. బుధవారం పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయం ఎదురుగా ఉన్న చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్‌బాబర్‌ఖాన్, ఫరూక్‌నగర్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నేతలు రఘు, చెన్నయ్య, రజక సంఘం నేతలు చిల్కమర్రి నర్సింలు, విఠ్యాల నర్సింలు, చించోడు అనంతం, దేవగిరి రామకృష్ణ, శేఖర్, లింగారెడ్డిగూడ అశోక్, కృష్ణయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో** భూమికోసం,,భూక్తికోసం..విముక్తి కోసం పోరాడిన సహస వనిత, బడుగు వర్గాల వీర యోధురాలు చాకలి ఐలమ్మ అని షాద్‌నగర్ జాయింగ్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు జనార్థన్, మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్‌లు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపిడివో కార్యాలయం ముందు ఉన్న ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో నక్క బాల్‌రాజ్ నర్సింహ్మాగౌడ్, కృష్ణయ్య, అర్జున్‌కుమార్, రవీందర్ గౌడ్, హెల్త్ శ్రీనివాస్, ఎం.నర్సింలు, రంగరాజన్, రాము, చంద్రశేఖర్, సురేందర్, ఆర్టిసి నర్సింలు, శ్యాములయ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

**ఎల్‌బి నగర్:** నిజాం కాలంలో పటేల్‌గిరి వ్యవస్థపై తిరుగుబాటు చేసి, రజాకార్లను తరిమివేయడంలో చాకలి ఐలమ్మ పోరాటం వీరోచితమని ఎల్‌బి నగర్ సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎల్‌బి నగర్ చింతలకుంట వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు బోయపల్లి రాములు గౌడ్, బాతరాజు నర్సింహ పాల్గొన్నారు.

**బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో..** ఎల్‌బి నగర్ చౌరస్తాలోని శ్రీకాంత్ చారి, అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద నారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో చిత్రాపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, మాజీ ఎంపిటిసి నిరంజన్, శివశకుమార్, లక్ష్మి , రేణుక, రాధ, యాదయ్య, బకమ్మ ఉన్నారు.

**బిజెపి ఆధ్వర్యంలో...** ఎల్‌బి నగర్ చింతలకుంట వద్ద చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి బిజెపి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బిజెపి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర నర్సయ్య, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, జిహెచ్‌ఎంసి ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి, సామ రంగారెడ్డి, కొత్త రవీందర్ గౌడ్ ఉన్నారు.

**సరూర్‌నగర్ :** భూమికోసం భుక్తి కోసం పోరాడిన చాకలి ఐలమ్మ స్ఫూర్తిగా నేటి యువతరం మహిళలు వీరవనితలుగా మారాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కెఎల్ఆర్ ) అన్నారు. బుధవారం చాకలి ఐలమ్మ వర్ధింతి వేడుకలను ఆర్‌కెపురం డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పున్నా గణేష్‌నేత, చిలుక ఉపేందర్‌రెడ్డి, గట్ల రవీంద్ర, పెద్దవూర సైదులు, సురేందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం :** తెలంగాణ రైతాంగా సాయుధ పోరాట యోదురాలు,భూమి భుక్తి వెట్టి చాకిరి విముక్తి కోసం, నిజాం నవాబులకు వ్యతిరేఖంగా పోరాడిన చాకలి ఐలమ్మ వర్థంతి సందర్భంగా బుధవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి సిపిఐ నాయకులు పూలమాల వేసి నివాళ్ళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కావలి సురేష్, ఎస్ లక్ష్మయ్య, పి నీలమ్మ, నర్సింహ్మా, సిఎచ్ కుమార్, జె ప్రవీణ్ కుమార్, నర్సింహ్మా,అంజయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

**శంకర్‌పల్లి:** శంకర్ పల్లి పట్టణంలో బుధవారం వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని వివిధ పార్టీల నాయకులు జరుపుకున్నారు. శంకర్‌పల్లి ఆర్టీసీ బస్టాండ్ పక్కన గల ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చాకలి మల్లేష్, రామచందర్, అమృత, యాదయ్య, రమేష్, శ్రీనివాస్, మోహన్, అశోక్, బాలరాజు, మహేందర్, మహారాజ్‌పేట రామచందర్, భాగయ్య, పండిత రావు, విటల్, కృష్ణారెడ్డి, మల్లేశం, సిపిఐ మండల నాయకుడు సుధీర్, జి. కృష్ణ, ఎండి. యూసుఫ్, పి, రవి, మహా లింగాపురం ఆటో యూనియన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

**శంషాబాద్:** చాకలి ఐలమ్మ విరోచిత పోరాటాన్ని ప్రతి కార్యకర్త గుర్తు చేసుకోవాలని సిపిఐ రాష్ట్ర నాయకుడు పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. శంషాబాద్ పట్టణంలోని సిద్ధాంతి కాలనీలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ, "చాకలి ఐలమ్మ ఒకే సామాజిక వర్గానికి చెందిన నాయకురాలు కాదు. ఆమె అందరి వర్గాలకు, ప్రజలకు స్ఫూర్తి అయిన నాయకురాలు" అని పేర్కొన్నారు. నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలనకు, ఫ్యూడల్ ప్రభువుల దురాగతాలకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు."చాకలి ఐలమ్మ చేసిన త్యాగం దేశానికే గర్వకారణం. ఎన్నో ఉద్యమాలకు ఆమె పోరాటం ఆదర్శంగా నిలిచింది. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్. యాదగిరి, మండల కార్యదర్శి నర్రగిరి రాజేందర్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, రజక సంఘం నాయకులు రమేష్, రాజు, నాగేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు భాస్కర్, రమేష్, రత్నం పాల్గొన్నారు.

**రజక సంఘం ఆధ్వర్యంలో...** తెలంగాణ రైతాంగ ఉద్యమ చరిత్రలో నిప్పుకణికగా నిలిచిన వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని శంషాబాద్ మండలం సిదాంతి, పెద్దతూప్ర గ్రామాల్లో రజక సంఘం ఆధ్వర్యంలో జరిగాయి. మాజీ కౌన్సిలర్ కుమార్, రజక సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దతూప్రలో మండల ఎంపిపి దిద్యాల జయమ్మ శ్రీనివాస్ నివాళులర్పించారు. నాయకులు బి. లక్ష్మయ్య, డి.నరసింహా తదితరులు మాట్లాడుతూ "ఇలాంటి వర్ధంతి కార్యక్రమాలు యువతలో చైతన్యం నింపుతాయి. ఐలమ్మ నిజమైన తెలంగాణ ఆడపడుచన్నారు. ఈ రెండు చోట్ల కూడా ప్రజలు, సంఘ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘన నివాళులు అర్పించాలని వారు కోరారు.










## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, రోడ్డు బిజీ కావడంతో నిత్యం పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని బిజెవైఎం నాయకులు జిమ్ శివ అన్నారు. బుధవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ దశరథకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల శామీర్‌పేట నల్సార్ చౌరస్తాలో ఓ వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడని అన్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు, వాహనదారులు..రోడ్డు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. వాహనాల వేగం తగ్గించేందుకు నల్సార్ చౌరస్తా, ఆరెంజ్‌బౌల్ చౌరస్తాల వద్ద సిగ్నల్స్, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటు చేయాలని వివరించారు.

## రూ.28 లక్షలతో బిటి రోడ్డు పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/దమ్మాయిగూడ:** దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు న్యూకుందన్‌పల్లిలో 28 లక్షల రూపాయలతో బిటి రోడ్డు పనులకు గురువారం శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమానికి వార్డు మాజీ కౌన్సిలర్ వరగంటి వెంకటేష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామారావులు కొబ్బరి కాయలు కొట్టి అభివృద్ధి పనులకు ప్రారంభించారు.పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేసి అందు బాటులోకి తీసుకురావాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర మార్కెట్ కమిటీ చైర్మన్‌ల ఫోరం ప్రధాన కార్యదర్శిగా నర్సింహయాదవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్‌ల ఫోరం జనరల్ సెక్రటరిగా మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ ను ఎన్నుకున్నారు. బుధవారం రాష్ట్ర మార్కెట్ కమిటి చైర్మన్‌లు నగరంలోని ఓ గార్డెన్‌లో సమావేశమై మార్కెట్ కమిటి చైర్మన్ల ఫోరంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర మార్కెట్ కమిటి ఫోరం చైర్మన్‌గా నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ ముప్ప గంగరెడ్డి, ఫోరం రాష్ట్ర జనరల్ సెక్రటరిగా మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, గౌరవ అద్యక్షులుగా గడ్డి అన్నారం మార్కెట్ కమిటి చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డిలు ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును నూతనంగా ఎన్నికైన ఫోరం సభ్యులు ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశామని చెప్పారు. అనంతరం నూతనంగా ఎన్నికైన రాష్ట్ర ఫోరం కమిటి సభ్యులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అభినందించి ప్రశంసించారు. అలాగే మేడ్చల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్‌ను వజ్రేష్‌యాదవ్ శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్కెట్ కమిటి చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.



## విజయవంతంగా ముగిసిన మహిళా బ్యాడ్మింటన్ టోర్నమెంట్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** ఉస్మానియా యూనివర్శిటీ అంతర కళాశాల మహిళా బ్యాడ్మింటన్ టోర్నమెంట్ 2025, బాచుపల్లిలోని విజ్ఞాన జ్యోతి ఇన్సిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ఆధ్వర్యంలో, వీఎన్ఆర్‌విజెవిటి కొడే వెంకటాద్రి చౌదరి క్రీడా సముదాయంలో బుధవారం విజయవంతంగా ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంట్‌కు వీఎన్ఆర్‌విజిఐఈటి ఫిజికల్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీరామ్, ఉస్మానియా యూనివర్శిటి ప్రొఫెసర్ దీప్లా, విజెఐఎఎస్ డిప్యూటీ డైరెక్టర్ డా.ఎన్.అరుణ, విజెఐఎఎస్ ప్రిన్సిపల్ డా.రమలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా క్రీడాకారిణుల ప్రతిభను వెలుగులోకి తీసుకురావడానికి ఇది ఒక గర్వించదగిన వేదిక అని అన్నారు. ఈ పోటీల్లో మొత్తం 03 కాలేజీలు పాల్గొనగా, విల్లా మేరి, సెయింటన్స్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ ఫర్ ఉమెన్ సెమీ ఫైనలిస్టులుగా నిలిచాయి. అనంతరం అతిథుల చేతుల మీదుగా విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు.

## లోక్ అదాలత్‌లో కేసులు సత్వర పరిష్కారం

### శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** లోక్‌అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించుకునే అవకాశం ఉందని శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజల మధ్య సఖ్యత, శాంతి నెలకొల్పడం కోసం లోక్ అదాలత్ అనేది న్యాయవ్యవస్థలో ఒక వెలుగునిచ్చే దీపం అని అన్నారు. మేడ్చల్ కోర్టులో సెప్టెంబర్ 10 నుంచి 13 వరకు నిర్వహించే లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులు రాజీ పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి జీవితంలో తప్పులు చేస్తారని చాల సందర్భాల్లో తెలిసి, తెలియక ఆవేశంలో అనుకోకుండా గొడవలు జరుగుతాయని చెప్పారు. లోక్ అదాలత్‌లో ప్రజలకు దగ్గరగా ఉండే సులభమైన, న్యాయమైన మార్గం కేసులను త్వరగా ఖర్చులేకుండా పరిష్కరించుకునే వేదిక లోక్ అదాలత్ అని చెప్పారు. ప్రజలకు మేలు చేసి సమాజ శాంతి స్థాపించే మార్గమే లోక్ అదాలత్ అని తెలిపారు. ప్రజల సమయం, డబ్బు, శ్రమ ఆదా అవుతుందని అందుకే ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. లోక్ అదాలత్ ద్వార కేసులు త్వరితగతిన పరిష్కారం, ప్రజలకు న్యాయం అందించడం, కుటుంబ, ఆస్థి, ఇతర తగదాలకు శాంతియుత పరిష్కారం, సమాజంలో సఖ్యత పెంపొందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.



## కాలనీలలో శునకాల స్వైర విహారం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** పోచారం మున్సిపాలిటీలో కుక్కల బెడద విపరీతంగాపెరిగింది. నారపల్లి 14, 15, 16,17గల వార్డులలో కుక్కలు స్వైర విహారం చేస్తూ రోడ్లపై కాలనీలలో తిరగాలంటే భయంతో చస్తున్నామని వీధి కుక్కల బారి నుండి కాపాడాలని పోచారం మున్సిపల్ కమిషనర్‌కు కాలనీ ప్రజలు వినతి ప్రత్రాన్ని అందజేశారు. రాత్రింబవళ్లు కుక్కలు స్వైర విహారం పెరగడంతో చిన్న పిల్లలు మహిళలు కూడా వీధులలోకి వచ్చేందుకు భయపడుతూ వీధికుక్కలు పాదచారులను గాయ పరుస్తూ వీరగం సృష్టిస్తున్నాయి. రాత్రి సమయాలలో వాహనాలను వెంబడిస్తూ కరవడానికి వస్తున్నాయని వాహనాదారులు తీవ్రభయాందోళన వ్యక్తంచేస్తున్నారు. రోజుకు ఒకరిద్దరు చొప్పున కుక్కకాటు బాధితులు చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పోతున్నామని కాలనీ ప్రజలు తెలిపారు.దారి వెళ్ళాలంటే జనాలు భయపడుతున్నారని ముఖ్యంగా చిన్నపిల్లలు, మహిళలు ఒంటరిగా వెళ్ళాంటే కుక్కలను చూసి ఆగాల్సిందే. అందుకు పోచారం మున్సిపల్ కమిషనర్ ఇకనైనా కుక్కల బారినుండి కాపాడవలసింది నారపల్లి కాలనీవాసులు కోరుతున్నారు.

## మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

### ఎఐఎస్ఎఫ్



**ప్రజాపక్షం/కాప్రా:** నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఈగల్, నార్కోటిక్, ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఎలైట్ యాక్షన్ గ్రూప్, డ్రగ్ కంట్రోల్ విభాగ అధికారులను సస్పెండ్ చేయాలంటూ మేడ్చల్ జిల్లా ఎఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. భగత్ సింగ్ స్ఫూర్తితో డ్రగ్స్, గంజాయి వినియోగాలకు వ్యతిరేకంగా పోరాడుతామన్నారు. భగత్‌సింగ్ 118వ జయంతి సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి సల్మాన్‌బేగ్, సత్యప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఇసిఐఎల్ అంబేద్కర్ కూడలి నుండి జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ వరకు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినదిస్తూ ప్లేకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. చర్లపల్లిలోని ఫాక్టరీలో రసాయనాల మాటున డ్రగ్స్ తయారీ అవటాన్ని ముంబయి పోలీసులు దాడి చేసిన ఉదంతంతో బయట పడటం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్‌కు చెందిన గిరిబాబు, మోసిన్, శేఖర్, సమీర్, శివ, చేతన్, నరేష్, రమ్య, రవళి, సుజాత,హస్మిత బేగం, మహేష్, అజీమ్ పాషా, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ జరగకుండా జాగ్రత్త పడుతాం

### సమస్యలు పరిష్కరించాలని నవోదయ ఇండస్ట్రియల్ అసోసియేషన్ ప్రభుత్వానికి వినతి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని నవోదయ ఇండస్ట్రియల్‌లో ఇటీవల డ్రగ్స్ పట్టుబడడంతో అసోసియేషన్ సభ్యులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. నవోదయ ఇండస్ట్రియల్ ఏరియాలో డ్రగ్స్ విషయంలో అసోసియేషన్ సభ్యులు తీవ్రంగా ఖడిస్తూ ఇలాంటి సంఘటనలు ఇకముందు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.నవోదయ ఇండస్ట్రీయల్‌లో సుమారు 12 వందల సూక్ష్మ,చిన్నచిన్న పరిశ్రమలు ఉన్నాయని 4 వేల మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు.

2012 సంవత్సరం నుండి ప్రభుత్వ అధికారులకు,మంత్రులకు మా సమస్యలు విన్నవించుకుంటున్నామని, 2018 సంవత్సరంలో ఇట్టి లేఅవుట్‌ను మాన్యుప్యాక్చరింగ్‌లో ఉంది తగు అనుమతులు ఇవ్వవలసిందిగా అధక్ష్య,కార్యదర్శులు నారాయణరెడ్డి,ఆనంద్‌కుమార్‌లు కోరారు.గత కొన్ని సంవత్సరాల నుండి ప్రపార్టీ టాక్స్,బిల్డింగ్ పర్మిషన్ ఫీజులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని కానీ ప్రభుత్వం నుండి స్పందన కరువైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి నవోదయ ఇండస్ట్రియల్ ఏరియా సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఈ కార్యక్రమంలో కె శ్రీరామ్, సుధాకర్‌రెడ్డి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ యువతకు స్ఫూర్తిదాయకం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి/మల్కాజిగిరి :** సమాజంలోని అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ నేటి యువతకు స్ఫూర్తి దాయకమని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్ లో జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాకలి ఐలమ్మ సామాజిక సమానత్వం కోసం తన జీవితాన్ని త్యాగం చేసారన్నారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ అధికారి ఝాన్సిరాణి, జిల్లా మైనార్టిస్ వెల్ఫేర్ అధికారి కాంతమ్మ, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్ వివిధ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. **మల్లాపూర్‌లో...** ఎలిఫెంట్ సర్కిల్ వద్ద జరిగిన ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో నెమలి అనిల్ కుమార్‌తో పాటు వివిధ పార్టీ నేతలు పాల్గొన్నారు. **ఈసిఐఎల్ చౌరాస్తాలో** ఐలమ్మ కాంస్య విగ్రహానికి కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **గౌతంనగర్‌లో...**గౌతంనగర్ డివిజన్‌లోని జ్యోతినగర్ ధోభిఘాట్‌లో సిపిఐ మల్కాజిగిరి మండల సమితి ఆధ్వర్యంలో జరిగిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు సిహెచ్ దశరథ్, టి.యాదయ్య, కాసర్ల నాగరాజు, యాదగిరి, కళాకారు లు వెంకటాచారి, నరసింహ, జంగయ్య, రాములు, లింగం, రజక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.







**చర్లపల్లిలో:** తెలంగాణ రజక సమితి ఆధ్వర్యంలో ఇసిఐఎల్ చౌరస్తాలోని చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంఎల్ఎ బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్లు సింగిరెడ్డి శిరీషా సోమశేఖర్‌రెడ్డి, బొంతు శ్రీదేవి, ప్రభుదాస్‌లు ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, రజక సమితి నాయకులు, తదితరులు పాల్గొన్నారు. **కూకట్‌పల్లిలో:** జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి బండి రమేష్ అన్నారు. మూసాపేట్‌లోని ఆమె విగ్రహానికి బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఐలమ్మ వర్ధంతిని స్వయంగా ప్రభుత్వమే నిర్వహించడం అభినందించదగ్గ విషయమని అన్నారు. చాకలి ఐలమ్మ పేరు మీద యూనివర్శిటీ ఏర్పాటు చేయడం ఆమెకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఎఎంసి చైర్మన్ పుష్ప రెడ్డి, ధోబిఘాట్ ప్రెసిడెంట్ యాదగిరి, మూసాపేట్ డివిజన్ ప్రెసిడెంట్ సతీష్ గౌడ్, చున్ను పాష, ప్రకాష్ ముదిరాజ్, కొండల్, తదితరులు పాల్గొన్నారు.





## ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం

### ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



**ప్రజాపక్షం/దోమ:** పరిగి నియోజకవర్గంలోని దోమ మండల కేంద్రాంలోని రైతు వేదికలో మండల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సన్మానించి, అవార్డులను ప్రధానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ అభివృద్ధికి పునాది విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషిఅపారమైన, ఇటువంటి అవార్డులు ఉపాధ్యాయుల కృషితో అనేక మంది విద్యార్థుల భావిష్యత్తును తీర్చిదిద్దుతూ, సమాజానికి వెలుగునిచ్చే దారిగా నిలుస్తారని అన్నారు. ఉపాధ్యాయుల త్యాగం సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కి బాద్యత అని తెలిపారు. మరుతున్న టెక్నాలజీని అందిప్పుచుకుని అందుకు అనుగుణంగా విద్యార్థులకు బోదించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్ ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి , ఎంపిడిఓ గ్యామా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు నియోజకవర్గం యాలాల మండల పరిధి గంగసాగర్,అన్నాసాగర్ గ్రామాలకు చెందిన బిఆర్ఎస్ నాయకులు తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రె స్ పార్టీలో చేశారు. పార్టీలో చేరిన వారికి ఎంఎల్ఎ మనోహర్‌రెడ్డి పార్టీ కండువలు కప్పి పార్టీలో ఆహ్వానించారు.ఈ సందర్భం గా ఎంఎల్ఎ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభు త్వం చేపడుతున్న సంక్షేమ పథకాల కు ఆకర్శితులై నేడు ఎంతో మంది ముందుకు వచ్చిన కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారిలో యాద య్య, సుకుమార్, నర్సిములు, సుధాకర్, తదితరులు ఎంఎల్ఎ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.



## ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు కృషి

### పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని వివేకానందనగర్‌లోని కార్యాలయంలో ప్రగతినగర్ కాలనీ వాసులు పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీని కలిసి కార్పొరేటర్ హమీద్ పటేల్‌తో ఆధ్వర్యంలో పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ త్వరలోనే ప్రగతినగర్ కాలనీలో పర్యటించి పెండింగ్‌లో ఉన్న పనులు త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కాలనీలలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించి, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి నగర్ కాలనీ ప్రెసిడెంట్ తిరుపతిరావు, ఉపాధ్యక్షులు బాబురావు, కోశాధికారి రాము, జనరల్ సెక్రటరీ విజయ్ కుమార్, జాయింట్ సెక్రటరీ ప్రేమ్‌రాజు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.6కోట్ల 38లక్షలు విలువైన వడ్లు స్వాహా

### ప్రభుత్వానికి కుచ్చుటోపి పెట్టిన మాయగాళ్లు...

**ప్రజాపక్షం/తాండూరు:** ఓ రైసు మిల్లు యాజమాని మాయజాలం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏకంగా ప్రభుత్వానికే కుచ్చుటోపి పెట్టారు ఆ మాయగాళ్ళు.

వివరాలలోకి వెళితే రైతుల వద్ద నుండి ప్రభుత్వం సేకరించిన వడ్లను బియ్యంగా మార్చేందుకు గాను రైసు మిల్లు యాజమానికి ఇచ్చిన రూ.6కోట్ల 38లక్షల విలువైన వడ్లను స్వాహా చేసిన రైస్ మిల్లు యాజమాని బండగారం ఆలస్యంగా బయటపడింది.

### రైసు మిల్లు యాజమాని మాయజాలం...

పూర్తి వివరాలోకి వెళ్లితే వికారాబాద్ జిల్లా యాలాల మండలం చెన్నారం సమీపంలో ఉన్న కృష్ణసాయి రైస్ మిల్లు యాజమాని రవిగౌడ్ వద్ద నుండి సంతోష్‌కుమార్, చల్లా వెంకటేశ్వర్ అనే ఇద్దరు వ్యాపారులు రైస్‌మిల్లును లీజుకు తీసుకున్నారు. కాగా పౌరసరఫరాల శాఖ అధికారులు వడ్లను బియ్యంగా మార్చెందుకు లీజుదారులైన సమతోష్, చల్లా వెంకటేశ్వర్లతో ఒప్పందం కుదుర్చుకున్నారు.

ఈ క్రమంలో బియ్యం ఇంకా గోడౌన్‌కి చేరలేదని పౌరసరఫరాల శాఖ అధికారులు రైస్ మిల్లు యాజమాని రవిగౌడ్‌కు నోటీసులు ఇచ్చారు. నోటీసులతో అవాక్కైన రైస్ మిల్లు యాజమానికి రవిగౌడ్ రైస్ మిల్లును లీజుకు తీసుకున్న వారితో మాట్లాడగా వడ్లు మాయమైన విషంయం తెలుసుకున్నాడు.

దీంతో లీజు దారులు చేసిన మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం వడ్లను మాయం చేసిన లీజు దారులను ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం

## యూరియా సరఫరాలో సర్కార్ ఫెయిల్

### మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** రైతులకు యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న సొంత జిల్లాలోనే రైతులు ప్రతి రోజు యూరియా కోసం రోడ్డేక్కాల్సిన పరిస్థితి దాపురించిందని దుయ్యబట్టారు. రైతులకు సరిపడ యూరియా సరఫరాలో రేవంత్ సర్కార్ ఫేయిల్ అయిందని విమర్శించారు. పంట పొలాల్లో పనులు మానుకుని రైతులు ఎరువులకోసం తిరగాల్సిన దుస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకవచ్చిందని అన్నారు. రైతు సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ఏనాడు రైతులు యూరియా కోసం రోడ్డెక్కిన పాపాన పోలేదని, నేడు రైతులు రోడ్డెక్కిన ఘనత రేవంత్ సర్కార్‌కే దక్కిందన్నారు.

కెసిఆర్ ప్రభుత్వ ఆహయంలో ఎరువులు కొరత రాకుండ చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. రైతుల ఆందోళనలు పట్టించుకోని ప్రభుత్వానికి రైతు లు సరైన సమయంలో తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. యూరియా కోసం బిజెపి నాయకులు మాట్లాడక పోవడం శోచనీయమని, రుణమాఫీ కాక, రైతు భరోసా అందక రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పిదంచాలని, రైతులకు తక్షణ మే అవసరమైన యూరియాను అందించాలని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

## నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

### ఆహార కమిషన్ చైర్మన్



**ప్రజాపక్షం/కోట్‌పల్లి:** విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని రాష్ట ఆహర కమిషన చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం కోట్‌పల్లి మండల కేంద్రలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ పాఠశాల అంగన్‌వాడి, చౌక ధర దుకాణాలను కమిషన్ సభ్యులు భారతి, శారద, ఆనంద్‌లతో కలిసి రాష్ట అహర కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి సందర్శంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు, అంగన్వాడీలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రణాళికబద్ధంగా మెనూ రుపొందించిదని, దానికి అనుగుణంగా మధ్యాహ్నం భోజనం అందించాలన్నారు. ప్రజల, విద్యార్థుల సమస్యలను తెలిపేందుకు పాఠశాల, చౌకధర దుకాణాల ఆవరణలో అధికారుల ఫోన్ నెంబర్లుతో కూడిన ఫిర్యాదు పట్టికను అమర్చాలని అధికారులకు సూచించారు. అంగన్‌వాడీలలో పిల్లలతో పాటు గర్భిణీలకు పోషకాహారాన్ని అందించాలని చైర్మన్ సూచించారు. ఎప్పటికప్పుడు రేషన్ నిల్వలను రిజిస్టర్లలో నమోదు చేయాలని అదేవిధంగా సరుకులపై గడువు తేదీని పరిశీలించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. మాతాశిశు సంరక్షణకార్డులో నమోదు చేసిన వివరాలను పరిశీలించిన కమిషన్ సభ్యులు సిబ్బందిని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన ప్రజలు మండల కేంద్రాంలో 24గంటలపాటు వైద్య సేవలు ఉండాలని అదేవిధంగా అంబలెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. కమిషన్ పర్యటనలో డిఆర్‌డిఓ శ్రీనివాస్ డిఇఓ రేణుకాదేవి , డిఎంహెంచ్ఓ లలితాదేవి, డిడబ్ల్యుఒ కృష్ణవేణి , జిల్లా పౌర సరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మెనేజర్ మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

**ప్రజాపక్షం/బొంరాస్‌పేట్:** కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట్ మండల పరిధిలోని బురాన్‌పూర్ గ్రామానికి చేందిన ఉస్మానియా యూనివర్సిటీ ఎల్‌ఎల్‌బి విద్యార్థి నరసింహగౌడ్ మండల పరిధిలోని లింగంపల్లి పాఠశాలలె 50మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఇఒ హరిలార్ , ప్రధానోపాధ్యాయులు, వెంకట్‌రెడ్డి, శ్రీహరి, రవీందర్‌గౌడ్,మల్లయ్య , చంద్రశేఖర్ , అనిల్ కుమార్, నరేష్, విద్యార్థులు పాల్గోన్నారు.

# క్రీడ

## అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్ విధ్వంసం..
## యుఎఇపై భారత్ ఘన విజయం!



ఆసియా కప్ 2025 టోర్నీని భారత్ ఘనంగా ప్రారంభించింది. పసికూన యుఎఇతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. పూర్తిగా ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ముందుగా బౌలింగ్‌లో నిప్పులు చెరిగిన భారత్.. ఆ తర్వాత బ్యాటింగ్‌లో బౌండరీల మోత మోగించింది. టీ20ల్లో వరల్డ్ ఛాంపియన్ అయిన భారత్‌కు యుఎఇ కనీస పోటీని కూడా ఇవ్వలేకపోయింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన యూఏఈ 13 ఓవర్లలో 57 పరుగులకు కుప్పకూలింది. ఓపెనర్ అలిషన్ షరఫు(17 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 22), కెప్టెన్ ముహమ్మద్ వసీం(22 బంతుల్లో 3 ఫోర్లతో 19) మినహా అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. భారత వెటరన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్(4/7), పేస్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే(3/3) అద్భుత బౌలింగ్‌తో యూఏఈ పతనాన్ని శాసించారు. జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం భారత్ 4.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 60 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. అభిషేక్ శర్మ(16 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 30), శుభ్‌మన్ గిల్(9 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 20 నాటౌట్), సూర్యకుమార్ యాదవ్(2 బంతుల్లో సిక్స్‌తో 7 నాటౌట్) మెరుపులు మెరిపించారు. యుఎఇ బౌలర్లలో జునైద్ సిద్దిఖి ఒక వికెట్ తీసాడు. అభిషేక్, గిల్ ధాటికి 93 బంతులు మిగిలి ఉండగానే భారత్ లక్ష్యాన్ని ఛేధించింది.

**అభిషేక్ శర్మ, గిల్ విధ్వంసం..** 58 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో భారత విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ భారీ సిక్స్‌తో ఇన్నింగ్స్ ప్రారంభించాడు. హైదర్ అలీ బౌలింగ్‌లో ఎదుర్కొన్న తొలి బంతినే స్టేడియం బయటకు పంపించాడు. ఆ మరుసటి బంతిని బౌండరీ తరలించాడు. ఆ తర్వాతి నాలుగు బంతులు డాట్ కావడంతో తొలి ఓవర్‌లోనే 10 పరుగులు వచ్చాయి. ముహమద్ రోహిద్ ఖాన్ వేసిన రెండో ఓవర్‌లో శుభ్‌మన్ గిల్ ఓ బౌండరీతో పాటు సిక్సర్ బాదాడు. ధ్రువ్ పరాశర్ వేసిన మూడో ఓవర్‌లో అభిషేక్ శర్మ వరుసగా 6, 4 బాదడంతో టీమిండియా 3 ఓవర్లలోనే 38 పరుగులు చేసింది. జునైద్ సిద్దిఖీ వేసిన నాలుగో ఓవర్‌లో అభిషేక్ శర్మ ఓ భారీ సిక్స్ బాది అదే జోరులో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. దాంతో తొలి వికెట్‌కు నమోదైన 48 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి వచ్చిన సూర్యకుమార్ యాదవ్ ఎదుర్కొన్న తొలి బంతినే భారీ సిక్సర్‌గా మలిచాడు. సిమర్జిత్ వేసిన ఐదో ఓవర్ మూడో బంతిని శుభ్‌మన్ గిల్ బౌండరీ బాది భారత విజయాలాంఛనాన్ని పూర్తి చేశాడు.

## తొలి రౌండ్లోనే సింధు నిష్క్రమణ..
## ప్రణయ్, లక్ష్యసేన్ ముందంజ..!

గత ఏడాది కాలంగా మేజర్ టైటిల్ కోసం నిరీక్షిస్తున్న పివి సింధు మరోసారి నిరాశపరిచింది. హాంకాంగ్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్ తొలి రౌండ్‌లోనే ఓటమి పాలైంది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్‌లో డెన్మార్క్‌కు చెందిన లినే క్రిస్టోఫెర్సెన్ చేతిలో సింధు అనూహ్యంగా కంగుతిన్నది. గతంలో లినేను ఐదుసార్లు చిత్తు చేసిన భారత స్టార్ ఈసారి మాత్రం చేతులెత్తేసింది. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్ ముందంజ వేశారు. ఈ మధ్యే ముగిసిన బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో రెండో సీడ్‌పై గెలుపొందిన సింధు హాంకాంగ్ ఓపెన్లోనూ పేలవ ఆటకు మూల్యం చెల్లించుకుంది. ఆరంభంలో దూకుడుగా ఆడి 21–15తో తొలి సెట్ గెలుపొందినప్పటికీ అదే దూకుడు కొనసాగించలేక ప్రత్యర్థికి అవకాశమిచ్చింది. రెండో సెట్‌లో పుంజుకున్న లినే 16–21తో పైచేయి సాధించింది. నిర్ణయాత్మక మూడో సెట్‌లో సింధు పోరాడినప్పటికీ 19–21తో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ షట్లర్లు హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్, కిరణ్ జార్జ్, ఆయుష్ శెట్టిలు తమ రాకెట్ పవర్ చూపించారు. చైనాకు చెందిన గాంజ్ జూను మట్టికరిపించి ప్రణయ్ రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు. టీ.డబ్ల్యూ. వాంగ్‌ను 22–20, 16–21, 21–15తో ఓడించి సేన్ ముందంజ వేశాడు. యువకెరటం జార్జ్ సైతం ప్రత్యర్థి టీ.జేసన్‌కు చెక్ పెట్టి రెండో రౌండ్‌లో అడుగుపెట్టాడు.





## స్కూల్‌గేమ్స్ కబడ్డీ జట్టుకు ఎస్ఆర్‌డిజి స్కూల్ విద్యార్థులు

**హైదరాబాద్:** ఘటకేసర్‌లో జరగనున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గేమ్స్‌లో జిల్లా జట్టుకు బోడుప్పల్ ఎస్ఆర్‌డిజి పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. బాలికల అండర్ 17 విభాగంలో శ్రావణి, లాస్య, బాలుర అండర్ 14 విభాగంలో నవదీప్ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ బిఎన్‌ఎల్ శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి జట్టుకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు.

ఫోకస్

## అణు సిద్ధాంతవేత్త ఎపిక్యూరస్



క్రీస్తుపూర్వం 3వ శతాబ్దంలోనే అణు సిద్ధాంతాన్ని ప్రకటించిన గొప్ప దార్శనకుడు ఎపిక్యూరస్. ఏథెన్స్‌లో జీవించిన ఈ గ్రీకు తత్వవేత్త అణు సిద్ధాంతాన్ని, పరిణామ సిద్ధాంత భావనలను బలంగా ప్రచారం చేశాడు. మతం అనేది మూఢ నమ్మకమని తేల్చిచెప్పాడు. 'ఎపిక్యూరియన్' తత్వాన్ని ప్రతిపాదించాడు. జీవితం ఆనందకరమైనదని, భయంతో బతకాల్సిన అవసరం లేదని ఆకాలంలోనే ఎపిక్యూరస్ తేల్చిచెప్పాడు. రకరకాల మూఢ నమ్మకాలతో మనిషి నిత్యం భయంతో బతకడాన్ని ఆరోజుల్లోనే గుర్తించిన అతను, అలాంటి ఆలోచనా విధానాన్ని మానుకోవాలని ప్రజలకు హితవు పలికాడు. ఏథెన్స్‌లో 'ది గార్డెన్' పేరుతో సొంతంగా విద్యాలయాన్ని నెలకొల్పి, తాను ప్రతిపాదించిన కొత్త తత్వాన్ని బోధించాడు. పరమాణువు గురించిన ప్రస్తావన చేసిన తొలితరం మేధావుల్లో ఎపిక్యూరస్ ఒకడు. భూమి, వాయువు, నీరు, అగ్ని అనే నాలుగు మూలకాలను విశ్వనిర్మాణంగా భావించే రోజుల్లో, అందుకు భిన్నమైన పరమాణు సిద్ధాంతాన్ని అతను ప్రతిపాదించాడు. తర్వాతి కాలంలో రోమన్ కవి లుక్రీషిస్ ఇదే సిద్ధాంతాన్ని కొంత విస్తృత పరచి, 'ఆన్ ది నేచర్ ఆఫ్ థింగ్స్' అనే పుస్తకాన్ని రాశాడు. అందులో ఎపిక్యూరస్ సిద్ధాంతాన్ని విశ్లేషించాడు. ఈ విశ్వం మొత్తం పరిమితమైన పదార్థాలతో రూపుదిద్దుకుందని ఎపిక్యూరియస్ భావించాడు. అదే విధంగా మనకు కనిపించని కొన్ని పదార్థ కణాలతో ప్రపంచం కూడుకున్నదని నమ్మాడు. ఈ కూర్పు ఎప్పటికప్పుడు మారుతూ, కొత్తకొత్త ప్రక్రియలకు బీజం వేస్తుంటుందని అభిప్రాయపడ్డాడు. ఆ రోజుల్లో విపరీతంగా ఉన్న 'భగవంతుడు' అనే నమ్మకాన్ని కూడా అతను లోతుగా విశ్లేషించాడు. దేవుళ్ల ప్రకృతిలో భాగమే తప్ప, జీవితాలపై వారిపై ఎలాంటి ప్రభావం చూపలేని స్పష్టం చేశాడు. ఒక రకంగా గ్రీకు 'అథీయిజం'తో ఎపిక్యూరియస్ తత్వానికి చాలా దగ్గరి పోలికలు ఉన్నాయి. మొత్తం మీద ఎపిక్యూరస్ తన సమకాలీనులు ఎవరూ ఊహించలేని రీతిలో విప్లవాత్మకమైన శాస్త్రీయ దృష్టిని ప్రతిపాదించాడు. ఆయన తత్వం పదార్థవాదానికి, వైవిధ్యమైన సోచనలకు, మానవ వివేకానికి పునాదులు వేసింది.

## తవ్వినకొద్దీ ఆధారాలు!



ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో తవ్వినకొద్దీ చారిత్రక ఆనవాళ్లు ఎన్నో బయటపడుతున్నాయి. తుర్కియే (టర్కీ)లోని కైసెరి ప్రాంతంలో లభించిన టెరాకోటా స్నాన పాత్రలు ఈ కోవకు చెందినవే. వీటిని క్రీస్తుపూర్వం 17 నుంచి 19వ శతాబ్దం మధ్యకాలానికి చెందినవిగా పరిశోధకులు పేర్కొంటున్నారు. ఆ ప్రాంతంలో, రాతి శిలా యుగపు హటియన్స్ నుంచి కాంస్య యుగంలోని హిటియాన్స్ వరకూ చరిత్ర కొనసాగిందని అంటున్నారు. ఫ్రిజియన్, సెల్జుక్, ఒట్టోమన్ టర్క్స్ తదితర సామ్రాజ్యాలు ఇక్కడ విరాజిల్లాయి. హిటియాన్స్, ప్రాచీన ఆస్సిరియన్ సంస్కృతుల్లో, ఇలాంటి స్నాన పాత్రలను వాడేవారని ప్రాథమిక అంచనా. ఇక్కడ లభించిన టెరాకోటా పాత్రలు సాధారణంగా నిండుగా ఉండే ఆకృతులే. కళాకృతులను వాటిపై చెక్కడాన్ని గమనించవచ్చు. అదే సమయంలో పాత్రలు విరిగిపోకుండా, మన్నిక కలిగి ఉంటాయి. శిల్పకారులు ఈ స్నాన పాత్రలను రూపొందించడానికి మృద్రాంగ (టెరాకోటా) మట్టి ఉపయోగిస్తారు. వాటిని చక్కటి ఆకృతిగా రూపుదిద్ది, కొంత విభిన్నమైన రంగులు, స్థానిక పదార్థాలతో పూత వేసేవారు. కొన్నిసార్లు పై భాగంలో చిన్న అలంకారిక రూపకాలను కూడా తీర్చిదిద్దారు. కొన్ని పాత్రలు జూమోర్ఫిక్ (పశుపక్షి రూపు) వంటి సృజనాత్మక ఆకృతుల్లో కూడా కనిపిస్తున్నాయి. ఇవి హిటియాన్స్ కళా సంస్కృతి రంగాన్ని ప్రతిబింబిస్తాయి. కాగా, ఈ పాత్రలు ఆ కాలంలో నీటిని నిలువ ఉంచే విధానం, ఉపయోగించే పరిస్థితులు తెలుసుకోవాడానికి ఇలాంటి స్నాన పాత్రలు ఉపయోగపడతాయి. ప్రతి ఇంట్లోనూ నిత్యావసరంగా వీటి వాడకం ఉండేదని తెలుస్తున్నది. కొన్ని సందర్భాల్లో పూజా మందిరాల్లోనూ ఈ టెరాకొటా పాత్రలను వాడతారు. ఈ పాత్రలు వారి జీవనశైలి, శుభ్రత, క్రతువుల నెరవేర్పునకు నిదర్శనంగా ఉన్నాయి. సుమారు 4000 సంవత్సరాల క్రితం కూడా ప్రజలు ఇంతటి మన్నికైన పాత్రలు వాడారంటే ఆశ్చర్యం కలిగక మానదు.

## నమ్మకం నిజమైంది!



స్థానికంగా ప్రజల్లో ఒక బలమైన నమ్మకం నిజమేనని పరిశోధనల్లో రుజువుకావడం విశేషం. తమ పూర్వీకులు మాంటానా ప్రాంతంలో సుమారు 18,000 సంవత్సరాలుగా జీవిస్తున్నారని 'బ్లాక్‌ఫీట్' జాతి ప్రజలు శతాబ్దాలుగా నమ్ముతూ వచ్చారు. దీనిపై విస్తృత పరిశోధనలు జరిగాయి. చివరికి విప్లవాత్మక డిఎన్‌ఏ పరిశోధన ద్వారా వారు నమ్మకం నిజమేనని రుజువైంది. జెనెటిక్ విశ్లేషణ ఈ విషయాన్ని నిర్ధారించింది. అంటే, లిఖిత చరిత్ర ప్రారంభానికి చాలా ముందే, ఈ భూమిపై తమ ఉనికి ఉందన్న వారి నమ్మకాన్ని ధ్రువీకరించింది. తరతరాలుగా జాగ్రత్తగా కాపాడుకున్న మౌఖిక చరిత్రలు ఇప్పుడు శాస్త్రీయ ఆధారాలతో అనుసంధానంకావడం విశేషం. ఈ పరిశోధన బ్లాక్‌ఫీట్ ప్రజల పూర్వీకుల భూమితో ఉన్న లోతైన బంధాన్ని మరింత బలపరిచింది. ఇది కేవలం శాస్త్రీయ ఆవిష్కరణ మాత్రమే కాకుండా, వారి సంస్కృతి, వారసత్వం, సహనశక్తి, అక్కడి నేలపై తమకు ఉన్న అనుబంధాన్ని అద్భుతంగా ప్రతిబింబించింది. కాగా, ఈ ఫలితాలు ఉత్తర అమెరికాలోని మానవ వలసలపై ఇప్పటివరకు ఉన్న అనేక పాత ఊహాగానాలను సవాలు చేస్తున్నాయి. ఇప్పటి వరకు భావించిన దానికంటే చాలా ముందుగానే ఆదివాసీ సమాజాలు స్థిరమైన నివాసాలను ఏర్పరుచుకున్నారని ఈ పరిశోధన స్పష్టం చేసింది. బ్లాక్‌ఫీట్ ప్రజల మౌఖిక సంప్రదాయాలు, ఆచారాలు, జ్ఞాపకాలు తదితరాలన్నీ కేవలం కథలు కాదని, శాస్త్రం కూడా అంగీకరించిన సత్యాలు అని నిరూపించింది.

# భావితరాలకు స్ఫూర్తి 'ఐలమ్మ'

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం


సరూర్‌నగర్..


నల్లగొండ..


ఖమ్మం..

**ప్రజాపక్షం/నలగొండటౌన్ :** తెలంగాణ సాయుధ పోరాట వీరనారి, ధీరవనిత చిట్యాల ఐలమ్మ పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం వీరనారి చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్డులో గల రజక భవనం వద్ద రజక సంక్షేమ భవన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటంలో ముందు భాగాన నిలబడి ఐలమ్మ పోరాడిందన్నారు. కార్యక్రమంలో డిబిసిడిఓ రాజ్ కుమార్, ఎంబిసి జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ, బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మినారాయణ, నాగిళ్ళ మురళి, పిల్లి రామరాజు, పంకజ్ యాదవ్, కరీంపాషా, అయితగోని యాదయ్య, పగిల్ల సైదులు పాల్గొన్నారు.

**వరంగల్ :** చాకలి ఐలమ్మ స్ఫూర్తితో సమాజ మార్పునకు పోరాటాలు కొనసాగిస్తామని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్‌మియా అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వరంగల్ తమ్మెర భవన్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, జిల్లా నాయకులు పనాస ప్రసాద్, వరంగల్ మండల కార్యదర్శి గుండె భద్రి, జిల్లా కౌన్సిల్ సభ్యులు సంఘీ ఏలేందర్, ల్యాదళ్ల శరత్, ఓర్సు రాజు, ఎండి అక్బర్ పాషా, మహేష్, స్వేత, చిరంజీవి, రాజేష్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

**బిసి హక్కుల సాధనసమితి ఆధ్వర్యంలో..** వీరనారి చాకలి ఐలమ్మ అందించిన పోరాట స్ఫూర్తితో సంఘటితంగా పోరాడి రాజ్యాధికారాన్ని సాధించాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. బుధవారం వరంగల్ పోచమ్మ మైదాన్ సెంటర్‌లో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ వరంగల్ మండల కార్యదర్శి గుండె బద్రి, బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు వలబోజు వెంకన్న, బుస్స రవీందర్ , పరికిరాల రమేష్, రహేల సుధీర్, దస్రూ, సాంబయ్య, మహేష్, శ్వేత, రాజేష్, లడ్డు, సునీల్, ఆనంద్, స్వాతి పాల్గొన్నారు.

**ఖమ్మం :** చిట్యాల (చాకలి) ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా ఉద్యమ నిర్మాణం జరగాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. తెలంగాణలో నైజాం రక్కసి పాలనకు వ్యతిరేకంగా జమీందారి, జాగీర్‌దారి తనంపై ఐలమ్మ వీరోచిత పోరాటం నిర్వహించారని ఆయన తెలిపారు. ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం సిపిఐ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ప్రాణాలకు, మానాలకు రక్షణ లేని పరిస్థితుల్లో ఐలమ్మ చూపిన తెగువ, చేసిన పోరాటం వెలకట్టలేనిదన్నారు. తెలంగాణ విముక్తి ఉద్యమంలో ఐలమ్మ లాంటి అనేక మంది వీరోచిత పోరాటాలు నిర్వహించడంతోనే నైజాం పాలన అంతమొందిందని హేమంతరావు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, మహ్మద్ సలాం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, దొండపాటి రమేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

**దేవరకొండ :** దొరల గడిలను కూల్చిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మైనోద్దీన్, సిపిఐ మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, వెంకట్రాములు, వెంకటేశ్వర్లు, రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, లింగం, భూపాల్‌రెడ్డి, పుల్లయ్య, జమిల్, శ్రీను తదితరులు ఉన్నారు.

**సరూర్‌నగర్ :** తెలంగాణ సాయుధ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ చూపిన ధైర్య సాహసాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్‌గౌడ్ అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం ఆర్‌కెపురంలో ఐలమ్మ వర్ధంతిని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నర్సింహా ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభాకర్‌గౌడ్ హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాల నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం అలుపెరగని పోరాటం చేసిన ఐలమ్మను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు ఎండి.ఫైమిదా, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారగోని ప్రవీణ్ కుమార్‌గౌడ్, రజక వృత్తి దారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యధర్శి బొడ్డుపల్లి కృష్ణ, సిపిఐ మాజీ ఎంపిటిసీ ఆర్.గోపాల్, జోజి, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గ్యార క్రాంతికుమార్, ఎఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



దేవరకొండ...



వరంగల్..



## అంగన్‌వాడీ సిబ్బందికి కనీస వేతనాలు

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్ డిమాండ్

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌లకు కనీస వేతనాలు అందజేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఇచ్చోడ మండల మహాసభ జిల్లాకేంద్రంలోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది చిన్నారులకు, కిశోర బాలికలకు, బాలితలకు, గర్భిణీలకు అనేక రకమైన సేవలందిస్తున్నారన్నారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌లకు వారు అందిస్తున్న సేవలకు తగ్గట్టు వేతనాలు అందజేయాలన్నారు. ఈనెల 13న నిర్వహించనున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా మహాసభలకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఇచ్చోడ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇచ్చోడ మండల అధ్యక్షురాలిగా వజ్రమాల, ప్రధాన కార్యదర్శి టి.స్వప్న, కోశాధికారి అనసూయలను ఎన్నుకున్నారు. సమావేశంలో ఎఐటియుసి డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, ఇచ్చోడ మండల ఎఐటియుసి కార్యదర్శి కల్లేపల్లి గంగయ్య, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.




## నేటితరానికి తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర

### సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపు

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్ :** భూమికోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం అలుపెరగని పోరాటం చేసిన నాటి తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల జీవిత చరిత్రను నేటి తరానికి అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం ధర్మభిక్షం భవన్‌లో దంతాల రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు మేరకు సెప్టెంబర్ 11 నుండి 17 వరకు సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆయన కోరారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాటాల వారోత్సవాలు జిల్లా కేంద్రంలో తెలంగాణా సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మబిక్షం చౌక్ వద్ద గురువారం ప్రారంభమవుతాయని తెలిపారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, కౌన్సిల్ సభ్యులు బొమ్మగాని శ్రీనివాస్, చామల అశోక్ కుమార్, రేగట్టి లింగయ్య, దీకొండ శ్రీనివాస్, ఎండి పాషా, ఎడెల్లి శ్రీకాంత్, దంతాల పద్మరేఖ, దేశగాని హేమలత, పొదిల వెంకటమ్మ పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## తుది జాబితా ఓటర్ లిస్టు విడుదల



**ప్రజాపక్షం/ఉండవెల్లి:** మండలంలో పూర్తిస్థాయిలో తుది జాబితా ఓటర్ లిస్టు విడుదల చేసినట్లు ఒక ప్రకటన తెలిపారు. మండలంలోని 15 గ్రామ పంచాయితీలో పురుషులు 11069 మంది స్త్రీలు 11539 మంది మొత్తం 11069 మంది స్త్రీలు 11539 మంది మొత్తం ఓటర్లు 22,610 ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం పోలింగు స్టేషన్లో 42 జడ్పిటిసి పోలింగ్ స్టేషన్లో 42 ఉన్నట్లు 42 ఉన్నట్లు 500 ఓటర్లకి ఒక పోలింగు స్టేషన్ చొప్పున 19 పోలింగ్ స్టేషన్లో ఉన్నట్లు ఓటర్లు ఎక్కువగా ఉన్న గ్రామ పంచాయితీలో 5 వందల ఒకటి నుంచి 700 ఓటర్ల వరకు ఉన్న 33 పోలింగ్ స్టేషన్లో ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తుది జాబితా లిస్టును విడుదల చేసి అధికారులకు పంపడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.




## సమాజంలో మార్పు తెచ్చేందుకు అందరి కృషి అవసరం

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రభుత్వ ఉద్యోగులు సమాజంలో మార్పు తెచ్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తదుపరి జిల్లా, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ 40వ వర్థంతి కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా జిల్లా కలెక్టర్ పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో రైతాంగ పోరాటంలో భాగంగా, అన్యాయానికి వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడి చాకలి ఐలమ్మ పోరాటం చరిత్రలో నిలబడిపోతుందని ఆమె త్యాగాలు, పోరాట స్ఫూర్తి భావితరానికి దిశానిర్ధేశం చేస్తాయన్నారు. గతంలో సమాజంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో వాటి నుంచి బయటికి రావటానికి మహనీయులు ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేశారని అట్టి విషయాలు భావితరాలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిబిసిడిఓ నరసింహారావు, డిపిఓ యాదగిరి, డిఎస్‌డిడిఓ దయానందరాణి, టిఎన్‌జిఓ సెక్రటరీ దున్నా శ్యామ్, బిసి సంఘాల నాయకులు చల్లమల్ల నరసింహ, బంటు కృష్ణ, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, పద్మ, శ్రీదేవి, ఎంఆర్‌పిఎస్ నాయకులు చిన్న శ్రీరాములు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బుద్ధవనం సందర్శన గొప్ప అనుభూతి

### సందర్శించిన పల్నాడు కలెక్టర్, ఎస్‌పి



**ప్రజాపక్షం/నందికొండ:** తెలంగాణ టూరిజం నాగార్జునసాగర్ లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన బుద్ధవనాన్ని బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, సూపరిటెంట్ ఆఫ్ పోలీస్ కంచి శ్రీనివాస రావు సందర్శించారు. నాగార్జునసాగర్ సందర్శనలో భాగంగా నాగార్జునసాగర్ ప్రధాన డ్యామును సందర్శించిన అనంతరం వారు బుద్ధవనం చేరుకొని బుద్ధ చరితవనంలోని బుద్ధ పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు.బుద్ధవనం మహాస్థూపం లోని సమావేశ మందిరంలో బుద్ధవనం ప్రాజెక్టుకు సంబంధించిన వీడియోని వీక్షించారు. అనంతరం మహా స్థూపం అంతర్భాగంలోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతిని వెలిగించారు.. వీరికి బుద్ధవనం ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర పంచశీల కండువాలతో సత్కరించి బుద్ధవనం విశేషాలను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ బుద్ధవనం సందర్శన గొప్ప అద్భుతమైన అనుభూతిని అందించిందన్నారు. దమ్మ ఆశయాన్ని బుద్ధ వనంలో కనిపించేలా ఇక్కడి నిర్మాణాలు ఉన్నాయన్నారు. బుద్ధ వనంలోని మహాస్థూప నిర్మాణం భారతీయ ఇంజనీర్ల నైపుణ్యానికి అద్దం పడుతుందన్నారు. వీరితోపాటు ఆర్‌డిఓ మురళీకృష్ణ,అగ్రికల్చరల్ జాయింట్ డైరెక్టర్ జగ్గారావు, స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## ఆగిన కృష్ణమ్మ పరవళ్ళు

### సాగర్ ప్రాజెక్ట్ మొత్తం గేట్లు మూసివేత

**ప్రజాపక్షం/నందికొండ:** కొద్ది రోజులుగా శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు లక్షకు పైగా కొనసాగి న ఇన్ ఫ్లో నెమ్మదిగా తగ్గి 50 వేలకు చేరుకోవడంతో బుధవారం నాగార్జునసాగర్ జలాశయం గేట్లును పూర్తిగా మూసివేశారు.రిజర్వాయర్ పూర్తి స్థాయి గరిష్ట నీటిమట్టం 590 అడుగులకు బుధవారం సాయంత్రానికి 589.20 అడుగులుగా ఉండటంతో వస్తున్న 50 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో రిజర్వాయర్ పూర్తిస్థాయి గరిష్ట మట్టానికి చేరుకునేందుకు సరిపోనుండటంతో రిజర్వాయర్ గేట్లను పూర్తిగా మూసివేశారు.దీనితో రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థం 312.0450 టిఎంసిలకు 309.6546 టీఎంసీలుగా ఉన్నది. కుడి కాలువ ద్వారా 9700 క్యూసెక్కులు ఎడమ కాలువ ద్వారా 9349 క్యూసెక్కులు, ఎస్ ఎల్ బి సి ఎం ఆర్ పి ద్వారా 2400 క్యూసెక్కు ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 33495 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ కు 55244 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో గా వచ్చి చేరుతూ ఉంటే అంతే మొత్తాన్ని అవుట్ ఫ్లో గా దిగువకు విడుదలవుతుంది.

## రైతులకు యూరియా ఇవ్వలేని ప్రభుత్వం

### మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఎద్దేవా

**ప్రజాపక్షం/సూర్యాపేట :** రైతులకు యూరియా ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజల్ని రకరకాల సమస్యలు సృష్టించి ప్రజల్ని ఇబ్బంది పెడుతూ డైవర్షన్ చేస్తూ పబ్బం గడుపుకుంటుందని యద్దేవా చేశారు. గ్రూప్ వన్ విషయంలో రేవంత్‌రెడ్డి చేతకానితనం బయటపడింది కనుకనే తెలంగాణ యువత ముందు తలదించుకున్నాడని విమర్శించారు. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీతనం వహించాలి కాని కెసిఆర్‌ను తిట్టటం, కేసులు పెడతామనడం మానుకోవాలని హితవు పలికారు. ఈ ఫార్ములాలు పనికిమాలినవి, నీ ఫార్ములానే పనికిమాలిందన్నారు. నీ డైవర్షన్ ఫార్ములానే ఒక ఫాల్స్.. ఒక పూట మీడియాలో ఉంటే ఉండొచ్చుకానీ శాశ్వతంగా తెలంగాణ ప్రజలకు నీవు ద్రోహివిగానే మిగిలిపోతావ్‌ని జోస్యం చెప్పారు. మీ నాయకుడు ఇప్పుడు కండ్లు తెరిచినట్టుంది చోటేబాయ్ బడే బాయ్‌ల బంధం ఎంత పటిష్టమైందో సిబిఐకి ఇవ్వడంతోనే నీ బంధం బయటపడిందని ప్రజల దృష్టిలో, నీ అధిష్టానం దృష్టిలో పడుతున్నావని చెప్పారు. నీవు నీ బంధాలు కలిసి బిఆర్ఎస్ పార్టీని ఏమి చేయలేవన్నారు.



# రాష్ట్రంలోనే రోల్‌మోడల్

## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం

### మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** 25 ఎకరాల్లో అధునాతన హంగులతో,ప్రపంచ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నామని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.నల్లగొండ పట్టణంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను బుధవారం మంత్రి ఆకస్మికంగా పరిశీలించి పనుల పురోగతిపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 25 ఎకరాల్లో అధునాతన హంగులతో,ప్రపంచ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నామని అందులో 1లక్ష 10వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్స్ నాలుగు బ్లాకులుగా నిర్మిస్తున్నామని తెలిపారు.దీంతో పాటు స్టాఫ్ క్వార్టర్స్,డైనింగ్ హాల్,ఇతర నిర్మాణ పుట్టింగ్స్ పనులు సమాంతరంగా జరిగేలా చూసుకుంటూ పనుల్లో ఇంకా వేగం పెంచాలని నిర్మాణ సంస్థను ఆదేశించారు. ఎంతో మంది పేద విద్యార్థులకు కార్పోరేట్ స్థాయిలో నాణ్యమైన విద్య అందించేందుకు ఈ రెసిడెన్షియల్ స్కూల్ దోహదపడనుందని దాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్మాణం జరగాలన్నారు. ఒకటో బ్లాక్ మొదటి స్లాబ్ అక్టోబర్ చివరి నాటి కంటే ముందే పూర్తయ్యేలా పనిచేయాలని,రాష్ట్రంలోనే నల్గొండ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం ఆదర్శంగా ఉండాలని,అందుకు అనుగుణంగా అధికారులు,వర్క్ ఏజెన్సీ మనసుపెట్టి పనిచేయాలని మంత్రి సూచించారు. 9నెలల నిర్ణీత గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలనీ స్పష్టం చేశారు.

**వీరనారి చాకలి ఐలమ్మ:మంత్రి కోమటిరెడ్డి**

భూమికోసం వెట్టిచాకిరి, విముక్తి కోసం పోరాడిన తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్లో గల క్యాంపు కార్యాలయం లో మంత్రి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటాలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బి. లక్ష్మారెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఇబ్రహీం, శ్రీనివాస్ రెడ్డి, వంగాల అనిల్ రెడ్డి, ప్రతీక్ ఫౌండేషన్ సీఈవో ఎం వి గోన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఎంజియు 4వ స్నాతకోత్సవానికి అన్నీ ఏర్పాట్లు

### కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశం



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** ఈనెల 15న రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ నాల్గవ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్న దృష్ట్యా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చెప్పారు. బుధవారం ఆమె జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తో కలిసి మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి రాష్ట్ర గవర్నర్ పాల్గొననున్న స్నాతకోత్సవ వేదికను పరిశీలించారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ రాక సందర్భంగా ఆయా శాఖల అధికారులు వారి బాధ్యతలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని చెప్పారు. గవర్నర్ రాకను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా అధికారులతో ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఏర్పాట్లు, ఇతర అంశాలను అందులో పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 15న ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను, మెడికల్ టీం, 108,104 ,ప్రత్యేక డాక్టర్ల బృందం ఏర్పాటు చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని, అలాగే డయాస్ ఇతర ఏర్పాట్లు ఆర్ అండ్ బి అధికారులు చూడాలని , తాగునీరు, శానిటేషన్, ఫాగింగ్ వంటివి చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.యూనివర్సిటీ వైట్ ఛాన్సర్ ఖాజా అల్లా హుస్సేన్ మాట్లాడుతూ ఈనెల 15 న మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం నాల్గవ స్నాతకోత్సవంలో 22 మంది పి హెచ్ డి సాధించిన విద్యార్థులు, 57 మంది గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులకు మెడల్స్ ప్రదానం ఉంటుందని, అనంతరం గవర్నర్ ప్రసంగం ఉంటాయని, ఒంటిగంటకు కార్యక్రమాల అనంతరం గవర్నర్ తిరిగి వెళ్తారని,రాష్ట్ర గవర్నర్ కార్యక్రమాలను సవ్యంగా నిర్వహించేందుకు గాను యూనివర్సిటీలో సుమారు 12 కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎంజి యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్,జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిసిహెచ్ఎస్ మాతృనాయక్ అధికారులు హాజరయ్యారు.

# 'మన పోరాటం- మన చరిత్ర' తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం

### సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** దేశంలో మన పోరాటం మన చరిత్రలో ప్రముఖమైనదని దేశభక్తిని రగిలించేది తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు,జిల్లా రైతుసంఘం కార్యదర్శి కంబాల శ్రీనివాస్,పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు లు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన సిపిఐ పట్టణ కౌన్సిల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 14 సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా హుజూర్‌నగర్‌లో భారీ ర్యాలీ చేసి,అమరులకు ఘననివాళులు అర్పిస్తామన్నారు. సాయుధ పోరాట యోధుల త్యాగాలను,దేశభక్తిని ,పోరాటాన్ని గౌరవించడం తెలుసుకోవడం యువత బాధ్యత అన్నారు. దోపిడి దురహంకారం,అసమానత్వాన్ని రూపుమాపేందుకు సాయుధ పోరాట యోధుల ప్రాణత్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమించాలని కోరారు. ప్రతిఒక్కరూ తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమగాని కృష్ణ,జడ వెంకన్న,దొంతగాని సత్యనారాయణ,ఇందిరాల వెంకటేశ్వర్లు,యల్లావుల రమేష్,జడ శ్రీనివాస్,యల్లావుల ఉమ,చెన్నగాని సైదులు,చక్రాల స్టాలిన్,చక్రాల వెంకన్న,గుండా రమేష్,కృష్ణారెడ్డి,స్వామి,ప్రసాద్,మల్లయ్య రమణ తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు అండగా ప్రజా ప్రభుత్వం

### దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్

**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** పేద ప్రజలకు అండగా ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ పనిచేస్తుందని దేవరకొండ శాసనసభ్యుడు నేనావత్ బాలునాయక్ అన్నారు.బుధవారం పీఏపల్లి మండల కేంద్రంలో జనహిత ఎమ్మెల్యే మార్నింగ్ వాకింగ్ విత్ పీపుల్ కార్యక్రమంలో భాగంగా పలు కాలనీలో ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులతో కలిసి పర్యటించి గ్రామ ప్రజలకు నేరుగా కలిసి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనహిత మార్నింగ్ వాకింగ్ తో ప్రజల రాతలు మారుతున్నాయన్నారు.ప్రజల సమస్యలు తెలుసుకోవడం తక్షణమే పరిష్కరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అనేక సంక్షేమ పథకాలు ప్రజల్లో విశేష స్పందన వస్తుందన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.అదేవిధంగా మండలానికి సంబంధించిన కల్యాణ లక్ష్మి చెక్కులను స్వయంగా లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది.

## విద్యార్థులు ఆశయంతో చదవాలి

### కోదాడ డిఎస్‌పి శ్రీధర్ రెడ్డి





**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** విద్యార్థులు మంచి ఆశయంతో చదువుకోవాలని,ప్రావీణ్యం ఉన్న అంశంపై సాధన చేయాలని కోదాడ డిఎస్‌పి శ్రీధర్ రెడ్డి అన్నారు. పోలీస్ భరోసా కార్యక్రమంలో భాగంగా బుధవారం హుజూర్‌నగర్‌లోని తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినీలు,మహిళలు బాలికల రక్షణ చట్టాలు గురించి అవగాహన కల్పించారు. జిల్లా పోలీస్ కళా బృందం చే సామాజిక అంశాలు,షీటీమ్స్, మంచి అలవాట్లను అలవర్చుకోవాలనే అంశాలపై పాటలు పాడుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హుజూర్‌నగర్ సీఐ జి. చరమందరాజుతో కలిసి డిఎస్పి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ చదువు చాలా విలువైనదని,ప్రపంచంలో చదువుతోనే విజ్ఞానం వెలుగొందుతుందన్నారు. ప్రతిఒక్కరూ చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అదిరోహించాలన్నారు. పుట్టిన ఊరుకు,తల్లిదండ్రులకు మంచి పేరుప్రఖ్యాతలు తేవాలంటే చదువుతోనే సాధ్యమౌతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఎస్ఐ బండి.మోహన్ బాబు,ప్రిన్సిపల్ రెహనాభేగం,ఉపాధ్యాయినీలు శైలజ,నస్రీన్, స్వప్న,దివ్య,పుష్ప, కళ్యాణి పావనీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ కుటుంబ ప్రయోజన పథకం

**ప్రజాపక్షం/చిట్యాల :** జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అర్హులైన వారందరికి, వీలైనంత ఎక్కువ మందికి అందేలా మండలాధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల తహసిల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులకు దిశా నిర్ధేశాలనందించారు. ఈ పథకం కోసం వచ్చిన దరఖాస్తులను, పిఓబి భూములకు సంభందించిన కేసులను ఆమె పరిశీలించారు. మండలంలో అన్ని గ్రామాల వారిగా 2017 ఏప్రిల్ నుండి మరణించిన వారి వివరాలను తెలప్పించుకుని అందులో నుండి కుటుంబ పెద్ద మగ లేదా ఆడ ఎవరు చనిపోయినా అలాంటి వారి వివరాలు సేకరించి సంభందిత కుటుంబ సభ్యుల సహకారంతో మరణ ధృవీకరణ పత్రము, ఆధార్, ఇతర ధృవ పత్రాలను జత చేసి జాతీయ కుటుంబ ప్రయోజనం పథకం కింద లబ్ధి పొందేందుకు దరఖాస్థులను పంపించాలని సూచించారు. చనిపోయిన కుటుంబ పెద్ద కుటుంబానికి రూ. 20వేలు పెద్ద మొత్తం వస్తున్నందున అర్హులందరిని గుర్తించాలని కలెక్టర్ అన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే ఆన్‌లైన్ చేస్తున్నట్లు ఆర్‌డిఓ అశోక్‌రెడ్డి ఆమెకు వివరించారు. అంతకుముందు మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలోని దశమి లాబ్స్ ఫార్మా పరిశ్రమలో వనమహోత్సవంలో భాగంగా కలెక్టర్ మొక్కలు నాటారు. ఆమె వెంట ఆర్‌డిఓ అశోక్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణ నాయక్, పరిశ్రమల అధికారి శ్రీదేవి తదితరులున్నారు.



## చట్టాలపై అవగాహన తప్పనిసరి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూర్యాపేట సిఐ వెంకటయ్య చెప్పారు. బుధవారం రాత్రి బాలికల గురుకుల డిగ్రీ కళాశాల నందు పోలీసు ప్రజాబరోసా కార్యక్రమంలో భాగంగా ఫోక్సో చట్టం అమలు, జిల్లా పోలీసు, షీ టీమ్స్ పనితీరు, బరోసా సెంటర్, మహిళల బాలల రక్షణ చట్టాలు, వేధింపులపై ఫిర్యాదు చేయడం మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నేటి సాంకేతిక సమాజంలో అనేక అసాంఘీక దురాచారాలు ఉన్నాయని వాటన్నిటిని చదువు అనే విజ్ఞానంతో ప్రారదోరాలన్నారు. దానికి ఉన్నతమైన చదువు ముఖ్యమని, చదువు విలువను గుర్తించాలని కోరారు. ఉన్నత లక్ష్యాలతో చదువుకోవడం, మంచి అలవాట్లు పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి విజయాలు సాధించి తల్లిదండ్రులకు విద్యాసంస్థలకు గురువులకు మంచి పేరుతేవాలన్నారు. సైబర్ మోసాలపట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. మాదకద్రవ్యాలకు యువత బానిసలై బంగారు భవిష్యత్తు కోల్పోతున్నారని అలాంటి వాటికి దూరంగా ఉండాలని చెప్పారు. వేధింపులకు సంబంధించి ధైర్యంగా జిల్లా షీటీం 8712686056 కు లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పోలీసు సిబ్బంది, విద్యార్థిణీలు పాల్గొన్నారు.

# మట్టి మనుషుల పోరాటమే రైతాంగ సాయుధ పోరాటం

### గుండ్రాంపల్లి నుంచే వారోత్సవాలు ప్రారంభం

**ప్రజాపక్షం/నల్లగొండ:** భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరి విముక్తి కోసం.. ఆత్మ గౌరవం కోసం తెలంగాణ గడ్డపై మట్టి మనుషులు చేసిన పోరాటాలకు 76 ఏళ్లు నిండాయి. తెలంగాణ ప్రాంతంలో నాటి నైజాం రాచరిక పరిపాలనలో అణిగిపోయి బాంచన్..నీ కాళ్లు మొక్తా అన్న ప్రజలే బందూకూలు పట్టిన కమ్యూనిస్టు పోరాటమది. నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూస్వాములు, దొరలు, దేశ్‌ముఖ్‌లపై తిరుగుబాటు దిక్కస్వరం వినిపించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లిఖించబడింది. నాడు హైదరాబాద్ సంస్థాన రాజు ముస్లీం అయినప్పటికీ జమీందార్లు, జాగిర్దార్లు, భూస్వాములు 90 శాతం హిందువులు అయినప్పటికీ నిజాం నవాబు గులాం గిరిగా వ్యవహారించడమే కాకుండా నిజాంను మించిన ధౌర్జన్యాలతో అనేక మందిని ఊచకోత కోయడం.. మహిళలను వివస్త్రలుగా చేసి ఊరేగింపులు చేయడం.. బతుకమ్మలు ఆడించడం.. మానభంగాలు చేయడం లాంటి కృరమైన నేరాలకు పాల్పడి అనేకమంది ప్రజల ప్రాణాలను తీశారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నల్లగొండ జిల్లాలో అనేక గ్రామాలలో ప్రజలను భాగస్వాములను చేసి దొరలు, భూస్వాములు, రజాకారులకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించారు. ఆయుధాలు లేకున్నా కారంపొడి, రోకళ్లు, కర్రలు, గుప్తలు చేతికి అందిందే ఆయుధంగా ఎంచుకొని రజాకారులను ఎదిరించిన మట్టి మనుషులు. అందులో భాగంగా నల్లగొండ జిల్లా, చిట్యాల మండలం, గుం డ్రాంపల్లి గ్రామం రజాకారులను ఎదిరించిన ఘనమైన చరిత్రలో నిలిచిపోయింది.ఈ నేపథ్యంలో ఈ నెల 11న సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తం గా తలపెట్టిన తెలంగాణ రైతాంగ సా యుధ పోరాట వారోత్సవాల్లో భాగం గా గుండ్రాంపల్లి గ్రామంలో వారోత్సవాల ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నారు.





# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత



**ప్రజాపక్షం/వంగూరు :** రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యకు, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుందని రాష్ట్ర వ్యవసాయ కమీషన్ సభ్యులు కెవిఎన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం దాతల సహకారంతో 400మంది విద్యార్థులకు షూలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వందేమాతరం ఫౌండర్ పద్మ మాధవరెడ్డి, ఎంఈఓ మురళీమోహనాచారి, ఉపాధ్యాయులు లింగమయ్య, సురేందర్‌రెడ్డి, గోవర్ధన్, శశివర్ధన్‌రెడ్డి, కృష్ణయ్య, విద్యాసాగర్, మల్లయ్య, వేదమూర్తితోపాటు ఆయా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మీసేవా కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

**ప్రజాపక్షం/మద్దూర్ :** మండలంలో ఉన్నా మీసేవా కేంద్రాలను బుధవారం జిల్లా మేనేజరు విజయ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీసేవా కేంద్రాల్లో అధిక రుసుములకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మీసేవా కేంద్రాలకు వివిధ పనులపై వచ్చిన వినియోగదారులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. మీసేవా కేంద్రాల ద్వారా నిర్వహించే కార్యకలాపాలను పరిశీలించారు. మీసేవా కేంద్రాలు పారదర్శకంగా పనిచేయాలని, నిబంధనలు అతిక్రమించి అధిక వసూళ్ళకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పౌర సేవలు, చార్జీలను ప్రదర్శించాలని సూచించారు. అదేవిధంగా ఎప్పటికప్పుడు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలన్నారు. అనధికార ప్రదేశాల్లో మీసేవా కేంద్రం నడపవద్దని ఆదేశించారు. మీసేవా కేంద్రం ఎక్కడ మంజూరు అయితే అక్కడ ఆ ప్రదేశంలో నడపాలన్నారు. లేనియెడల ఆ మీసేవా కేంద్రంపై చర్యలు తప్పవు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజరు రామ్మోహన్, మండల మీసేవా నిర్వాహకులు కమ్రుద్దిన్, రామగోవిందు, ఖాసీం, గంగాధర్, నవీన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/మక్తల్:** 18 సంవత్సరాలలోపు బాలికలకు 21 సంవత్సరంలోపు బాలురకు బాల్య వివాహాలు చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని 6 నుండి 14 సంవత్సరాల లోపు పిల్లలు తప్పనిసరిగా చదువుకోవాలని పిల్లలను ఎవరైనా పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని మక్తల్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది అయిన సంతోష్, శ్రావణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సంతోష్ మాట్లాడుతూ ఆడపిల్లల సోషల్ మీడియాకు దూరంగా ఉండి సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న హింసలపై వాటిని నివారించడంలో ఆడపిల్లలకు తగు మెలకువలు గురించి తెలపడం జరిగింది. ఎక్కడైనా పిల్లలను పనిలో పెట్టుకున్న లేదా బాల్య వివాహాలు చేస్తున్న 1098 కి సమాచారం ఇవ్వగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ హెడ్ క్వార్టర్‌లో మంత్రి డాక్టర్.వాకిటి శ్రీహరి చేతుల మీదుగా రూ.4, 32,000 ఉట్కూర్ మండలానికి చెందిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఉట్కూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డి.యగ్నేశ్వర్ రెడ్డి, పులిమామిడి గ్రామ అధ్యక్షుడు ధన్వాడ బాలరాజ్, కొల్లూరు రవి, అర్ఫాత్ పాల్గొన్నారు.

## హమాస్ అగ్రనాయకత్వం సేఫ్

ఫోన్ జియో లొకేషన్ నమ్ముకుని ఐడిఎఫ్ బోల్తా
ఖలీల్ హయ్యా కుమారుడు మృతి!
నిరాశానిస్పృహలో నెతన్యాహూ
దోహాలో దాడులపై ప్రపంచదేశాల విమర్శ

**జెరూసలెం:** హమాస్ అగ్రనాయకత్వం ఇజ్రాయెల్ సైనిక దళాలకు చిక్కినట్టే చిక్కి తప్పించుకుంది. వాస్తవానికి చెప్పాలంటే దోహాలో ఇజ్రాయెల్ సైనికదళం (ఐడిఎఫ్) పలుచోట్ల మంగళవారం చేసిన బాంబుదాడులు గురితప్పి విఫలమయ్యాయి. ఫోన్ ఆధారిత జియో లొకేషన్ ఆధారంగా ఐడిఎఫ్ దాడులు చేసింది. కానీ హమాస్ అగ్రనాయకత్వం వారిఫోన్లు అన్నింటినీ సమావేశ మందిరం వెలుపలే వదిలేసి లోపలకు వెళ్ళి దూరంగా ఉన్న గదిలో చర్చల్లో పాల్గొనడం వల్ల ఫోన్లు ఉన్నప్రాంతంలో బాంబుదాడులు జరిగాయి. హమాస్ నాయకుడు ఇస్మాయిల్ హనియేహ్ టెహ్రాన్‌లో ఉండగా 2024లో ఇజ్రాయెల్ దాడుల్లో మరణించారు. ఆయన కార్యాలయంలోనే ఈ అగ్రనేతలు సమావేశమైనట్లు సమాచారం. బాంబుదాడి తీవ్ర ప్రభావం చూపించిన ప్రాంతానికి దూరంగా ఉన్న గదిలో నాయకత్వం ఉండటంవల్ల వారంతా సురక్షితంగా బయటపడ్డారు.

మరోసారి దాడులు చేస్తామని నెతన్యాహూ చెప్పడంతో ఖతార్ పత్రికలు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాయి. ఖతార్ దేశ సార్వభౌమాధికారాన్ని ఐడిఎఫ్ ధిక్కరించడంతో ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చివరకు ట్రంప్ కూడా పక్కకు తప్పుకుని ఖతార్ తన ప్రియమిత్రదేశమని, ఈ దాడులతో తనకు సంబంధంలేదని ప్రకటించారు. బాధ్యతంతా నెతన్యాహూ తన నెత్తిమీదే వేసుకున్నారు.

ఖలీల్ హయ్యా, ఖాలెద్ మషాల్ తదితర హమాస్ అగ్రనేతలందరూ దాడుల్లో ఒకేసారి హతమైపోతారని అంచనా వేసినప్పటికీ నెతన్యాహూ ఆశ నెరవేరలేదు. దాడులు జరిగాక ఇరవైనాలుగు గంటల పాటు ఇజ్రాయెల్ గూఢచారులు, నాయకత్వం ఎదురుచూసినప్పటికీ హమాస్ అగ్రనేతలు మరణించిన సంకేతాలు కనిపించకపోవడంతో క్రమంగా వారి ఆశలు ఆవిరైపోయాయి. ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నప్పటికీ 'నెక్స్ట్ టైమ్ బెటర్ లక్' అని ఐడిఎఫ్ రాజీపడింది. తమ అగ్రనాయకత్వం సురక్షితంగా ఉందని హమాస్ ప్రకటించడంతో నెతన్యాహూ తెల్లమొహం వేశారు. ఐతే ఈ దాడుల్లో ఖలీల్ హయ్యా కుమారుడు సహా మరో నలుగురు మరణించారని వీరంతా ఖతార్‌కు చెందిన భద్రతా దళాల అధికారులేనన్నది సమాచారం. ఐతే సౌదీ వార్తా పత్రిక ''అల్‌షాఖ్–అల్‌అక్సత్' సమాచారం ప్రకారం హమాస్‌లో ఇద్దరు సీనియర్ నాయకులు, సంస్థ పొలిట్ బ్యూరో సభ్యులు గాయపడ్డారు. వీరిలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా కట్టుదిట్టమైన భద్రత మధ్య ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి పేర్లు మాత్రం పత్రిక వెల్లడించలేదు. దాడులు ఏ ప్రాంతంలో జరిగాయో ఖతార్ ప్రభుత్వంగానీ, ఐడిఎఫ్‌గానీ ప్రకటించలేదు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన కొత్త ఒప్పంద ప్రతిపాదనపై చర్చించేందుకు ఈ నాయకులు సమావేశమైన కేంద్ర కార్యాలయ భవనం ధ్వంసమైంది.

2023 అక్టోబరు ఏడో తేదీన ఇజ్రాయెల్ సంగీతోత్సవంపై దాడికి కుట్ర చేసిన సూత్రధారులందరూ అమెరికాఒకేచోట సమావేశమైన యావత్ ప్రపంచం నుండి ఇజ్రాయెల్ తీవ్ర విమర్శలకు గురవుతోంది. ఇప్పటికే రోగ్ దేశంగా ముద్రపడిన ఇజ్రాయెల్ ఈ దాడులతో ఖతార్ దేశ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించడంతో ప్రపంచందృష్టిలో మరింత భ్రష్టస్థాయికి దిగజారింది. మధ్యవర్తి పాత్రద్వారా బందీల విడుదలకు కృషి చేస్తూ, ఇజ్రాయెల్‌కు అంతోఇంతో మేలు చేస్తున్న ఖతార్ దృష్టిలో ఉగ్రవాద ఆలోచనల పాలకుడుగా నెతన్యాహూ ముద్రవేసుకున్నారు. పైగా ప్రతీకార చర్యలకు పూనుకుంటామని హెచ్చరించడంతో నెతన్యాహూ కొరివితో తలగోక్కున్నట్లయింది.

# స్వంత ఆదాయ వనరుల పెంపుపై స్థానిక సంస్థలు దృష్టి

రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల అధికారులతో సమీక్ష



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** స్థానికంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ, ఆదాయ వనరులను పెంపొందించుకునే దిశగా వినూత్న ఆలోచనలు, పద్ధతులతో స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సూచించారు. కేంద్ర, రాష్ట్రాల నుండి వచ్చిన గ్రాంట్‌లతో పాటు అనవసర వ్యయాన్ని తగ్గించుకుని, ఆదాయ వనరుల ద్వారా రాబడిని పెంచుకున్నప్పుడే స్థానిక సంస్థల ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. మహబూబ్‌నగర్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల అధికారులతో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు ఎం.రమేష్, సంకిపల్లి సుధీర్‌రెడ్డిలతో కలిసి చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సమీక్ష నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, నాగర్ కర్నూల్ కలెక్టర్ బధావత్ సంతోష్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, గద్వాల కలెక్టర్ బి.ఎం సంతోష్, నారాయణపేట అదనపు కలెక్టర్ రెవెన్యూలు జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల పనితీరు గురించి చైర్మన్‌కు వివరించారు. మున్సిపల్ పట్టణాలు, గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, తడి, పొడి చెత్త సేకరణ, పచ్చదనం పెంపు, పన్ను వసూళ్లు, స్వయం ఉపాధి పథకాలు అమలు, ప్రజా జీవన ప్రమాణాల పెంపు కోసం కొనసాగుతున్న కార్యక్రమాలు, గ్రాంట్స్ రూపంలో సమకూరుతున్న ఆదాయం, ఇతర మార్గాల ద్వారా స్థానిక సంస్థలకు అందుతున్న రాబడి తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ, గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యమని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొట్టమొదటగా రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జిల్లెల చిన్నా రెడ్డి మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థ పురాతనమైనది. జి.పి.కి కేంద్రం నుండి నేరుగా నిధులు వస్తున్నాయి అన్నారు. ప్రణాళిక ప్రకారం నిధులు ఖర్చు చేయాలని అన్నారు. ప్రాధాన్యత ప్రకారం నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఎంఎల్‌సి కూచుకుళ్ల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ గత 10 సంవత్సరాల్లో కొత్త మండలాలు, గ్రామాలు ఏర్పాటు కావడం జరిగిందని అన్నారు. సీవరేజ్, స్టాంపు డ్యూటీ రాష్ట్ర ప్రభుత్వానికి పోతున్నట్లు, స్థానిక సంస్థలకు రావటం లేదని అన్నారు. జి.పి.లకు నిధులు రావాలని తెలిపారు. కమీషన్ సభ్యులు సంకిపల్లి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ 500 జనాభా ఉన్న తండాలను జి.పిలుగా గత ప్రభుత్వం చేయడం జరిగిందని, ఇంకా అనేక సమస్యలు ఉన్నాయని అన్నారు. స్థానిక సంస్థలలో పని చేస్తున్న అనుభవం ఉన్న అధికారులు స్థానిక సంస్థల ఆదాయ వనరులు పెంచేందుకు తమ సలహాలు, సూచనలు అందించాలని అన్నారు. సమావేశంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీ కాత్యాయని, మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, నాగర్‌కర్నూల్ స్థానిక సంస్థల కలెక్టర్ దేవసహాయం, వనపర్తి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ యాదయ్య, గద్వాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు, ఉమ్మడి జిల్లా జడ్.పి.సి ఈ ఓ.లు, డి.పి.ఓ.లు, డివిజనల్ పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు, ఎం.పి.డి.ఓలు,ఎం.పి.ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఆరోగ్యం ముఖ్యం



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** సమాజానికి సేవచేసే జర్నలిస్టులకు ఆరోగ్యం ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. తెలంగాణ యూనియన్‌ఆఫ్‌వర్కింగ్ జర్నలిస్టు(ఐజెయు) ఆధ్వర్యంలో హైదరాబాద్ మలక్‌పేట్ యశోద ఆస్పత్రి, శ్రీనేత్ర, సనత్‌నగర్‌వారి సహకారంతో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సాయిగార్డెన్‌లో బుధవారం జర్నలిస్టులు, వారి కుటుంబసభ్యులకు ఉచితమెగా వైద్య ఆరోగ్యశిబిరాన్ని ఏర్పాటు చేయగా ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, జిల్లా ఎస్‌పి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, రత్నగిరి ఫౌండేషన్ చైర్మన్ జూపల్లి అరుణ్‌కుమార్‌రావు, యూనియన్ రాష్ట్రకార్యదర్శి మధుగౌడ్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విజయ్‌కుమార్, సురేష్‌కుమార్, జాతీయ నాయకులు సుదర్శన్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టువృత్తి సమాజంలో ఎంతో బాధ్యతాయుతమైనదని, ప్రజల సమస్యలను పరిష్కరింపచేయడంలో వారి పాత్ర ఎంతో కీలకమని, అలాంటి జర్నలిస్టులు ప్రజలకు సేవచేయాలంటే ఆరోగ్యం ముఖ్యమని తెలిపారు. మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసిన ఐజెయు యూనియన్ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం జిల్లా ఎస్‌పి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మాట్లాడుతూ జర్నలిస్టులు ఆరోగ్యంపట్ల శ్రద్ధ చూపాలని, శరీరంకూడా ఒక ఆర్గానిక్‌యంత్రంలాంటిదని, దానికి పరీక్షలు అవసరమన్నారు. ఒత్తిడితో కూడిన ఈ వృత్తిలో ఆహారపు అలవాట్లు, దినచర్య అలవర్చుకోవాలని కోరారు. యూనియన్ ఆఫ్‌వర్కింగ్ జర్నలిస్టు ఐజెయు సభ్యులు, యశోద ఆస్పత్రి వైద్య సిబ్బందిని అభినందించారు. తాము కూడా పోలీస్ సిబ్బందికి అమ్రాబాద్‌లో మెగా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు ఆ హెల్త్‌క్యాంపులు జర్నలిస్టులకు అవకాశం కల్పిస్తామని ఎస్‌పి తెలిపారు. కార్యక్రమంలో టియూడబ్ల్యూజే ఐజెయు జాతీయ నాయకులు సుదర్శన్‌రెడ్డి, జిల్లాప్రధాన కార్యదర్శి సురేష్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి ప్రభాకర్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ కన్నయ్య, రాష్ట్రకార్యవర్గ సభ్యులు శ్యాం, జిల్లా కోశాధికారి శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షులు బాలరాజు, నాగర్‌కర్నూల్ తాలుకా అధ్యక్షులు సందుయాదగిరి, నాయకులు కందికొండమోహన్, హాకీం కిశోర్, కొల్లాపూర్ తాలుకా అధ్యక్షులు రాజేందర్‌గౌడ్, అచ్చంపేట తాలుకా అధ్యక్షుడు సాయిబాబు, కల్వకుర్తి తాలుకా కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## తెలుగు భాషను పరిరక్షించుకోవాలి




అడిషనల్ కలెక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి

**ప్రజాపక్షం/జడ్చర్ల :** తెలుగు భాషను పరిరక్షించుకోవడానికి తెలుగు వారందరూ కంకణబద్ధులవ్వాలని మహబూబ్ నగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నాడు జడ్చర్ల చంద్రాగార్డెన్స్ లో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సలహాదారు బాదిమి శివకుమార్ సభాధ్యక్షతన జరిగిన ''అష్టావధానం'' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఏడువేల భాషలుండగా తెలుగు పదకొండవ స్థానంలో ఉందనీ, భారతదేశంలో గతంలో రెండవ స్థానానికి పడిపోయిందనీ ఆవేదన వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రాల్లో ఇంజినీరింగ్, మెడిసిన్‌లాంటి సాంకేతిక విద్యలు కూడా మాతృభాషలో బోధిస్తున్నారన్నారు. మరో ముఖ్య అతిథిగా ప్రముఖ కవి పల్లెర్ల రాంమోహన్ పాల్గొనగా, ఈ కార్యక్రమ సంధాన కర్తగా కంది శంకరయ్య వ్యవహరించగా అవధాని, వరంగల్ వాస్తవ్యులు శ్రీరామ్ పృచ్ఛకులు సంబంధించిన ప్రశ్నలకు చాక చక్యంతో పద్యాల రూపంతో సమాధానలనిచ్చారు. ఈ కార్యక్రమంలో సంయోజకులుగా డా.ఉమ్మెంతల మహేశ్వర్, పృచ్ఛకులలో నిషిద్ధాక్షరి: కుంచకూరి బుచ్చిలింగం, సమస్యా పూరణం: చక్రవర్తుల రమణాచార్యులు, దత్త పది: దార్ల రాఘవేంద్రాచారి, ఛందో భూషణం, పూదత్తు కృష్ణమోహన్, ఆశువు: మరింగంటి కృష్ణవేణి, న్యస్తాక్షరి: యలకంటి భాస్కర్, వర్ణన : చక్రవర్తుల సంతోషి కిరణ్మయి, అప్రస్తుతం: సి.సాకేత, ప్రవీణ్‌లు నిర్వహించగా వారికి అవధాని శ్రీరామ్ సభికులను ఆకట్టుకునేట్టుగా సమాధానాలిచ్చారు.

# యూరియా కోసం రోడ్డెక్కిన రైతన్నలు



**ప్రజాపక్షం/ధన్వాడ:** రైతులు ఆరుగాలం కష్టించే రైతన్నకు యూరియా తిప్పలు తప్పడం లేదు. గత కొన్ని రోజుల నుండి రైతులు యూరియా బస్తాల కోసం సింగల్ విండో కార్యాలయం ఎరువుల దుకాణాలకు చెప్పులు అరిగేలా తిరుగుతున్న యూరియా మాత్రం అందడం లేదు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు తెల్లవారుజామున మూడు గంటలకే యూరియా బస్సుల కోసం క్యూలైన్‌లో నిలబడడం లేదా చెప్పులను లైన్లో పెట్టడం జరుగుతుంది. అయితే ధన్వాడ సింగిల్ విండో కార్యాలయంకు యూరియా బస్తాల కోసం రైతులు బుధవారం తెల్లవారుజామున కార్యాలయానికి చేరుకున్నారు. కానీ కార్యాలయంలో యూరియా బస్తాలు లేవని తెలియడంతో విసుకు చెందిన రైతులు ధన్వాడ రోడ్డుపై బైఠాయించి జరిపారు. యూరియా అందించాలని ఇదేం పాలన... అంటూ రైతులు రాస్తారోకోలో నినాదాలు చేశారు. యూరియా కోసం వారం రోజుల క్రితమే టోకెన్లు తీసుకున్న ఇప్పటికి యూరియా ఇవ్వడం లేదని రైతులతో పాటు మళ్లీ కొత్తగా టోకెన్లు తీసుకున్న రైతులందరూ కలిసి ధన్వాడ రోడ్డుపై బైఠాయించి జరిపి ప్రభుత్వానికి పాలకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అరగంట పాటు రోడ్డుపై బైఠాయించి జరపడంతో ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఆందోళన చేస్తున్న రైతులను పోలీసులు సముదాయించి రాస్తారోకో విరమింప చేశారు. ధన్వాడ సింగల్ విండో కార్యాలయం నుంచి అక్రమంగా యూనియన్ తరలిస్తున్నారు. అంటూ పెద్ద పెద్ద నాయకుల ఇంట్లో యూరియా ఎలా ఉందంటూ రైతులు ప్రశ్నించారు. రైతుల గురించి పట్టించుకుని ప్రభుత్వం ఎందుకు అంటూ నిలదీశారు. పాలకులు ఎక్కడున్నారు. ఇప్పుడు రైతులు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించరా అంటూ రైతులు వాపోయారు.

## రైతు వేదికను సందర్శించిన ఎస్పీ



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** యూరియా స్టాక్ పాయింట్‌గా ఉన్న మాచన్‌పల్లి రైతు వేదికను జిల్లా ఎస్పీ డి.జానకి ప్రత్యక్షంగా సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యూరియా అక్రమ రవాణా లేదా నిల్వ చేసే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు నేరుగా అధికారులను సంప్రదించి తమ అవసరాలను తెలియజేయాలని, రైతులు ఎవ్వరు కూడా అనవసరంగా దళారులను మధ్యవర్తులను నమ్మవద్దని పేర్కొన్నారు.

# తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత



ఐలమ్మకు పలువురు నివాళి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత, తెలంగాణ ఉద్యమకారిణి తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి నింపిన వీరవనిత చాకలి ఐలమ్మ అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా మహబూబ్‌నగర్ నగరంలోని పద్మావతి కాలనీ, గ్రీన్ బెల్ట్‌లో గల చాకలి ఐలమ్మ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మ ణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, మధుసూదన్ రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, నాయకులు సిజె బెనహార్, అజ్మత్ అలి, ఎల్లంగారి భరత్ కుమార్, క్రిష్ణ కాంత్ రెడ్డి , కిషన్ నాయక్, మోయిజ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు రజక సంఘం అధ్యక్షులు పురుషోత్తం, బిసి సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మక్తల్:** ఐలమ్మ పోరాట స్ఫూర్తి తరతరాలకు ఆదర్శం మంత్రి వ్యాఖ్యలు భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మను స్మరించిన మంత్రి వాకిటి శ్రీహరి మక్తల్ నియోజకవర్గ కేంద్రంలోని తన నివాసంలో తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ వర్థంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రవికుమార్, లక్ష్మారెడ్డి, కల్లూరి గోవర్ధన్, గుంతల రవికుమార్, ఓబ్లేష్, నాగేష్, నాగేశ్వరరావు తదితర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నర్వ:** తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో చాకలి ఐలమ్మ చిరస్థాయిగా నిలిచిందని జిల్లా అధ్యక్షులు సంజన్న అన్నారు. బుధవారం చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా నర్వ చౌరస్తాలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జగన్నాథ్, బాబు, రవి, లంకాల అంజి, నరేష్, యాదేశ్, వెంకటేశ్, రమేష్, సుధీర్, ఎమ్మార్పీఎస్ వెంకటయ్య, రత్నాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** తెలంగాణ సాయుధ రైతాంగపోరాటంలో పోరాడిన వీరవనిత చాకలిఐలమ్మ మహిళాశక్తికి ప్రతీకగా నిలిచారని నాగర్‌కర్నూల్ జిల్లా స్పెషల్ డిప్యూటి కలెక్టర్, ఇంచార్జీ జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి యాదగిరి అనానరు. బుధవారం జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలోని హౌసింగ్‌బోర్డులో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సహాయ బిసి సంక్షేమశాఖ అధికారి శ్రీరాములు, నాగర్‌కర్నూల్ తహసీల్దార్ తబితరాణి, వివిధకుల సంఘాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, నాయకులు, కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

**కల్వకుర్తిలో..** చాకలిఐలమ్మ పోరాటపటిమ నేటికి స్ఫూర్తిదాయకమని బిసి సంక్షేమసంఘం నాయకులు గోపాల్ అన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలో తహసీల్దార్ కార్యాలయ సమీపంలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఘనంగా ఆమెచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీచైర్మన్ సత్యం, రాచోటి శ్రీశైలం, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాలయ్య, నాయకులు దారమోని గణేష్, గోపాల్ ఉన్నారు.

**ప్రజాపక్షం/వంగూర్ :** మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామంలో బుధవారం చాకలిఐలమ్మ వర్ధంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఏపి మల్లయ్య మాట్లాడుతూ భూమికోసం, భుక్తికోసం తెలంగాణ విముక్తి కోసం తిరుగుబాటు చేసిన తొలి మహిళగా చిట్యాల ఐలమ్మ అని ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు శ్రీనివాసులు, సురేందర్, సాయిలు, కాశీనాథం, వివిధపార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ఐలమ్మ వర్ధంతి సిపిఎం ఆధ్వర్యంలో వీపనగండ్ల మండలంలోని వీపనగండ్ల, గోపాల్ దిన్నె గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీపనగండ్ల పార్టీ సీనియర్ నాయకుడు సిహెచ్ వెంకటయ్య, గోపాల్ దిన్నెఎ గ్రామంలో పార్టీ కార్యదర్శి నిరంజన్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాలస్వామి, సిహెచ్ వెంకటయ్య, ఆశన్న, ఈశ్వర్, నిరంజన్, శేఖర్ రెడ్డి, భాస్కర్, నర్సింహ, వెంకన్న గౌడ్, రాముడు, నవీన్, శరత్, శ్రీనివాసులు, పేట రాయుడు,చంద్రయ్య,బాలయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

**పాన్‌గల్‌లో....** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో సిపిఐలో చేరి ప్రజల పక్షాన ఐలమ్మ సాగించిన పోరాటం స్ఫూర్తిదాయం చిరస్మరణీయమని ఏఐటియూసి జిల్లా ఉపాధ్యక్షుడు, సిపిఐ జిల్లా కార్మిక సంఘం కె.శ్రీరాం అన్నారు. పాన్‌గల్ మండలం కేతేపల్లిలో సిపిఐ ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళావతమ్మ, కృష్ణవేణి, మాల కుర్మయ్య, చిన్న కుర్మయ్య, హన్మంతు, ఉస్సేన్, సంతోష్, రామాంజనేయులు, పరశురాముడు, ఎల్లమ్మ, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

**వనపర్తి టౌన్‌లో....** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు వీరనారి చిట్యాల ఐలమ్మ పోరాట స్ఫూర్తితో మహిళల అణచివేతకు వ్యతిరేకంగా, హక్కుల సాధనకై పోరాడాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి పిలుపునిచ్చారు. ఐలమ్మ 40వ వర్ధంతిని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి స్వేతా నగర్ ఆఫీస్‌లో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షురాలు కళావతమ్మ, పట్టణ కన్వీనర్ జయమ్మ, కో కన్వీనర్లు శిరీష, భూమిక, వెంకటమ్మ, శ్రీదేవి, జ్యోతి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

**కొత్తకోటలో ....** కొత్తకోట పట్టణంలోని రజక సంఘం భవనంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీ పుల్లయ్య కుమారులు శివుడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ అబ్దుల్ నబీ, మాజీ అధ్యక్షులు బి.చంద్రయ్య, ఆర్. కృష్ణయ్య, బీచుపల్లి శ్రీను, టిడిపి సీనియర్ పట్టణ నాయకులు రాచాల నాగరాజ్ , సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**అమరచింతలో...** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని బుధవారం అమరచింత మండల కేంద్రంలో రజకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం ప్రధాన కార్యదర్శి సవరన్న, కోరి శ్రీనివాసులు, సతేందర్ , సుతారి వెంకటేష్, తాయికుమార్, చిన్న రాజా, చరణ్ , స్వామి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ అసెంబ్లీ బహుజన సమాజ్ పార్టీ పట్టణం అధ్యక్షులు లక్ష్మన్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బహుజన సమాజ్ పార్టీ మక్తల్ అసెంబ్లీ అధ్యక్షులు కేవి నరసింహ విశిష్ట అతిథులుగా తెలంగాణ రాష్ట్ర బహుజన సమాజ్ పార్టీ కార్యవర్గ సభ్యులు జుట్ల నరేందర్ జిల్లా కార్యదర్శి బండారి చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మక్తల్ పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్, ఉట్కూరు మండల కార్యదర్శి భూషప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/కొత్తపల్లి/మద్దూర్ :** మద్దూరు కొత్తపల్లి మండల కేంద్రాల్లో చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అశోక్, భూమిక ఉమెన్స్ కలెక్టివ్ వాలంటరి కొత్తపల్లి నరేష్‌లు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హన్మంతు, కేశవులు, అల్లి తిరుపతయ్య, వెంకటయ్య, భాస్కర్ నాయక్ దళిత బహుజన నాయకులు చిన్నయ్య, సాయిలు, రాములు, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల పట్టణంలో వీరనారీమని చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నేతలు మాట్లాడుతూ చాకలి ఐలమ్మలాంటి వీరవనితలు మన ప్రాంతంలో పుట్టడం గర్వించదగిన విషయం అన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సిఐటియు, డివైఎఫ్ఐ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, కెవిపిఎస్ తదితర సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పి.నాగరాజు, అధ్యక్షతన నిర్వహించగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దీప్లానాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి.జగన్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆకుల వెంకటేశ్, కెవిపిఎస్ జిల్లా నాయకులు క్రరే శంకర్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు కర్ణ మహేష్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జడ్చర్ల మండల నాయకులు ఇంద్రకృష్ణ, స్వరూప, వెంకటమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పి.జంగయ్య, బందిగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రీల్

# చిరంజీవితో విజయ్ సేతుపతి భేటీ



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మన శివశంకర వరప్రసాద్ గారు సినిమా షూటింగ్ పక్కన్నే పూరి జగన్నాథ్ విజయ్ సేతుపతి సినిమా షూటింగ్ కూడా జరుగుతోంది. రెండు షూటింగ్‌లు పక్క పక్కనే జరుగుతున్న నేపథ్యంలో పూరి జగన్నాథ్, తమిళ నటుడు విజయ్ సేతుపతి కలసి చిరంజీవి షూటింగ్ సెట్ కు వెళ్లారు. చిరంజీవిని కలిసి కొద్దిసేపు ముచ్చటించారు. ప్రస్తుతం పూరి జగన్నాథ్, విజయ్ సేతు పతి కాంబినేషన్ లో వస్తున్న ఈ సినిమా తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో చిత్రీకరిస్తున్నారు. విజయ్ సేతుపతి సరసన సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటిస్తోంది. టబు కీలకమైన పాత్రలో కనిపించనుంది. ఈ టీమ్ అంత కలసి చిరంజీవితో ఇలా ఫోటోలు దిగారు.

# మెగా ఫ్యామిలీలో పుత్రోత్సవం



మెగా ఫ్యామిలిలో పుత్రోత్సవం కలిగింది. ప్రేమించి, పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్న వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి దంపతులకు పండంటి మెగా బిడ్డ పుట్టారు. అప్పుడే పుట్టిన బిడ్డను ఎత్తుకున్న చిరంజీవి తెగ మురిసిపోయారు. దీంతో మెగా ఫ్యామిలిలో సంబరాలు చేసు కుంటున్నారు.

# 'లిటిల్ హార్ట్స్' సినిమాతో డిఒపిగా మంచి గుర్తింపు



సినిమాటోగ్రాఫర్ సూర్య బాలాజీ మౌళి తనూజ్, శివానీ నాగరం జంటగా నటించిన 'లిటిల్ హా లిటిల్ హార్ట్స్' సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమాకు సూర్య బాలాజీ ఈ చిత్రంతో సినిమాటోగ్రాఫర్ గా పరిచయమయ్యారు. తన తొలి చిత్రంతోనే ప్రేక్షకుల్ని కెమెరా పనితనంతో ఆకట్టుకున్నారు. డిఒపి పనితనం మీదే సినిమా బడ్జెట్ ఆధార పడి ఉంటుంది. లిటిల్ హారట్స్ చిత్రాన్నిలో బడ్జెట్ లో రిచ్ లుక్ వచ్చేలా చేయడంలో సూర్య బాలాజీ ప్రతిభ చూపించారు. 2.5 కోట్ల రూపాయల బడ్జెట్ లో చేసిన లిటిల్ హారస్ట్ సినిమా తెరపై చూస్తే ఓ పది కోట్ల రూపాయల బడ్జెట్ మూవీలా అనిపిస్తుంది. అలాంటి రిచ్ లుక్ తన కెమెరా పనితనంతో తీసుకొచ్చారు సూర్య బాలాజీ. హైదరాబాద్, బెంగళూరులో ఈ సినిమాను గెరిల్లా పద్ధతిలో షూట్ చేశారు. లొకేషన్స్ ను కాకుండా కేవలం నటీనటుల క్లోజప్స్ తోనే ఎలివేట్ చేశారు. ప్రతి సీన్ సహజంగా ఉండేలా క్యాప్చర్ చేశారు. లిటిల్ హారట్స్ మూవీని చాలా రియలెస్టిక్ గా తన కెమెరా లెన్స్ లో చూపించారు. లిటిల్ హారట్స్ సినిమాకు వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే చాలా హ్యాపీగా ఉందని, బీ, సీ సెంటర్స్ లో కూడా థియేటర్స్ హౌస్ ఫుల్స్ కావడం నమ్మలేకపోతున్నామని సూర్య బాలాజీ అంటున్నారు. ఈ చిత్రానికి తనకు ఆశించిన దానికంటే ఎక్కువ గుర్తింపు రావడం హ్యాపీగా ఉందన్నారు. కంప్లీట్ కమర్షియల్ గా కాకుండా, కంప్లీట్ రియలెస్టిక్ గా కాకుండా ప్రేక్షకుల్ని ఆకట్టుకునే ఒక డైలాగ్ బేస్డ్ హోస్ సమ్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ ను దర్శకుడు సాయి మార్తాండ రూపొందించినట్లు సూర్య బాలాజీ చెప్పారు.

# రెండో వారంలో 'సంబరాల ఏటిగట్టు' తదుపరి షెడ్యూల్

సాయి దుర్గ తేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సంబరాల ఏటిగట్టు'' రోహిత్ కెపి దర్శకత్వంలో ప్రైమ్‌షో ఎంటర్టైన్‌మెంట్ బ్యానర్‌పై కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మించిన ఈ చిత్రం 125 కోట్ల బడ్జెట్‌తో భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. సాయి దుర్గ తేజ్ కెరీర్‌లో తొలి భారీ బడ్జెట్ సినిమా ఇది. సెప్టెంబర్ రెండోవారంలో తదుపరి షెడ్యూల్ ప్రారంభం కానుంది. యాక్షన్ కొరియోగ్రాఫర్ పీటర్ హెయిన్ కొరియోగ్రఫీ చేసిన అద్భుతమైన యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించనున్నారు. సాయి దుర్గ తేజ్ గత రెండు సంవత్సరాలుగా ' సంబరాల ఏటి గట్టు' కోసం పని చేస్తున్నారు. నిజానికి ఈ సినిమాను ఈ దసరాకు విడుదల చేయాలనుకున్నారు కానీ కార్మికుల సమ్మె కారణంగా విడుదల తేదీని వాయిదా వేశారు. ఈ సినిమా విడుదల ఎప్పుడు అనేది త్వరలోనే ప్రకటిస్తారు. 'హనుమాన్' బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టులలో ఈ సినిమా నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానున్న 'సంబరాల యేటి గట్టు' సినిమాను పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కిస్తున్నారు.



# 3డి యానిమేషన్ చిత్రం 'వాయుపుత్ర'




మన చరిత్ర , ఇతిహాసాలలో వాయుపుత్రుడు హనుమంతుడు ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నారు. సప్త చిరంజీవులలో ఒకరైన హనుమంతుడు తన బలం, భక్తితో కాలాన్ని అధిగమించిన శాశ్వత యోధుడు. అలాంటి గొప్ప యోధుడి కథతో 'వాయుపుత్ర' చిత్రం రూపొందుతోంది. ఇది పర్వతాలను కదిలించిన భక్తి కథ కూడా. ఇది తరాలను తీర్చిదిద్దిన, ప్రేరేపించిన హనుమంతుడి అచంచల విశ్వాసాన్ని సంగ్రహిస్తుంది.చందూ మొండేటి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సంస్థలు నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీకర ప్రొడక్షన్స్ సమర్పకులు గా వ్యవహరిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. ఈ చిత్రం చరిత్ర, భక్తి, ఆధునిక దృశ్యాలతో ఉత్కంఠభరితంగా ఉంటుంది. భారీస్థాయిలో 3డీ యానిమేషన్ చిత్రంగా రూపుదిద్దుకుంటున్న 'వాయుపుత్ర', హనుమంతుని కాలాతీత కథను గొప్ప దృశ్యకావ్యంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. 2026 దసరాకు తెలుగు, హిందీ, తమిళం, మలయాళం కన్నడ భాషలలో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ ఆకట్టుకుంటోంది. హనుమంతుడు కొండపై నిలబడి, దహనమవుతున్న లంకను చూస్తున్న శక్తివంతమైన పోస్టర్. ఇది కేవలం సినిమా కాదు, థియేటర్లను దేవాలయాలుగా మార్చే పవిత్ర దృశ్యం. మునుపెన్నడూ లేని విధంగా భక్తి పారవశ్యంలో ముంచేయడానికి ప్రేక్షకుల ముందుకు వస్తోంది అని నిర్మాత సూర్యదేవర నాగ వంశీ చెప్పారు. కథకుడిగా చందూ మొండేటి దర్శనికత, నిర్మాతగా నాగ వంశీ నైపుణ్యంతో 'వాయుపుత్ర'తెరకెక్కిస్తున్నారు. సిద్ధంగా ఉంది. 3డి యానిమేషన్ విజువల్స్‌తో జనాన్ని రంజింపచేయనున్నారు.

# 'కలలే కలలే' పాట విడుదల



కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న కొత్త సినిమా ' కేర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. ' కేర్యాంప్' సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న విడుదల కానుంది. ' కేర్యాంప్' సినిమా నుంచి మ్యాజికల్ లవ్ సాంగ్ 'కలలే కలలే' రిలీజ్ చేశారు. ఈ పాటను చైతన్య భరద్వాజ్ క్లాసీ ట్యూన్ తో కంపోజ్ చేయగా, కపిల్ కపిలన్ అందంగా పాడారు, భాస్కరభట్ల క్యాచీ లిరిక్స్ అందించారు. ' కలలే కలలే కనులకు నువు కనబడి కలలే, కథలే మొదలే వివరములే తెలియాలే, నా గుండెకేదో కబురే నీ వల్లే అందిందే, నీ చుట్టు చుట్టు తిరిగేలా చేసిందే, నాతోటి ఉండే మనసే నా మాటే వినకుందే, నీతోటి జట్టే కడుతోందే కడుతోందే, అందాల మాయ కళ్లే కాదా, ఊసులేవో నాలో పూసగుచ్చేలా నన్నే అద్దంలో చూస్తుంటే నిన్నే చూపిస్తోందే, రోజంతా అద్దంతో ఇబ్బందే, యే నీ గుండే నాలోనే అందంగా దాక్కుందే, నాక్కొంచెం చోటైనా లేకుందే..' అంటూ మంచి లవ్ ఫీల్ తో సాగుతుంది. కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా, నరేష్,సాయి కుమార్,వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్నారు.

# గవర్నర్ కట్టుబడాలి

(మొదటి పేజీ తరువాయి)

తన వాదనలు వినిపించారు. రాష్ట్రపతి సూచనకు సమాధానం ఇస్తూనే బిల్లుపై విచారణను జరపడం ద్వారా ప్రభుత్వం స్వాభావిక పక్షపాతాన్ని కూడా సుప్రీంకోర్టు పరిశీలించాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన తమిళనాడు గురించి ప్రస్తావించారు. తమిళనాడులో గవర్నర్‌ను ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ఛాన్స్‌లర్ పదవి నుంచి తొలగించాలని శాసనసభ ఆమోదించిన బిల్లును ప్రభుత్వం ప్రస్తావించిన సందర్భంలో రాష్ట్రపతి సూచనపై 9వ రోజు విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కోర్టు దానిని పరిశీలించాల్సి ఉంటుందని చెప్పారు. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, విక్రమ్‌నాథ్ పిఎస్.నరసింహ, ఎఎస్. చందుర్కర్‌లు కూడా ప్రాతినిథ్యం వహిస్తున్న ధర్మాసనం ముందు సీనియర్ అడ్వకేట్ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టికల్ 200 కింద రెండవ నిబంధన వాస్తవానికి గవర్నర్‌కు ఎటువంటి విచక్షణ ఉండదని, మంత్రి మండలి సహాయం, సలహాకు కట్టుబడి ఉంటారనే వాస్తవాలను సూచిస్తుందని నిరంజన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులకు సంబంధించి గవర్నర్ల అధికారాలను ఆర్టికల్ 200నియంత్రిస్తుంది. వారు బిల్లును అంగీకరించడానికి, సమ్మతిని నిలిపివేయడానికి, బిల్లును పున: పరిశీలన కోసం తిరిగి ఇవ్వడానికి లేదా బిల్లును రాష్ట్రపతి పరిశీలన కోసం రిజర్వ్ చేయడానికి వీలు కల్పిస్తుంది. విచారణ కొనసాగుతోంది. గవర్నర్ వివాదంపై తమిళనాడు కేసులో ఏప్రిల్ 8న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా రాష్ట్రపతి సూచనను వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షపాలిత రాష్ట్రాల వాదనలు బుధవారం నాడు ముగిసే అవకాశం ఉంది. ఆమోదించిన బిల్లులకు ఆమోదం తెలిపే అధికారాలను నియంత్రించే ఆర్టికల్ 200లో 'సాధ్యమైనంత త్వరగా' అనే పదం లేకపోయినా గవర్నర్లు 'సహేతుకమైన సమయంలో' వ్యవహరించాలని మంగళవారం సుప్రీంకోర్టు పేర్కొంది.

# ఖైదీల సంస్కరణ మనందరి సామాజిక బాధ్యత

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్: జైళ్లు నిరాశకు కేంద్రాలుగా కాకుండా, ఆశలు, ఆకాంక్షలకు చిహ్నాలుగా మారాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆకాంక్షించారు. 'ఏడో ఆలిండియా ప్రిజన్ డ్యూటీ మీట్ 2025' సందర్భంగా ఆర్‌బివిఆర్‌ఆర్ తెలంగాణ పోలీసు అకాడమీలో బుధవారం ఏర్పాటు చేసిన 'కల్చరల్ నైట్'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జైళ్లను కేవలం శిక్షా కేంద్రాలుగా కాకుండా, వాటిని మానవత్వంతో కూడిన సంస్కరణలకు వేదికలుగా తీర్చి దిద్దేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఖైదీలలో మార్పు తీసుకొచ్చేందుకు తెలంగాణ జైళ్ల శాఖ చేపట్టిన కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచాయని కొనియాడారు. 'జైళ్ల గోడల మధ్య భారతదేశపు భిన్నత్వం కనిపిస్తుంది. వివిధ రాష్ట్రాలు, భాషలు, మతాలు, సంస్కృతులకు చెందిన ఖైదీలు ఉంటారు. వీరికి ఒకే రకమైన సంస్కరణ విధానం సరిపోదు. అందుకే వారి వ్యక్తిగత పరిస్థితులను అర్థం చేసుకొని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా చర్యలు చేపట్టాలి' అని అధికారులకు సూచించారు. జైళ్లను సాంకేతికతతో అనుసంధానించి ఖైదీలకు డిజిటల్ విద్య, నైపుణ్య శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పునరావాస కార్యక్రమాలు, ఖైదీల ఆరోగ్యం, మానసిక స్థితిని పర్యవేక్షించడానికి కూడా టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకోవడంపై దృష్టి సారించామన్నారు. ఖైదీల్లో సంస్కరణ అనేది కేవలం జైళ్ల శాఖ బాధ్యత మాత్రమే కాదని, అది మనందరి సామాజిక బాధ్యత అని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జైళ్ల శాఖ డిజి సౌమ్య మిశ్రా, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి తదితరులు పాల్గొన్నారు.



# నేపాల్‌లో ఆర్మీ నిషేధాజ్ఞలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించింది. ఇదిలా ఉండగా నేపాల్‌లో ఇలాంటి పరిణామాలు సంభవించడానికి గల కారణాలున ఏమిటో లోతుగా దర్యాప్తు చేయాలని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ కోరారు. ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి రాజీనామా తర్వాత వేలాదిమంది విద్యార్థులు, జనరేషన్ జెడ్ ఉద్యమ యువకులు అంతకుముందు మంగళవారం అర్థరాత్రి దాటేవరకూ ఖాట్మండు వీధుల్లో ఆనందోత్సాహాలను పంచుకుంటూ కేరింతలు కొట్టారు. సైన్యం పూర్తిగా రంగంలోకి దిగి దేశమంతటా నిషేధాజ్ఞలు అమలులోకి తీసుకువచ్చింది. అన్ని ప్రాంతాలలో గట్టి గస్తీ కార్యకలాపాలు చేపట్టింది. పదవీత్యాగం చేసిన ఓలి రాజకీయ సంక్షోభం ముగిసేవరకూ దేశాన్ని కనిపెట్టుకుని ఉండాలని ఉన్నతస్థాయి సైనికాధికారులకు ఆదేశాలు ఇచ్చారని మంగళవారంనాడే వార్తలు వెలువడ్డాయి. విద్యార్థులు మంత్రులపైన భౌతిక దాడులు చేస్తూ వారి ప్రైవేటు నివాసాలను దగ్ధం చేయడంతో అధికారపక్ష కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళిపోయియి. ఆవేశంతో ఆందోళనకారులు మంత్రుల ఇళ్ళు దగ్ధం చేసినప్పుడు మాజీ ప్రధానమంత్రి షేర్ బహదూర్ దేవ్‌బా ఇంటిని కూడా దగ్ధం చేశారు. ఆ సమయంలో ఆయన భార్య అర్జు దేవ్‌బా ఆందోళనకారులు దాడి చేశారు. ఆర్థికమంత్రి బిష్ణుప్రసాద్‌ను వీధుల్లో తరిమికొట్టి ఎగిరి కాలితో తన్ని దృశ్యాలన్నీ వీడియోల ద్వారా వైరల్ అవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కె.పి.శర్మ ఓలి దుబాయ్ పారిపోయారని వదంతులు వచ్చాయి. కానీ సైన్యాధికారులు ఆయనను ప్రధాన సైనిక కేంద్ర కార్యాలయానికి తరలించారు. ఆ తర్వాత నుండి ఆయన జాడ ప్రపంచానికి తెలియలేదు. మరోవైపు నేపాల్‌లో రెండు ప్రధాన విమానాశ్రయాల నుండి విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. సుప్రీంకోర్టు కూడా తదుపరి ప్రకటన వెలువడేవరకూ కేసుల విచారణ చేపట్టేదిలేదని ప్రకటించింది. సుప్రీం కోర్టు భవనాలపైన, జైళ్ళపైన కూడా ఆందోళనకారులు దాడులు చేశారని ఇంతకుముందే వార్తలు వెలువడ్డాయి. మంత్రివర్గం రద్దుకావడంతో తర్వాత రాజకీయ భవితవ్యం ఏమిటనే విషయంలో తీవ్ర గందరగోళం, అనిశ్చితి నెలకుంది.

**జనరేషన్ జెడ్ ఉద్యమం వెనుక....**

నేపాల్‌లో రాజకీయపార్టీల నాయకులు, సంపన్నుల కుటుంబీకులు అవినీతి సొమ్ముతో విలాసాలు చేస్తున్నారని, సోషల్ మీడియాపై నిషేధం కాకుండా అవినీతిని అరికట్టాలని కొద్దిరోజులుగా నేపాల్‌లో విస్తారంగా ప్రచారం ఊపు అందుకుంది. దీనిని ప్రభుత్వ వ్యతిరేక దుష్ప్రచారంగా ఓలి ప్రభుత్వం పేర్కొంది. ఐతే జనరేషన్ జెడ్ మూమెంట్ (జిజెడ్‌ఎం)ను దేశంలో ప్రధానంగా నడిపించిన సుదన్ గురుంగ్ (36) పేరు ఇప్పుడు నేపాల్‌లో ప్రముఖంగా వినిస్తోంది. ''హామీ నేపాల్'' పేరుతో ఆయన ఒక ఎన్‌జిఓ సంస్థ నడుపుతూ ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు. చాలా నెలలుగా సోషల్ మీడియా ప్రచారం ద్వారా ఈ ఉద్యమాన్ని దాదాపు ఆయనే ఈనాడు ఈ స్థితికి తెచ్చారు. 2015లో నేపాల్‌లో భూకంపం వచ్చినప్పుడు కుటుంబాన్ని సర్వస్వాన్ని కోల్పోయిన గురుంగ్ ఆ తర్వాత ఒక ప్రభుత్వేతర స్వచ్ఛంధసంస్థ స్థాపించి సేవాకార్యక్రమాల పేరుతో తెరమీదకు వచ్చారు.

**సుశీల కర్కిని ప్రధానమంత్రిని చెయ్యండి**

నేపాల్ సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కిని తాత్కాలిక ప్రధానమంత్రిగా నియమించాలని జనరేషన్ జెడ్ మూమెంట్ డిమాండ్ చేసింది. రాబోయేకాలంలో జరిగే చర్చలకు వీలుగా ఆయన ప్రధానమంత్రిగా నియమితులైతే చర్చలు ఫలవంతంగా ఉంటాయని జనరేషన్ జెడ్ మూమెంట్ పేర్కొంది. రాజకీయ పార్టీలతో యువకులు ఎవ్వరూ చర్చలు జరిపేదిలేదని, కర్కీ ఒక తటస్థమైన వ్యక్తిగా, మచ్చలేని వ్యక్తిగా పేరుపడినందువల్ల ఆయనను తాత్కాలిక ప్రధానమంత్రిగా నియమించాలని జిజెడ్‌ఎం కోరింది.

# ఉద్యమ నేత సురవరం

(మొదటి పేజీ తరువాయి)




కమ్యూనిస్టులు చేసిన పోరాటంలో తాను ఎప్పుడు సంఘీభావం తెలిపానన్నారు.

**నల్లగొండలో సురవరం విగ్రహ ఏర్పాటుకు కృషి :మంత్రి కోమటిరెడ్డి**

దేశంలో కార్మికుల, కర్షకుల సమస్యల పరిష్కారం కోసం పార్లమెంట్లో తన తన గళాన్ని విప్పిన గొప్ప కమ్యూనిస్టు మేధావి సురవరం సుధాకర్ రెడ్డి అని తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కామ్రేడ్ అంటే వంద మందితో సమానమని ఒక్కడు ఉన్నా ఎర్రజెండాతో అన్యాయాన్ని ప్రశ్నిస్తారని గుర్తు చేశారు. కమ్యూనిస్టులు అంటే తనకు ఎంతో గౌరవం అని వారు చేసే పోరాటం.. ఆరాటం ఎప్పటికీ పదవుల కోసం కాదని పేద ప్రజల కోసమేనని పేర్కొన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి నలగొండ జిల్లాకు చేసిన సేవలను గుర్తిస్తూ జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహం నెలకొల్పడంతో పాటు ఓ మంచి కార్యక్రమానికి పేరు పెట్టేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**ప్రజా ఉద్యమ దిక్సూచి సురవరం :కూనంనేని**

ప్రజా జీవితంలో ఎన్నో ఉద్యమాలకు నేతృత్వం వహించి చారిత్రిక ఉద్యమ విజయాలను చవిచూ సిన సురవరం సుధాకర్ రెడ్డి ప్రజా ఉద్యమ దిక్సూచి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. విద్యార్థి దశ నుంచే ధిక్కార స్వరంతో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన సురవరం అంచలంచెలుగా ఎదిగి కమ్యూనిస్టు పార్టీలో అత్యున్నత స్థాయికి చేరారని ఆయన జీవితం ఎందరికో ఆదర్శమని ఆయన స్ఫూర్తి భవిష్యత్తు ఉద్యమానికి ప్రేరణ అని ఆయన తెలిపారు. సురవరం సుధాకర్ రెడ్డి నిరంతర అధ్యయనశీలి అని అన్నారు. తన వాదన పటిమతో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపారన్నారు. కమ్యూనిస్టులు మరణించి సైతం ప్రజల మదిలో జీవిస్తారని సుధాకర్‌రెడ్డి అదే కోవకు చెందిన వారన్నారు.

**సుధాకర్ రెడ్డి జీవితం తెరిచిన పుస్తకం : పల్లా వెంకటరెడ్డి**

సువరం సుధాకర్ రెడ్డి జీవితం మొత్తం తెరిచిన పుస్తకమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి అన్నారు. సురవరం ఓ ఆదర్శవంతుడు, మేధావులలో మేధావి, సామాన్య కార్యకర్తల్లో ఓ కార్యకర్తగా ప్రతి ఒక్కరితో కలిసిపోయే మానవతావాది అని కొనియాడారు. నల్లగొండ పార్లమెంట్ సభ్యులుగా ఆయన అనేక కుంభకోణాలను వెలుగులోకి తీసుకువచ్చారన్నారు. దేశవ్యాప్తంగా జాతీ య ఉపాధి హామీ పథకం రూపకల్పనలో సురవరం సుధాకర్రెడ్డి కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. 2004లో తాను ఎమ్మెల్యేగా సుధాకర్ రెడ్డి ఎంపిగా పనిచేస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సిపిఐ మహాసభలు నిర్వహించడం జరిగిందని అదేవిధంగా సిపిఐ 100సంవత్సరాల ప్రారంభోత్సవ సభ నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన సభకు సురవరం సుధాకర్‌రెడ్డి పాల్గొని ఉత్తేజపరిచిన ప్రసంగాన్ని ప్రజలు మర్చిపోలేరని గుర్తు చేశారు.

**సురవరం గొప్ప కమ్యూనిస్టు మేధావి : జూలకంటి రంగారెడ్డి**

కమ్యూనిస్టు మేధావులలో తెలుగు తేజం సురవరం సుధాకర్ రెడ్డి ఒక్కరిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. దేశ ప్రజలు సంపూర్ణమైన ఆరోగ్యంతో ఉండాలని దోపిడీ లేని సమసమాజ స్థాపన కోసం నిరంతరం పాటు పడిన వ్యక్తి సురవరం సుధాకర్ రెడ్డి అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ఎర్రజెండాలు కలిసి ఐక్య ఉద్యమాలు నడిపేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

**పేద ప్రజల కోసం ప్రశ్నించిన గొంతుక సురవరం : నెల్లికంటి**

పేద ప్రజల హక్కుల కోసం జీవితాంతం ప్రశ్నించే గొంతుక సురవరం సుధాకర్ రెడ్డి మరణం అన్ని వర్గాల ప్రజలకు తీరంలోటని అన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్‌సి నెల్లికం టి సత్యం అన్నారు. తెలంగాణ రైతంగ సాయుధ పోరాట కుటుంబం నుంచి వచ్చిన సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి యువజన కమ్యూనిస్టు ఉద్యమాలలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు నల్లగొండ జిల్లాలో సాగు తాగునీరు కోసం పాదయాత్ర నిర్వహించి ప్రభుత్వాన్ని నిలదీసిన ఉద్యమ నాయకుడని కొనియాడారు.

**ప్రశ్నించే తత్వం కమ్యూనిస్టులదే:ఎంఎల్‌సి శంకర్ నాయక్**

ప్రశ్నించడం కమ్యూనిస్టుల ద్వారా నేర్చుకోవాలని నల్లగొండ పార్లమెంట్ సభ్యులుగా సురవరం సుధాకర్ రెడ్డి జిల్లా సమస్యలపై పార్లమెంట్ లో ప్రభుత్వాలకు ప్రశ్నల వర్షం కురిపించిన గొప్ప మేధావి అని డిసిసి అధ్యక్షులు,ఎంఎల్‌సి శంకర్ నాయక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో పోరాటంలో సిపిఐ కీలకపాత్ర పోషించిందని కమ్యూనిస్టుల డిమాండ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని చెప్పుకొచ్చారు.

కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి ఉజ్జిని రత్నాకర్ రావు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య, సహాయ కార్యదర్శిలు పల్లా దేవేందర్ రెడ్డి లోడింగ్ శ్రవణ్ కుమార్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె శ్రీనివాస్ పల్లె నరసింహ, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుమ్మల మోహన్ రెడ్డి సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉజ్జిని యాదగిరి రావు పబ్బు వీరస్వామి, గురిజ రామచంద్రం, బంటు వెంకటేశ్వర్లు బోల్లగిరి నరసింహ, తిర్పారి వెంకటేశ్వర్లు, ఆర్ అంజ చారి, తూము బుచ్చి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president Palla Venkat Reddy, Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 Editor : Makkena Subbarao, E-mail : editorprajapaksham@gmail.com